తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 26.07.2025 | సంపుటి :12 సంచిక : 07 | పేజీలు :12 వెల : రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి 98483 28698




## పిల్లలు కిలోమీటర్ల మేర ఎలా నడుస్తారు?

- కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ,



విలీనం పేరుతో యూపీ ప్రభుత్వం దాదాపు 5వేల ప్రభుత్వ పాఠశా లలను మూసి వేయబోతోంది. ఉపాధ్యాయ సంఘాల లె క్కల ప్రకారం, ప్రభుత్వం దాదాపు 27వేలపాఠశాలలను మూ సివే యాలని భావిస్తోంది. యూపీఏ సర్కారు వి ద్యాహక్కుచట్టాన్ని ప్రవేశపెట్టి పేద కుటుం బాల పిల్లలకు మిగతా 2లో..

## ప్రచారం కోసం కోట్లు.. పాఠశాలలకే డబ్బు లేదు

- ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్



పేద కుటుంబాల పిల్లలకు విద్యను అందకుండా చేసే కుట్రే పాఠశాలల విలీన విధానం. వేలాది ప్రాథమిక పాఠశాలలను మూసివే యాలని యోగి సర్కార్ తీసుకున్న నిర్ణయం పిల్లల భవిష్యత్తును నాశనం చేయబో తోంది. బిజెపి తన ప్రచారం కోసం బిలి యన్ల రూపాయలు ఖర్చుచేస్తోంది కానీ.. మిగతా 2లో..

## 27వేల స్కూళ్లకు బదులు 27వేల కొత్త మద్యం షాపులు

- ఆమ్ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్,



వేలాది సర్కారు పాఠశాలలను మూసివేసినందుకు గానూ ఆప్ ఆధ్వర్యంలో 'స్కూల్ బచావో అభియాన్' (స్కూల్స్ సేవ్ క్యాంపెయిన్) ప్రారంభించాం. అదేవిధంగా 'మద్యం దుకాణాలు కాదు, పాఠశాలలు అవసరం' అనే నినాదంతో స్థానికులతో మిగతా 2లో..





# హుళక్కి!



## దళిత,మైనారిటీ,గిరిజనులు, బలహీనవర్గాలకు ఇక అందని విద్యే

### ప్రతియేటా యూపీలో వేలాది పాఠశాలలను మూసివేస్తున్న బీజేపీ ప్రభుత్వం

- తక్కువ సంఖ్య పేరిట స్కూళ్ల తగ్గించేందుకు నిర్ణయం
- ఇప్పటికే మహిళల్లో 57శాతానికి మించని అక్షరాస్యత
- 27వేల స్కూళ్లను మూసి.. 27వేల కొత్త మద్యం షాపులకు అనుమతి!
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు



లింగ అసమానతలు.. వివక్షత, మూఢత్వాలకు ఆలవాలమైన ఉత్తర్‌ప్రదేశ్‌లో పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇకపై ప్రభుత్వ విద్య అందని ద్రాక్షలా మారనుంది. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రాథమిక విద్యను సైతం దూరం చేయనుండటంతో దళిత, మైనార్టీ, గిరిజనులతో పాటు అణగారిన వర్గాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. తక్కువ సంఖ్య పేరిట ప్రభుత్వ బడులు తగ్గిస్తున్న సర్కారు.. ప్రైవేటు స్కూళ్ల పెంపుదలకు మాత్రం శరవేగంగా అనుమతులిస్తున్నట్టు తెలుస్తోంది. గత కొన్నేళ్లలో 40శాతం ప్రైవేటు విద్యాసంస్థల పెరుగుతుదల ఉండటమే అందుకు నిదర్శనంగా మారింది. యూపీలోని బీజేపీ సర్కారు తీరుకు నిరసనగా విద్యావంతులు, మేధావులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్దఎత్తున నిరసనలు తెలుపుతుండగా.. పిల్లలు సైతం కన్నీళ్లు పెడుతూ రోడ్డెక్కుతున్నారు.



తాము రోజూ వెళ్లే పాఠశాలను ప్రభుత్వం మూసేయడంతో స్కూల్ గేటు ఎదుట బోరున విలపిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

స్పెషల్ కరస్పాండెంట్ (జనంసాక్షి) :

అక్షరాస్యత తక్కువగా రాష్ట్రాల్లో ఉత్తర్‌ప్రదేశ్ ఒకటి. మూఢనమ్మకాలు, మహిళలపై వివక్షలోనూ ఆ రాష్ట్రం నిత్యం వార్తల్లో నిలుస్తోంది. అయితే వరుసగా రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను క్రమంగా తగ్గిస్తోంది. 50 మంది విద్యార్థులకంటే తక్కువ సంఖ్య ఉన్నందున ఈయేడు మే నాటికి 5వేల పాఠశాల లను మూసివేసింది. కొన్ని ఉపాధ్యాయ సం ఘాల లెక్కల ప్రకారం మిగతా 2లో..



యూపీ ప్రభుత్వం పాఠశాలలను మూసివేయడాన్ని నిరసిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్షాలు, స్వచ్ఛంధ సంస్థలు, ప్రజలు

# తెలంగాణ కులగణన భూకంపం సృష్టించింది




## అన్ని కాంగ్రెస్ పాలితరాష్ట్రాల్లో నిర్వహిస్తాం: రాహుల్

## ఆర్ఎస్ఎస్,భాజపాలు ఓబీసీల చరిత్రను చెరిపివేశాయి

- భారత ఉత్పాదక శక్తికి ఓబీసీలు ప్రతీకలు
- అన్ని రంగాల్లో వివక్ష ఎదురవుతోంది
- వారి ప్రయోజనాలను కాపాడటం కోసం నేను చేయగలిగినంత చేయలేకపోయాను
- ఆ పొరపాటును ఇప్పుడు సరిదిద్దుకోవాలని అనుకుంటున్నా..
- బాగిదారి న్యాయ మహా సమ్మేళనంలో రాహుల్ గాంధీ ప్రసంగం

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత ఉత్పాదక శక్తికి ఓబీసీలు ప్రతీకలని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. అలాంటి వారికి అన్ని రంగాల్లో వివక్ష ఎదురవుతోందని ఆరోపించారు.ఢిల్లీలో జరిగిన బాగిదారి న్యాయ మహా సమ్మేళనం కార్యక్రమంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాజపా, ఆర్ఎస్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. ఓబీసీల చరిత్రను ఉద్దేశపూర్వకంగా చెరిపేశారని దుయ్యబట్టారు. "2004 నుంచి నేను రాజకీయాల్లో ఉన్నాను. ఈ రెండు దశాబ్దాల కాలం వెనుదిరిగి చూసుకుంటే.. ఓబీసీల ప్రయోజనాలను కా పాడటం కోసం నేను చేయగలిగినంత చేయలేకపో యానని అనిపిస్తోంది. ఆ పొరపాటును ఇప్పుడు సరిది ద్దుకోవాలని అనుకుంటున్నా. సమస్యలు సరిగా అర్థం చేసుకుంటేనే పరిష్కారం సాధించగలం. అందుకోసం చరిత్ర తెలుసుకోవాలి. దేశంలో దళితుల చరిత్రను అం బేద్కర్ అర్థం చేసుకున్నారు. ఓబీసీల చరిత్ర ఎక్క డుంది. భాజపా ఆర్ఎస్ఎస్ ఉద్దేశపూర్వకంగా ఆ చరి త్రను చెరిపేశాయి" అని రాహుల్ గాంధీ మండిపడ్డారు. "ఓబీసీలు ఉత్పాదకశక్తికి ప్రతీకలు. మిగతా 2లో..



## కదిలిన మామునూరు ఎయిర్‌పోర్ట్

నిర్మాణంలో మరో కీలక ముందడుగు

భూసేకరణకు రూ.205 కోట్లు విడుదల వార్త 2లో

నియోజకవర్గాల పునర్విభజన

## పిటిషన్ కొట్టివేత

దీనిని ఆమోదించలేం : సుప్రీం

దీనివల్ల ఇతర రాష్ట్రాల్లో సమస్యలు వస్తాయన్న ధర్మాసనం

# హైదరాబాద్ డ్రోన్లు పాక్‌లో విధ్వంసం సృష్టించాయి

డ్రోన్ టెక్నాలజీలో తెలంగాణ గణనీయ అభివృద్ధి సాధించింది

హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌కు ఎస్తోనియా సహకారం తీసుకుంటాం

వాణిజ్యం, ఏఐ సాంకేతికత, సైబర్ సెక్యూరిటీలో కూడా కలిసి పనిచేయాలి

సచివాలయంలో ఆ దేశ వాణిజ్య ప్రతినిధుల బృందంతో మంత్రి శ్రీధర్‌బాబు భేటీ

హైదరాబాద్(జనంసాక్షి):డ్రోన్‌టెక్నాలజీలో తెలంగాణ గణనీయ అభివృద్ధి సాధించిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లో తయారైన డ్రోన్లు 'ఆపరేషన్ సిందూర్'లో పాకిస్థాన్‌కు భారీ నష్టం కలిగించాయని చెప్పారు. ఎస్తోనియా దేశ రాయబారి మ్యారియే లూప్ ఆధ్వర్యంలో ఆ దేశ వాణిజ్య ప్రతినిధుల బృందంతో సచివాలయంలో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. ఈ-గవర్నెన్స్, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌లో ప్రపంచంలోనే అద్భుత ప్రగతి సాధిం చిన ఎస్తోనియా సహకారం తీసుకుంటా మన్నారు. వాణిజ్యం, ఏఐ సాంకేతికత, సైబర్ సెక్యూరిటీలో కూడా కలిసి పనిచేయాలని ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని మంత్రి కోరారు.ఫుడ్ ప్రాసెసింగ్, బ్రాండెడ్ మద్యం ఉత్పత్తి రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉందని.. తమతో కలిసి పనిచేసే విషయాన్ని పరిశీలించాలని మంత్రి



సూచించారు. సెప్టెంబరులో తమ దేశం సందర్శించాలని శ్రీధర్‌బాబును ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్ కోరారు. తమ అధికారుల బృందం వచ్చి.. విద్య, ఈ-గవర్నెన్స్, ఏఐ, రోబోటిక్స్‌లో

తెలంగాణలో వృత్తి విద్య కళాశాలల్లో ఫీజుల నిర్ధారణకు

## కమిటీ

ఉమ్మడి జిల్లాలకు

## ప్రత్యేక అధికారులు

నియమించిన తెలంగాణ ప్రభుత్వం

అశ్లీల కంటెంట్

## యాప్‌లపై కొరడా

నిషిధించిన కేంద్రం ప్రభుత్వం

నిబంధనలు ఉల్లంఘిస్తే

కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

పై వార్తల వివరాలు 2లో

## పదునెక్కుతున్న యుద్ధతంత్రం

- డ్రోన్ నుంచి క్షిపణి ప్రయోగం సక్సెస్
- డీఆర్‌డీవో ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజిలో విజయవంతంగా పరీక్ష
- అభినంధించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత సాయుధ దళాల డ్రోన్ యుద్ధతంత్రాన్ని మరింత పదును తేల్చే ఆయుధాన్ని కర్నూలు జిల్లాలో పరీక్షించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన ఓ క్షిపణిని యూఏవీ లాంచ్‌డ్ ప్రెసిషన్ గైడెడ్ మిసైల్ (యూఎల్‌పీజీఎం)-వీ3 గా వ్యవహరిస్తున్నారు. కర్నూలు మిగతా 2లో..



ఆకాశంలో డ్రోన్ నుంచి దూసుకెళ్తున్న క్షిపణి

# మళ్లీ అధికారం మాదే..

## 14 ఏళ్ల పోరాటం చేసి కేసీఆర్ తెలంగాణ సాధించారు

- ఆయన మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కుబుద్ధి చెప్పాల్సిందే
- కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు కాగితాలు ఇచ్చి గొప్పలు
- గురుకులాల్లో విద్యార్థులకు విషం పెడుతున్నారు
- లింగంపేట 'ఆత్మగౌరవ గర్జన' సభలో కేటీఆర్



కామారెడ్డిప్రతినిధి(జనంసాక్షి): సీఎం రేవంత్‌లో అపరిచితుడు ఉన్నాడు.. ఒక్కోసారి రెమో, రామ్‌లా కనిపిస్తాడని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రజ లకు నిజమైన ముఖాన్ని చూపకుండా నటిస్తున్నాడని మండిపడ్డారు. స్థానిక సం స్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. మీ ఓటే తూ టా.. కాంగ్రెస్ బట్టలు విప్పాలి అన్నారు. ఇక, రైతులకు ఇవ్వాల్సిన రైతు బంధు నిధులు ఇంకా అందలేదు.. కానీ, మూ టలు ఢిల్లీకి వెళ్తున్నాయి.. రాహుల్ గాంధీ ఖాతాలో డబ్బులు పడుతున్నాయ్ అంటూ కేటీఆర్ ఆరోపించారు. కామారెడ్డి జిల్లా లింగంపేటలో బీఆర్ఎస్ పార్టీ ఘనంగా నిర్వహించిన ఆత్మగర్జన సభలో కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, మిగతా 2లో..

## సభ సజావుగా సాగేలా సహకరించండి

- అఖిలపక్ష భేటీలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా
- ప్రతిపక్షాల డిమాండ్లపై కేంద్రం సానుకూలం

వార్త 2లో

## శ్రీలక్ష్మికి దక్కని ఊరట

విచారణ ఎదుర్కోవాల్సిందే

రివ్యూ పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు 2లో

## రాజస్థాన్‌లో విషాదం

కూలిన పాఠశాల పైకప్పు..

ఆరుగురు చిన్నారులు మృతి

రాష్ట్రపతి, ప్రధాని సంతాపం..



వార్త 9లో

# బీసీ రిజర్వేషన్లను బీజేపీ నీరుగార్చే యత్నం



- తెలంగాణలో జరిగిన కులగణనపై దేశవ్యాప్తంగా చర్చ
- బీసీల వ్యతిరేక పార్టీ బీజేపీ.. అభ్యంతరాలను అసెంబ్లీలో లేవనెత్తాల్సింది
- రాష్ట్రంలో భాజపా బతికేందుకు ఎంఐఎం జపం చేస్తోంది : మంత్రి పొన్నం ప్రభాకర్

న్యూఢిల్లీ(జనంసాక్షి) : ఢిల్లీలో అఖిల భారత నాయకత్వంతో కీలక సమావేశాలు జరిగాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం ఖర్గే నివాసంలో తెలంగాణలో కులగణన, బీసీ రిజర్వేషన్లపై చర్చ జరిగిందని, భారత్ జోడో యాత్రలో అసమానతలు గమనించి కులగణన చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని కేంద్రంలో అధికారంలోకి రాకపోయినా తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కుల గణన చేసిందని అన్నారు. వార్త 12లో

## బీసీని ప్రధానిని చేసిన ఘనత బీజేపీది

కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లు తప్పుల తడక

మీడియా సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



వార్త 2లో

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
26.07.2025

## బీసీని ప్రధానిని చేసిన ఘనత బీజేపీది

**హైదరాబాద్(జనంసాక్షి):**రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న రిజర్వేషన్లతో నిజమైన బిసిలు నష్టపోతారని బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. బిసిలకు రిజర్వేషన్ పేరుతో ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తున్నారని అన్నారు. నాంపల్లిలో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..10 శాతం ఈబిసి రిజర్వేషన్లను ముస్లింలు కూడా పొందుతున్నారని తెలియజేశారు. 42 శాతం రిజర్వేషన్లతో బిసిలకు న్యాయం జరగదని చెప్పారు. బిసి రిజర్వేషన్ వల్ల ఎంఐఎం పార్టీకే లబ్ధి చేకూరుతుందని అన్నారు. బిసిని ముఖ్యమంత్రి చేసిన చరిత్ర కాంగ్రెస్ కు ఉందా అని ప్రశ్నించారు.బిసిని ప్రధానిని చేసిన ఘనత బిజెపిదే అని కొనియాడారు. రాజకీయ లబ్ది కోసమే బిసి రిజర్వేషన్ అంశాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎత్తుకుందని విమర్శించారు. ప్రజలు తిరస్కరిస్తున్నా కాంగ్రెస్ కు బుద్ధి రాలేదని మండిపడ్డారు. అధికారంలో ఉన్న 3 రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓడిపోతుందని, నరేంద్ర మోడీ కులాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే బిసి జాబితాలో చేర్చిందని చెప్పారు. పెంచిన బిసి రిజర్వేషన్లతోనే ఎన్నికలు జరగాలని కోరుకుంటున్నాం అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే హైదరాబాద్ మెట్రో ఫేస్- 2 గురించి తెలంగాణ ముఖ్యమంత్రి పచ్చి అబద్ధాలు చెబుతున్నారు అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. ఈ మధ్యనే డీపీఆర్ కేంద్రానికి వచ్చింది.. మెట్రోపై అవగాహన లేకుండా రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడుతుంది.. మెట్రో గురించి కాంగ్రెస్ సర్కార్ ఇంకా సమాచారం ఇవ్వాల్సి ఉంది.. సీఎంకి మెట్రో గురించి అవగాహన లేదు.. మెట్రో లైన్ల నిర్వాహణ ఎవరు చేస్తారు.. నష్టాలు ఎవరు భరిస్తారు.. గతంలో ఇచ్చిన సంస్థకు రెండో దశ నిర్మాణ నిర్వాహణ ఇస్తారా.. కొత్త సంస్థ వస్తే వాటితో సమన్వయం ఒప్పందం అంశాలు కేంద్రానికి తెలియజేయాల్సి ఉంటు-ందన్నారు. మెట్రో విషయంలో కేంద్రం రాష్ట్రానికి సహకారంతో పాటు- నిధులను ఇస్తుంది.. మెట్రో విషయంలో కేంద్ర- రాష్ట్ర అధికారులతో సమావేశం ఏర్పాటు-కు మోడీ సర్కార్ సిద్ధంగా ఉంది అని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇక, నేను రాష్ట్ర అంశాలను అనేక సార్లు కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లాను అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వేసే పనికిరాని ప్రశ్నలకు నేను సమాధానం చెప్పాను అని తేల్చి చెప్పారు. కేసీఆర్ ను కాపాడాలని రాహుల్ గాంధీ చూస్తున్నారు.. కాంగ్రెస్- బీఆర్ఎస్ పార్టీల మధ్య అవగాహన కుదిరింది.. ఇక, బండి సంజయ్- ఈటల రాజేందర్ విషయంలో బీజేపీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని కిషన్ రెడ్డి తెలిపారు.

## సభ సజావుగా సాగేలా సహకరించండి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నాటినుంచి విపక్షాల నిరసనలతో ఉభయ సభలు స్తంభిస్తూనే ఉన్నాయి. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రతిపక్షాలు ప్రతిరోజూ ఆందోళన చేస్తుండటంతో సభలు వరుసగా వాయిదా పడుతున్నాయి. శుక్రవారం కూడా ఉభయసభల కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. ఈనేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నేడు తన ఛాంబర్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సహా పలు రాజకీయ పార్టీలకు చెందిన సీనియర్ నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగేలా సభ్యులంతా సహకరించాలని స్పీకర్ కోరారు. సోమవారం నుంచి 'ఆపరేషన్ సిందూర్ 'పై చర్చ జరిపేందుకు కేంద్రం అంగీకరించింది. దీనిపై ప్రతిపక్షాలు లేవనెత్తిన కొన్ని డిమాండ్లపై కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. కేంద్రం, ప్రతిపక్ష నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో సోమవారం నుంచి లోక్‌సభ కార్యకలాపాలు సజావుగా జరగనున్నట్లు తెలుస్తోంది. పాక్ ఉగ్రవాద స్థావరాల మీద మన సైన్యం ఇటీవల విజయవంతంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటులో చర్చకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే. విపక్షాల డిమాండ్ మేరకు ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు ఒక్కో సభలో మొత్తంగా 16 గంటల సమయం కేటాయించారు. తిరిగొచ్చిన తర్వాత.. 28న దిగువ సభలో, మరుసటిరోజు ఎగువసభలో చర్చ ప్రారంభం కానుంది. చర్చకు మోదీ సమాధానం ఇస్తారా, లేదా అనేది ఇంకా తేలకపోయినా.. ఉగ్రవాదంపై భారత్ వైఖరిని విదేశాలకూ మరోసారి స్పష్టం చేసేలా ఆయన మాట్లాడే అవకాశం ఉందని భాజపా సీనియర్ నేత ఒకరు వెల్లడించారు.

## హైదరాబాద్ డ్రోన్లు పాక్‌లో విధ్వంసం సృష్టించాయి

పరస్పరం సహకారంపై చర్చిస్తుందని మంత్రి తెలిపారు. సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక సీఎస్ సంజయ్ కుమార్, మీ సేవ కమిషనర్ రవికిరణ్, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## మాల్దీవులు భారత్‌కు అత్యంత విశ్వసనీయ దేశం

**ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యం'పై చర్చలు ప్రారంభమయ్యాయి**
**ఆ దేశ పర్యటనలో ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్‌కు మాల్దీవులు అత్యంత విశ్వసనీయ దేశమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 'పొరుగుకే తొలి ప్రాధాన్యం' కింద ఆ దేశానికి ప్రముఖ స్థానం ఉందన్న ఆయన.. లైన్ ఆఫ్ క్రెడిట్ కింద రూ.4850 కోట్ల ఆర్థిక సాయం కొనసాగిస్తామన్నారు. ఆ దేశ అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జుతో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. వాణిజ్య, రక్షణ మౌలిక వసతులు తదితర రంగాల్లో పరస్పర సహకారానికి ఇరు దేశాలు అంగీకరించాయని చెప్పారు.భారత్-మాల్దీవుల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి చర్చలు ప్రారంభమైనట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందం ఖరారుకు ఇరు దేశాలు కృషి చేయనున్నాయని చెప్పారు. భారత్ అనుసరించే 'పొరుగుకే తొలి ప్రాధాన్యం', 'మహాసాగర్' విధానాల్లో మాల్దీవులకు ముఖ్యమైన స్థానం ఉందన్నారు. రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకునేందుకు ద్వీప దేశానికి భారత్ ఎప్పుడూ మద్దతిస్తుందని స్పష్టం చేశారు.రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఉదయం మాల్దీవులకు వెళ్లిన ప్రధాని మోదీకి అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు సహా కీలక మంత్రులు వెలెనా ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు. అనంతరం అక్కడి సైనికుల నుంచి ప్రధాని మోదీ గౌరవ వందనం స్వీకరించారు. ఇరుదేశాల మంత్రుల స్థాయిలో చర్చలతోపాటు మోదీ, మొయిజ్జుల మధ్య భేటీలు జరిగాయి. ఈ క్రమంలోనే పలు ద్వైపాక్షిక అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిసింది.





# యూపీలో సర్కారు విద్య హుళక్కి!

మొత్తం 27వేల పాఠశాలలను తగ్గించేందుకు యోగి సర్కార్ నిర్ణయించినట్టు తెలిసింది. తక్కువ సంఖ్య ఉన్న పాఠశాలల పరిధిలో 89వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా.. ప్రస్తుతం ఆ పాఠశాలలన్నీ చుట్టుపక్కల స్కూళ్లలో విలీనం చేస్తున్నారు. దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లే పరిస్థితులున్నాయి. లేదంటే బస్సులు లేనిచోట రవాణా భారం కూడా పడుతుందని తల్లిదండ్రులు ఆందోళనలకు దిగుతున్నారు. 6 నుంచి 14 ఏళ్ల పిల్లలకు ఉచిత విద్య, ఒక కిలోమీటర్ దూరంలోపే సర్కారు స్కూలు అందుబాటులో ఉండాలని విద్యాహక్కు చట్టం చెబుతున్నప్పటికీ.. యోగి సర్కార్ బేఖాతరు చేసి పాఠశాలలకు మంగళం పాడుతోంది. ఇది బాలికల విద్యపై తీవ్ర ప్రభావం చూపనుందని మేధావి వర్గాలు హెచ్చరిస్తున్నాయి. పాఠశాలలు మూతబడితే మధ్యాహ్న భోజనానికి వేలాది మంది పేద విద్యార్థులు దూరం కానున్నారు.

**బాలబాలికల అక్షరాస్యతలో తేడా..**

ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి సర్కారు బడుల పాఠశాలల సంఖ్య తగ్గిపోతుండగా.. అదే యూపీలో ప్రైవేటు స్కూళ్లు పెరుగుతున్నాయి. దీంతో అణగారిన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ వర్గాలకు చెందిన పేదలకు విద్య దూరమవుతోంది. 2023-24 నాటికి ఉత్తరప్రదేశ్‌లో 1.37 లక్షల ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. 2017-18 తర్వాత అప్పటికే 15.94శాతం తగ్గాయి. మౌలిక వసతులు, విద్యా నాణ్యత మెరుగుదలకు బీజేపీ ప్రభుత్వం శ్రద్ధ వహించకపోవడం వల్లనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నానాటికీ తగ్గిపోయింది. ఈ కారణంతో బడులకు తాళం వేస్తుండటం వల్ల పేద పిల్లలకు, ప్రధానంగా బాలికలకు చదువు అందకుండా పోతోందని విద్యావంతులు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ఇప్పటికే బాలికల అక్షరాస్యతకు బాలురకు మధ్య వ్యత్యాసం కొనసాగుతోంది. ఇప్పుడు మరింత ప్రభావం పడే అవకాశమున్నట్టు ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాసంఘాలు నిరసనలు చేపడుతున్నాయి.

### పిల్లలు కిలోమీటర్ల మేర ఎలా నడుస్తారు? : ప్రియాంక

విద్య అందుబాటులో ఉం డేలా ప్రతి గ్రామంలో పాఠశాలను ఏర్పాటుచేశారు. పాఠశాలలు ఇళ్లకు దూరంగా ఉంటే, చిన్న పిల్లలు, ముఖ్యంగా బాలికలు పాఠశాలకు చేరుకోవడానికి అనేక కిలోమీటర్లు ఎలా నడుస్తారు? బిజెపి ప్రభుత్వ నిర్ణయం విద్యా హక్కుకు వ్యతిరేకం మాత్రమే కాదు, దళిత, వెనుకబడిన, గిరిజన, మైనారిటీ, పేద, అణగారిన వర్గాలకు కూడా వ్యతిరేకం.

### ప్రచారం కోసం కోట్లు.. పాఠశాలలకే డబ్బు లేదు : అఖిలేష్

ప్రభుత్వ పాఠశాలలకే డబ్బు లేదు. బిజెపి రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేస్తోంది. విద్యతో సహా ప్రతి రంగంలోనూ రాష్ట్రాన్ని వెనుకకు నెట్టివేస్తోంది. పేదలు, వెనుకబడిన, దళితులు విద్యకు దూరంగా ఉండాలని కోరుకుంటోంది. వారు విద్యావంతులైతే ప్రభుత్వ తప్పుడు విధానాలను వ్యతిరేకిస్తారు కాబట్టే వారిని చదువుకు దూరం చేస్తోంది.

### 27వేల స్కూళ్లకు బదులు 27వేల కొత్త మద్యం షాపులు : సంజయ్ సింగ్

కలిసి పోరాడుతున్నాం. అయితే రాష్ట్రవ్యాప్తంగా 27వేలకుపైగా పాఠశాలల మూసివేతకు నిర్ణయించిన యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ప్రభుత్వం.. 27,308 కొత్త మద్యం దుకాణాలను తెరవడానికి అనుమతించింది. ఇక్కడ మాకు మద్యం దుకాణాలు వద్దు, పాఠశాలలు కావాలి. పిల్లల అప్పీల్‌ను సుప్రీంకోర్టుకు తీసుకెళ్తా.





## తెలంగాణ కులగణన భూకంపం సృష్టించింది

కానీ, వారి శ్రమకు తగిన ఫలితాలను అందుకోలేకపోతున్నారు. అన్ని రంగాల్లో వివక్ష ఎదుర్కొంటున్నారు. కార్పొరేట్ ఇండియాలో ఓబీసీలు ఎక్కడున్నారు? మీడియా రంగంలో వారికి స్థానం ఎక్కడుంది? కుల గణన కూడా ఎప్పుడో చేయాల్సింది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మేం తప్పకుండా కులగణన పూర్తిచేస్తాం" అని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు.ఈ సందర్భంగా భాషా వివాదంపైనా రాహుల్ స్పందించారు. "అభివృద్ధిలో విద్యే ప్రాధాన్యం. ఇంగ్లిష్ నేర్చుకుంటే అవకాశాలు రెట్టింపు అవుతాయి. భాజపా నేతలు మాత్రం ఇంగ్లిష్‌ను వ్యతిరేకిస్తున్నారు. ప్రాంతీయ భాషలూ ముఖ్యమే. దానితో పాటు ఆంగ్ల ప్రాధాన్యాన్నీ అర్థం చేసుకోవాలి" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

## పదునెక్కుతున్న యుద్ధతంత్రం

జిల్లాలోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజి లో ఈ ప్రతిష్ఠాత్మక పరీక్ష జరిగింది. ఈ విషయాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్వయంగా ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఈ ప్రయోగానికి సంబంధించిన ఫొటోను ఆయన పంచుకొన్నారు. డీఆర్‌డీవో, ఈ క్షిపణి అభివృద్ధి, తయారీలో భాగస్వాములైన ఎంఎస్‌ఎంఈ, స్టార్టప్స్‌ను ఆయన అభినందించారు. సంక్లిష్టమైన టెక్నాలజీని అర్థం చేసుకోవడంతోపాటు.. ఉత్పత్తి చేయగలిగే సత్తా భారత్‌కు ఉందని ఈ పరీక్ష నిరూపించిందన్నారు. దీనికి సంబంధించిన సాంకేతిక అంశాలను బహిర్గతం చేయలేదు. గతంలో డీఆర్‌డీవో పత్రాలు, ఓపెన్ సోర్స్ సమాచారం ప్రకారం గతంలో పరీక్షించి ప్లాట్‌ఫామ్ పైనే దీనిని అభివృద్ధి చేశారు. కర్నూల్ జిల్లా ఓర్వకల్లు మండలం పాలకొలను సమీపంలో డీఆర్‌డీవోకు చెందిన %చీూా=% పరీక్ష కేంద్రాన్ని దీనికి ఎంచుకొన్నారు. గతంలో కూడా డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్స్ వ్యవస్థను పరీక్షించేందుకు ఇదే వేదికను వాడారు. ఈ ఆయుధం ఫిక్స్‌డ్‌వింగ్ మానవ రహిత విమానాలను కూల్చేందుకు వినియోగిస్తారు. ఇక్కడ జరుగుతున్న ప్రయోగాలతో భారత్ డ్రోన్ యుద్ధతంత్రంలో ముందంజ వేస్తోంది.

## అశ్లీల కంటెంట్ యాప్‌లపై కొరఢా

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అశ్లీల కంటెంట్‌ని ప్రసారం చేస్తున్న యాప్‌లపై కేంద్రం కొరడ ఝుళిపించింది. ఉల్లు, ఎఎల్‌టిటి సహా 24 యాప్‌పై కేంద్రం నిషేధం విధించింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. 24 యాప్‌లు, వెబ్‌సైట్లపై నిషేధం విధించిన కేంద్రం.. ఆ వెబ్‌సైట్లు, యాప్‌లు ఇంటర్నెట్‌లో కనిపించకుండా చేయాలని ఇంటర్నెట్ ప్రొవైడర్లను ఆదేశించింది ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఒటిటి ప్రసార యాప్‌లు, వాటి సర్వీస్ ప్రొవైడర్లు తాము ప్రసారం చేసే కంటెంట్ విషయంలో బాధ్యతయుతంగా ఉండాలని పేర్కొంది. చట్టాలను ఉల్లంఘించే కంటెంట్‌ను ప్రసారం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదురుకోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది.

## తెలంగాణలో వృత్తి విద్య కళాశాలల్లో ఫీజుల నిర్ధరణకు కమిటీ

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలోని వృత్తి విద్య కళాశాలల్లో ఫీజుల నిర్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి ఛైర్మన్‌గా ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డిని నియమించింది. దీంతో పాటు మరో 9 మందిని సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ ఇతర రాష్ట్రాల్లోని కళాశాల్లో ఫీజు విధానాలు, పాటిస్తున్న ప్రమాణాలు, సౌకర్యాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.

## ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులు

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల కు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి జిల్లాలు - ప్రత్యేక అధికారులు వీరే.. హైదరాబాద్ - ఇలంబర్తి,రంగారెడ్డి - డి. దివ్య,ఆదిలాబాద్ - సి. హరికిరణ్,నల్గొండ - అనితా రామచం ద్రన్,నిజామాబాద్ - ఆర్. హనుమంతు, మహబూబ్‌నగర్ - రవి,కరీంనగర్ - సర్ఫరాజ్ అహ్మద్,వరంగల్ - కె. శశాంక,మెదక్ - శరత్, ఖమ్మం - సురేంద్ర మోహన్

## కదిలిన మామునూరు ఎయిర్‌పోర్ట్

**- నిర్మాణంలో మరో కీలక ముందడుగు**
**- భూసేకరణకు రూ.205 కోట్లు విడుదల**

**హైదరాబాద్(జనంసాక్షి):**వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణం పనుల్లో మరో కీలక ముందడుగు పడింది. ఎయిర్‌పోర్టు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.205 కోట్లు- విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటికే భూములు కేటాయించలేదని ఆరోపణలు వచ్చాయి. మామునూరు వద్ద కొత్త బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు మార్చి నెలలో పచ్చజెండా ఊపారు. ఈ విమానాశ్రయానికి అన్ని అనుమతులు ఇస్తూ.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ నిర్మాణం ప్రారంభించడానికి వీలుగా సంబంధిత దస్త్రంపై సంతకం చేశారు. మరో 253 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఇస్తే కొత్త విమానాశ్రయ నిర్మాణం మొదలుపెడతామని కేంద్రమంత్రి ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే భూసేకరణ కోసం ప్రభుత్వం తాజాగా నిధులు విడుదల చేసింది. దీంతో పనుల్లో వేగం పుంజుకోనుంది. భూములను ఇచ్చేందుకు స్థానికులు వెనకాడడం కూడా ఓ కారణంగా చెప్పుకోవాలి

**హెచ్‌సీఏలో అక్రమాల కేసు..**

## ప్రధాన కార్యదర్శి దేవరాజ్ అరెస్ట్

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో జరిగిన అక్రమాల కేసులో ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి దేవరాజ్ అరెస్టయ్యారు. పుణెలో సీఐడీ పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో దేవరాజ్ ఏ2గా ఉన్నారు. దీంతో ఈ కేసులో అరెస్టుల సంఖ్య ఆరుకు చేరింది.

# మళ్లీ అధికారం మాదే..

సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు ఇప్పుడు కాగితాలు ఇచ్చి నేనే ఉద్యోగాలు ఇచ్చినట్లు- రేవంత్ రెడ్డి చెబుతున్నారని కేటీఆర్ అన్నారు. ఇది ప్రజ లను మోసగించడమేనన్నారు. ప్రభుత్వాన్ని నడిపించే వాడు నిజంగా బాధ్యత గల నాయకుడు అయితే సంపద, ఆదాయం పుడుతుందన్నారు. అలాగే, గురుకులాల్లో విద్యార్థులకు విషం పెడుతున్నారు.. ఇప్పటి వరకు 100 మంది విద్యార్థులు చనిపోయారు అని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 ప్రకారమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని కేటీఆర్ అన్నారు. బోధించు, సమీకరించు, పోరాడు, అన్న బాబాసాహెబ్ బాటలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు- కోసం కేసీఆర్ ఉద్యమించారని పేర్కొన్నారు. లక్షలాది మందిని సమీకరించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు- అవసరాన్ని వాళ్లకు బోధించి, ఎత్తిన జెండా దించకుండా 14 ఏళ్ల పాటు- కేసీఆర్ కొట్లాడితే తెలంగాణ వచ్చిందని కేటీఆర్ తెలిపారు. ఆ మహనీయున్ని గౌరవించుకోవడానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రపంచం లో ఎక్కడా లేనివిధంగా 125 అడుగుల విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ప్రతిష్టించుకున్నామని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సమున్నతంగా గౌరవించుకున్నామని తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరును సెక్రటేరియట్ కు పెట్టిన ఒకే ఒక ముఖ్యమంత్రి భారతదేశంలో కేసీఆర్ ఒక్కరే అని కొనియాడారు. అంబేద్కర్‌ను అంత గొప్పగా గౌరవించుకున్న ముఖ్యమంత్రి దేశంలో ఇంకెవరూ లేరని అన్నారు. దళితుల జీవితాల్లో అద్భుతమైన మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో లక్షలాది దళితులకు మేలు చేయాలన్న సంకల్పంతో దళిత బంధు పథకాన్ని కేసీఆర్ తీసుకొచ్చారని కేటీఆర్ తెలిపారు. దళిత బంధు పేరుమీద కేసీఆర్ రూ.10 లక్షల మాత్రమే ఇస్తున్నారని.. తాము అధికారంలోకి వస్తే రూ.12 లక్షలు ఇస్తామని చేవెళ్లలో ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే సమక్షంలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ను రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కలు ప్రకటించారని గుర్తుచేశారు. అన్ని ప్రభుత్వ పనుల్లో 26శాతం ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామన్నారని.. దళిత, గిరిజనులు ఇండ్లు నిర్మించుకుంటే ఆరు లక్షలు ఇస్తామని ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆరు పైసలు కూడా ఇవ్వని సిగ్గులేని ప్రభుత్వం రేవంత్ రెడ్డిది అని విమర్శించారు. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో అని కేటీ-ఆర్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో అన్ని వర్గాల ప్రజలు దారుణంగా మోసపోయారని అన్నారు. రెండుసార్లు రైతుబంధును ఎగ్గొట్టిన రేవంత్ రెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయన్న కారణంగా మొన్న రైతుబంధు వేశాడని అన్నారు. అరకొరగా రైతుబంధు వేసి సంబరాలు చేసుకోమంటు-న్న దిక్కుమాలిన ప్రభుత్వం ఇది అని విమర్శించారు. కేసీఆర్ రైతులకు రూ.10,000 ఇస్తే తాము రూ.15000 ఇస్తామన్నారని.. ముసలి వాళ్లకు ఇస్తున్న 2 వేల పెన్షన్ ను రూ.4000 చేస్తామన్నారని గుర్తుచేశారు. కేసీఆర్ ఇంట్లో ఒకరికి మాత్రమే పెన్షన్ ఇస్తున్నాడు తాము అధికారంలోకి వస్తే ఇద్దరికీ ఇస్తామన్నారన్నారు. అత్తకు 4,000, కోడలు 20,000 ఇస్తామన్నారు. కాని అధికారంలో వచ్చాక ఈ హామీల్లో ఒక్కదాన్ని కూడా అమలుచేయడం లేదని విమర్శించారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు.. 50 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేయాల్సి ఉంటే దాన్ని చివరకు రూ.12 వేల కోట్లకు కుదించి అది కూడా సగమే చేశారని అన్నారు. ఆడబిడ్డలకు తులం బంగారం, నెలకు 2,500 రూపాయలు ఇవ్వడం లేదు. వడ్లకు బోనస్ ఇస్తామని అన్ని బోగస్ మాటలు చెప్పారని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్ ఇద్దరి ఉద్యోగాలు ఊడగొడితే మొదటి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. కానీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పూర్తైన నియామకాలకు సిగ్గు లేకుండా ఆఫర్ లెటర్లు ఇస్తూ తామే ఇచ్చామని రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నాడు. మంది పిల్లల్ని నా పిల్లలని చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. కేసీఆర్ అప్పులపాలు చేశారని కాంగ్రెస్ వాళ్లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. కరోనా లాంటి కష్టకాలంలో కూడా కేసీఆర్ గారు ఆపకుండా రైతుబంధు, కేసీఆర్ కిట్లు-, పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, గురుకులాల్లో సన్న బియ్యం పెట్టారని గుర్తుచేశారు. ప్రభుత్వాన్ని నడిపే దమ్ము ఉన్నవారికే ఆదాయాన్ని తెచ్చే సత్తా ఉంటు-ంది. సంపద పెంచి పేదలకు పంచే తెలివి ఉంటు-ందని అన్నారు.

## నియోజకవర్గాల పునర్విభజన పిటిషన్ కొట్టివేత

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజనపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీనిని ఆమోదించ లేమని, దీనివల్ల ఇతరరాష్ట్రాల్లో సమస్యలు వస్తాయని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. 2026లో మొదటి జనగణన తర్వాత మాత్రమే డీలిమిటేషన్ నిర్వహిస్తామని చట్టంలో స్పష్టంగా చెప్పారని పేర్కొంది. ఇలాంటి వ్యాజ్యాన్ని అనుమతించడం వల్ల ఇతర రాష్ట్రాల్లో కూడా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్న వ్యాజ్యాలు వరదల్లా వస్తాయని, గేట్లు తెరిచినట్లు అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో అసెంబ్లీ సీట్లు- పెంచేందుకు నియోజకవర్గాల పునర్విభజన పక్రియ నిర్వహించేలా కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించాలని దాఖలైన పిటిషన్ ను సుప్రీంకోర్టు శుక్రవారంనాడు తిరస్కరించింది. జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్ తో పోలిస్తే, రాష్ట్రాలలో డీలిమిటేషన్ కు సంబంధించిన నిబంధనలు భిన్నంగా ఉన్నాయనే వాదనను కూడా ధర్మాసనం తిరస్కరించింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26ను అమలు చేసేలా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ప్రొఫెసర్ కె. పురుషోత్తం రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టు ఈ తీర్పు ప్రకటించింది. ఈ సందర్భంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పాలన విషయంలో గల తేడాను కూడా ధర్మాసనం ప్రస్తావించింది.జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం జమ్మూ కశ్మీర్ ను కేంద్రపాలిత ప్రాంతంగా తిరిగి ఏర్పాటు- చేయడం వల్ల రాజ్యాంగంలోని 7వ భాగంలోని 3వ అధ్యాయంలోని నిబంధనలు వర్తించబోవని జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలో మాత్రమే డీలిమిటేషన్ పక్రియ చేపట్టి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలను మినహాయించడం రాజ్యాంగ విరుద్ధమన్న వాదనను కూడా కోర్టు తిరస్కరించింది. రాజ్యాంగం ఆర్టికల్ 170(3) ప్రకారం డీలిమిటేషన్ కోసం వచ్చిన పిటిషన్ ను స్వీకరించడానికి వీలు లేదని కోర్టు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం లోని సెక్షన్ 25 డీలిమిటేషన్ కు సంబంధించిన రాజ్యాంగం ఆర్టికల్ 170కి లోబడి ఉందని, దీని ప్రకారం 2026 లో చేపట్టనున్న జనాభా లెక్కల షెడ్యూల్ గణాంకాలను ప్రచురించిన తర్వాత మాత్రమే డీలిమిటేషన్ నిర్వహించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.అంతకు ముందు విచారణ సందర్భంగా పిటిషనర్ తరుపు న్యాయవాది తన వాదనలను వినిపిస్తూ, ఏపీ, తెలంగాణాలను మినహాయించి, కొత్తగా ఏర్పడిన జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలోనే అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల డీలిమిటేషన్ చేపట్టడం అసమంజసం, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు.

## శ్రీలక్ష్మికి దక్కని ఊరట

**హైదరాబాద్ (జనంసాక్షి):**ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మికి తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో తనను నిర్దోషిగా ప్రకటించాలంటూ ఆమె ఉన్నత న్యాయస్థానంలో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు.దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం ఆమె పిటిషన్‌ను కొట్టివేసింది. ఓఎంసీ కేసులో శ్రీలక్ష్మిని న్యాయస్థానం ఇప్పటికే నిందితురాలిగా తేల్చింది. కోర్టు తీర్పుతో ఆమె పాత్రపై సీబీఐ విచారణ జరపనుందిఓబుళాపురం మైనింగ్ కేసులో వై.శ్రీలక్ష్మి దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను 2022 అక్టోబరులో సీబీఐ కోర్టు కొట్టేసింది. దీన్ని సవాలు చేస్తూ ఆమె తెలంగాణ హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలుచేశారు. గతంలో దీనిపై విచారించిన ఉన్నత న్యాయస్థానం.. శ్రీలక్ష్మి పిటిషన్‌ను అనుమతించింది. ఆమెను కేసు నుంచి తప్పిస్తూ తీర్పు వెలువరించింది. దీంతో సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. సీబీఐ వాదన వినకుండా ఉత్తర్వులు జారీచేయడం సరికాదని అభిప్రాయపడింది. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకుని తాజాగా విచారణ చేపట్టాలంటూ ఈ పిటిషన్‌ను తిరిగి హైకోర్టుకు పంపింది. దీన్ని మూడు నెలల్లో తేల్చాలని ఆదేశించింది

## ఇందిరా గాంధీ జయంతి రోజున
# వెయ్యి అంగన్వాడీ భవనాలను ప్రారంభిస్తాం

- అప్పటి లోపు వాటి నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశాలు
- నూతన సీడీపీఓలకు నియామక పత్రాలు అందజేసిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, జూలై 25 (జనంసాక్షి) :** తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖలో నూతనంగా ఎంపికైన 23 మంది సీడీపీవోలకు నియామక పత్రాలను మంత్రి సీతక్క అందచేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన సీడీపీవోలు సచివాలయంలో మంత్రి చేతుల మీదుగా శుక్రవారం నాడు నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పండుగ వాతావరణం నెలకొంది. నూతన సీడీపీఓలతో పాటు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టినందుకు మంత్రికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖకు సీడీపీఓలు వెన్నెముకలుగా పని చేస్తారని పేర్కొన్నారు."మీరు పొందిన ఈ ఉద్యోగం ఒక సామాజిక బాధ్యత. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి మద్దతుగా నిలిచే సేవా విభాగంలోకి అడుగుపెడుతున్నారన్న విషయాన్ని మీరెప్పటికీ మరిచిపోవద్దు" అని మంత్రి తెలిపారు. "వేల మంది పోటీ పడిన ఈ పరీక్షలో మీరు మాత్రమే ఉద్యోగాలు పొందరు. ఈ విజయానికి మీరు చూపిన అంకితభావం ప్రధాన కారణం. మీరు నిర్వర్తించే విధుల్లో ఇదే అంకిత భావాన్ని కొనసాగించాలి" అని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు సేవలందించే అదృష్టం మీకు దక్కిందన్నారు. అంగన్వాడీల్లో పోషకాహార లోపం తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.

### సీడీపీఓల్లో ఉత్సాహం... తల్లిదండ్రుల్లో ఆనందం

మంత్రి సీతక్క చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్న సీడీపీఓలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. "ప్రజా ప్రభుత్వంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఉద్యోగ నియామక చర్యల వల్లే ఈ అవకాశాన్ని పొందగలిగాం" అంటూ ప్రభుత్వానికి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తమ పిల్లలు ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతలు చేపడుతున్న దృష్ట్యా పలువురు తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు. కూతుళ్లను ప్రభుత్వ ఉన్నతోద్యుగులుగా చూడాలన్న తమ కల నెరవేరిందని, ఇటువంటి ప్రజా ప్రభుత్వం పదికాలాల పాటు కొనసాగాలి అంటు ప్రభుత్వాన్ని ఆశీర్వదించారు. అంతకు ముందు మహిళా శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ జీ సృజన తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గోన్న ఈ సమావేశంలో అంగన్వాడీ సేవల పని తీరు మెరుగుదల, పోషకాహార లోప నివారణ కోసం వంద రోజుల యాక్షన్ ప్లాన్ పై చర్చించారు. శిధిలావస్థలో ఉన్న అంగన్వాడీ భవనాల స్థానంలో ఈ ఏడాది వేయి నూతన అంగన్వాడీ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. దేశంలో అంగన్వాడి సేవలను ప్రవేశపెట్టిన ఇందిరా గాంధీ జయంతి రోజైన నవంబర్ 19న నూతన అంగన్వాడి భవనాలను ప్రారంభిస్తామన్నారు. అప్పటి లోపు ఈ ఏడాది నిర్దేశించుకున్న వేయి అంగన్వాడీ భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. అంగన్వాడి పరిసరాలు పరిశు భ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు అంగన్వాడి కేంద్రాలను విధిగా సందర్శించాలని, అంగన్వాడీల్లో హాజరు శాతాన్ని పెంచే చర్యలు చేపట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఫీడింగ్, టీచింగ్, అటెండెన్స్ మీద యంత్రాంగమంతా దృష్టి సారించాలని కోరుకున్నారు.

# ఉద్యమాల ఉపాధ్యాయులు ఉసాకు ఘననివాళి




**యాదాద్రి భువనగిరి (జనంసాక్షి) :** ఉద్యమాల ఉపాధ్యాయులు ఉసా (ఉప్పుమావులూరి సాంబశివ రావు) ఐదో వర్ధంతి ఘనంగా జరిగింది. ఉసాపై ప్రేమతో ఆయన సహచరులు నిర్మించుకున్న యాదాద్రి భువనగిరి జిల్లా, మోత్కూరు మండలం, పుల్లాయిగూడెంలోని ఉసా స్థూపం వద్ద చిత్ర పటాన్ని పూల మాలలతో అలంకరించి ఉద్యమ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం ఎల్) మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ గడ్డం సదానందం, సామాజిక తెలంగాణ మహా సభ అధ్యక్షుడు కొత్తగట్టు మల్లన్న ముఖ్య అతిధులుగా హాజరై ఉ.సా. ఉద్యమ నేపథ్యాన్ని వివరించారు. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ యాదాద్రి భువన గిరి జిల్లా నాయకులు కాఎం జక్కుల యాదగిరి, ఉ.సా ప్రియ శిష్యు లు, సహచరులు, ఊ.సా స్థూపనిర్మాణ కర్తలు పుల్లాయి గూడెం వాస్తవ్యులు,జీడిమల్ల పెద్ద పిచ్చి రెడ్డి, చిన్నపిచ్చి రెడ్డి, బుచ్చిరెడ్డి, బందారు లక్ష్మారెడ్డి, జక్కుల క్రిష్ణ యాద వ్, ప్రవీణ్, కాసీం,తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా గడ్డం సదానందం సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉసా కమ్యూనిస్టు విప్లవ కారుడిగా అనేక ప్రజా సమస్యలపై, ముఖ్యంగా రైతాంగ సమస్యల పరిష్కారా నికి కృషి చేసారని తెలిపారు. కరెంట్ సమస్య పై,సాగునీటి కోసం వేలాది ఎడ్లబండ్లతో జరిపిన ప్రజా ఆందోళనకు ప్రభత్వం దిగి వచ్చిందని గుర్తు చేశారు. చుట్టు ప్రక్కల గ్రామాలన్నింటా ఉ.సా సుపరిచితుడని తమ ప్రియతమ ఉద్యమ నేతను కోల్పోయమనీ ఉ.సా తమ కోసం చేసిన పోరాటాలనూ కొనయాడుతున్నారని అన్నారు. నక్సల్బరీ స్రవంతి రివిజనిజంతో పాటు, బ్రాహ్మ ణిజంతో పోరాడినంత సీరియస్ గా పోరాడక పోవడం వలననే కులం సమస్య అలానే ఉందని ఉ.సా. చెప్పే వారని తెలిపారు.నేడు మనం ముస్లీంలను, క్రైస్థవులను దళితులను తగినంతగా కలుపుకు పోలేక పోతున్నా మన్నామని చెపుతూ ఉండే వారని అన్నారు. కలుపుక పోవడం అనేది వర్గపోరాటం నుండి ప్రక్కకు పోవటం కాదనే విషయాన్ని మొదట గుర్తించా లని, దళితుల మీద జరిగే దాడులకు ఒక వ్యూహం ఉందని అది అవర్ణ వ్యతిరేక సవర్ణ వ్యూహంలో భాగంగా ఈ దేశంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజేపి ఆర్ఎస్ఎస్ హిందూ ఫాసిజంను నెలకొల్పుతున్నా యని నిరంతరం వివరించే వారని గుర్తుచేశారు. కొత్తగట్టు మల్లన్న మాట్లాడుతూ ఉద్యమాల ఉపాధ్యా యుడైన ఉ.సా దేశంలోఉన్న కుల వ్యవస్థను ఎత్తి చూపి, దానిని తుది ముట్టించందే విప్లవం విజయవంతం కాదని స్పష్టంగా చెప్పారని అన్నారు. అందుకు తగిన సిద్ధాంతాన్ని, కార్యచరణను ఎన్నుకొని పనిచేస్తున్న క్రమంలో ఎన్నో ఆటు పోటులను, అవమానాలను ఎదుర్కొ న్నారని తెలిపారు. ఉ.సా ఒక లెజెండ్ అని కీర్తించారు. ఉ.సా కమ్యూనిస్టు విప్లవ కారుల కుల-వర్గ జమిలి పోరాట సిద్ధాంత కర్త ఆర్గానిక్ ఇంటలెక్చు వల్, సోషల్ యాక్టివిస్ట్, మార్ఫ్ఫ పూలే అంబేడ్కర్ సిద్ధాంతాలను కల గలిపిన విప్లవ మేధావని పేర్కొన్నారు. అందుకే ఉ.సా ను ఇండియన్ గ్రాంసీ అంటారని గుర్తు చేశారు. ఉ.సా ప్రత్యేకమైన ఆహార్యం, కంచులా మోగే ఉపన్యాసం, అనితర సాధ్యం కానీ విశ్లేషణ, ఆయన ఆశయాలు, ఐడియాలజీ, దేశీయ ప్రాపంచిక దృక్పథం అన్నీ మన మధ్య సజీవంగా ఉన్నాయని, ఉ.సా ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళులని అన్నారు.

# ఉపాధికి వెళ్లిన చోటే ఆగిన గుండె

### ఉజ్బెకిస్తాన్‌లో కొత్తపెద్దూర్‌వాసి మృతి

**దస్తురాబాద్, జూలై 25 (జనంసాక్షి) :** మండలంలోని మున్యాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపెద్దూర్ గ్రామానికి చెందిన సంఘ సురేష్ (35) కుటుంబ పోషణ, ఉపాధి నిమిత్తం ఉజ్బెకిస్థాన్ దేశం వెళ్ళాడు. అక్కడికి వెళ్లిన సురేష్ ఒక టూరిస్ట్ హాస్టల్ వద్ద పని చేస్తున్న సమయంలో ఈ నెల 21 న సోమవారం అకస్మాత్తుగా వచ్చిన గుండె పోటు వల్ల ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మృతి చెందాడు అని కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటన తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ నియమిత ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటి మెంబెర్ స్వదేశ్ పరికిపండ్ల మృతుని కుటుంబ సభ్యులను కలిసి, అతని కుటుంబ సభ్యులకు మనో ధైర్యం చెప్పి కుటుంబానికి ప్రభుత్వం తరపున భరోసా కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో పడాల నరేశ్, రాకేష్ గ్రామ పెద్దలు ఉన్నారు.

# బాలికలను లైంగికంగా వేధించిన వృద్ధుని అరెస్టు

**పాలకుర్తి, జూలై 25(జనంసాక్షి):** మైనర్లను లైంగిక వేధింపులకు పాల్పడిన వృద్ధుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ జానకీరాంరెడ్డితో కలిసి ఏసీపీ నర్సయ్య వివరాలు ఘటన వివరాలను వెల్లడించారు. మండలంలోని తీగారం గ్రామానికి చెందిన పోగు సోమయ్య అనే వృద్ధుడు అదే గ్రామానికి చెందిన బాలికలను లైంగిక వేదింపులకు గురిచేశాడు. బిస్కెట్లు, డబ్బులు ఆశ చూపి అఘాయిత్యాలకు పాల్పడ్డారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు విచారణ చేపట్టినట్లు తెలిపారు, సదరు వృద్దుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో ఎస్సై దూలం పవన్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# పంట పొలాల్లో మృతదేహం



**కొత్తగూడ, జూలై 25 (జనంసాక్షి) :** మహబుబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం సమీపంలో చేపల వేటకు వెల్లి నరేష్ మృతదేహం 48 గంటల తర్వాత పంట పొలాల్లో మృతదేహం లభ్యం లభ్యమైంది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులతో పాటు రెవెన్యూ, పోలీస్ అధికారులు రెండు రోజులుగా వెతికారు.

# రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

### అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు
### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




**కొల్చారం, జులై 25 (జనం సాక్షి):** రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ... అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వ లక్ష్యం అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ జిల్లా మండల కేంద్రమైన కొల్చారం రైతు వేదికలో శుక్రవారం కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి తో కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 9961 కొత్త రేషన్ కార్డులు, 31 వేల మంది అదనపు సభ్యులను చేర్చడం జరిగింది అన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో 2500 కొత్త రేషన్ కార్డులు, కొల్చారం మండలంలో 384 కొత్త రేషన్ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వం రైతు భరోసా కింద జిల్లాలోని రెండు లక్షల అరవై రెండు వేల మంది రైతులకు 220 కోట్ల రూపాయలు ఈ ఖరీఫ్ సీజన్లో పంపిణీ చేయడం జరిగింది అన్నారు. తనను ఎమ్మెల్యేగా ఎన్నుకున్న నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి ప్రభుత్వపరంగా రావాల్సిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు కృషి చేస్తానన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మంచిదే అయినప్పటికీ, సరిపోయినన్ని బస్సులు పెంచాలని ఎమ్మెల్యే అన్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నందున రైతులకు ఎరువుల రైతులకు ఎరువుల కొరత రాకుండా డిమాండ్ అనుగుణంగా ఎరువులను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ నిత్యానంద, నర్సాపూర్ ఆర్డీవో మైపాల్ రెడ్డి, కొల్చారం తహసిల్దార్ శ్రీనివాస్ చారి, డిప్యూటీ తహసిల్దార్ నాగవర్ధన్, ఆర్ ఐ ప్రభాకర్, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్ గుప్తా, యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన రేషన్ కార్డులతో అర్హులకు మేలు

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




**నిర్మల్ బ్యూరో,జులై 25(జనంసాక్షి) :** నూతన రేషన్ కార్డుల పంపిణీతో అర్హులైన పేద ప్రజలందరికీ మేలు చేకూరిందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.శుక్రవారం ముధోల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్ తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,నూతన రేషన్ కార్డుల జారీతో పేద ప్రజలకు ఉచిత రేషన్ బియ్యం అందుతాయని అన్నారు.ముధోల్ నియోజక వర్గానికి సంబంధించి 11 వేల 352 నూతన రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.17609 మంది కుటుంబ సభ్యుల పేర్ల మార్పు,చేర్పులు జరిగాయని అన్నారు. ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికం కావడంతో రేషన్ కార్డులు లేని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కున్నారని,ఇక నుంచి ఆ సమస్యలు తీరిపోతాయని తెలిపారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారునికి ప్రభుత్వం ఉచితంగా పోషక విలువలు కలిగి పోర్టిఫైడ్ సన్న బియ్యాన్ని అందిస్తుందన్నారు. గ్రామాల వారిగా అధికారులు ప్రజలందరికీ రేషన్ కార్డులు అందిస్తారని పేర్కొన్నారు.రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని,ప్రజలు ఎప్పుడైనా నూతన రేషన్ కార్డులకు దరఖాస్తులు, కార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకోవచ్చుని తెలిపారు.రేషన్ డీలర్లు ప్రజలకు ప్రతీ నెలా క్రమం తప్పకుండా సమయానికి బియ్యాన్ని అందించాలని సూచించారు.ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ, నూతన రేషన్ కార్డుల పంపిణీ చాలా సంతోషకరమైన విషయమని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రేషన్ బియ్యాన్ని అందిస్తున్నాయని తెలిపారు.ప్రజలు ఈ ఉచిత బియ్యాన్ని బయట అమ్ముకోకుండా, వినియోగించుకోవాలని కోరారు.చాలా సంవత్సరాల తర్వాత నూతన రేషన్ కార్డులు ఇవ్వడం మంచి విషయం అని తెలిపారు.అనంతరం లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్,శాసనసభ్యులు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్,ఆర్డీఓ కోమల్ రెడ్డి,జిల్లా పౌరసరఫరా శాఖ అధికారి రాజేందర్, తహసిల్దార్ శ్రీలత,ఎంపీడీఓ శివకుమార్,లబ్ధిదారులు, రేషన్ డీలర్లు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పొంగి ప్రవహిస్తున్న వాగులూవంకలు

- నీటితో నుండి కళకళలాడుతున్న చెరువులు, కుంటలు...
- ఆనందంలో అన్నదాతలు...



**చెన్నారావుపేట, జులై 25 (జనం సాక్షి):** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు నీటితో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గత నాలుగైదు రోజులపాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి భారీగా వరద నీరు చేరుకుంటుండడంతో నీటితో నిండుకొని కళకళలాడుతున్నాయి. మండలంలోనే అతిపెద్ద చెరువులైన కోపాకుల, జల్లి, అమీనాబాద్, పాపయ్యపేట, మగ్దుంపురం, ఉప్పరపల్లి తదితర గ్రామాలలోని ఊర చెరువులు నీటితో నిండుకొని జలకలను సంతరించుకున్నాయి. అదేవిధంగా పాకాల వాగు, వట్టె వాగు, మున్నేరు వాగులు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటల్లోకి భారీగా నీరు చేరడంతో గ్రామాలలోని రైతన్నలు చెరువులు, కుంటల కింద తమ పొలాలను ట్రాక్టర్లు, నాగళ్లతో దున్నించుకుంటూ మహిళా కూలీలతో వరి నాట్లను వేస్తున్నారు. అలాగే పత్తి, పసుపు, మొక్కజొన్న, వేరుశనగతోపాటు ఇతర పంటలకు డోకా లేదని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు ఇలాగే ఎడతెరిపి లేకుండా కురిస్తే చెరువులు, కుంటలు మత్తల్లు పోస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# యాచకురాలిపై లైంగికదాడికి యత్నం

### కేసు నమోదు చేసిన ఎస్సై మేడాప్రసాద్

**బూర్గంపహాడ్ జూలై 25 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్ర పోలీస్ స్టేషన్‌లో యాచకురాలిపై అత్యాచార యత్నం జరిగినట్లు శుక్రవారం ఫిర్యాదు అందడంతో ఎస్ ఐ మేడ ప్రసాద్ కేసు నమోదు చేశారు. పోలీస్ స్టేషన్ కి బిక్షాటన చేసే ఒక మహిళ (62) తను భిక్షాటనకై పాల్వంచ బస్టాండ్ లో ఉండగా 2025 జూలై 25వ తేది రాత్రి సుమారు 2.30 గం.,ల సమయంలో సుమారు 40- 45సం.రాల వయస్సు గల ఒక వ్యక్తి పసుపు రంగు ట్రాలీ ఆటోలో వచ్చి ఆమెతో మాటలు కలిపి నన్ను ఎక్కడికి వెళ్తున్నావ్ అని అడిగి, నేను సారపాక వెళ్ళాలని చెప్పగా, సదరు వ్యక్తి తను కూడా సారపాక వైపే వెళ్తున్నా అని చెప్పి, సారపాక లో దింపుతానని చెప్పి ట్రాలీ ఆటోలో ఎక్కించుకొని.అక్కడి నుండి వస్తుండగా సారపాక పల్లె ప్రకృతి వనం దగ్గరికి వచ్చుసరికి రాత్రి సుమారు 3.15 గం.ల సమయంలో సదరు వ్యక్తి తన ట్రాలీని రోడ్డు దింపి అడవిలో ఆటోను ఆపి తనను అత్యాచారయత్నం చేయబోయాడని, తను అరిచేసరికి అక్కడి నుంచి పారిపోయాడని దరఖాస్తు చేశారని దానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ మేడా ప్రసాద్ తెలిపారు.

# విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మనోధైర్యం కల్పించాలి

### కేజీబీవీల నుండి ఐఐటిలకు ఎంపిక అయ్యేలా తీర్చిదిద్దాలి
### ప్రతి విద్యార్థిని హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలి
### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి) :** విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే నిర్మితమవుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా విద్య అధికారులతో,కేజీబివి ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబివిలలో మెనూ ప్రకారం భోజనం అమలు చేయాలని, విద్యార్థులకి భోజనం విషయంలో ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలన్నారు.విద్యార్థినిలు ఒంటరికి గురికాకుండా వారికి మనోధైర్యం కల్పించాలని, ప్రతి వారం వారికి విద్యార్థులకి సంబందించిన సినిమాలు చూపించాలని, అలాగే మోటివేషనల్ తరగతులు నిర్వహించి,వారికి చదువు పై ఆసక్తి కలిగించేలా చూడాలని అన్నారు.ప్రతి పాఠశాలలో క్లబ్ లు ఏర్పాటుచేసి ఒక టీచర్ ను ఇన్చార్జిగా నియమించాలన్నారు. ఐఐటి లాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో సీట్ పొందేలా భోదించాలని,ఖాన్ అకాడమీ ద్వారా డిజిటల్ లెర్నింగ్ లాంటి వాటికి అవసరమైన బుక్స్, మెటీరియల్స్ అందిస్తామని తెలిపారు. అంతకు ముందు 23 కేజీబివిల నందు రూఫ్ లికేజీ, త్రాగునీరు, శానిటేషన్, ఎలక్ట్రిసిటి,మౌళిక వసతుల కల్పన కొరకు తెలంగాణ విద్య కనీస మౌళిక వసతుల కార్పొరేషన్ అధికారులు, కేజీబివి అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి కేజీబివి లో ఎలక్ట్రిసిటి ఎర్తింగ్ ఏర్పాటు చేయాలని, ఈ పనులు అన్ని ఈ నెల 30 లోపు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.అలాగే నిర్మాణంలో ఉన్న జూనియర్ కళాశాలలు, భవిత కేంద్రాలపై సమీక్ష నిర్వహించారు.

# విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు ప్రయోగశాల

### వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి



**వరంగల్ ప్రతినిధి, జూలై 25 (జనంసాక్షి):** విద్యార్థులు విద్య విధానాలను అలవర్చుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. శుక్రవారం మామ్ నూర్ పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో పీఎం శ్రీ నిధి ద్వారా 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కృత్రిమ మేధో ఆధునిక సాంకేతిక నైపుణ్యాభివృద్ధి ( సంకల్ప్) ల్యాబ్ ను కలెక్టర్ ప్రారంభించారు. విద్యాలయానికి ముఖ్య అతిథిగా చేరుకున్న కలెక్టర్ డాక్టర్ సత్య శారదను ప్రిన్సిపల్ పూర్ణిమ, ఎన్సిసి స్కౌట్ గైడ్ విద్యార్థినీ విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు . ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిని అందించేందుకు ప్రత్యేకమైన ప్రయోగశాలను పీఎం శ్రీ పాఠశాలల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ల్యాబ్ లో విద్యార్థులు రోబోటిక్స్ ఐఓటి, బేసిక్ ఎలక్ట్రానిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రెన్యువల్ ఎనర్జీ సిస్టం వంటి అంశాలను ప్రయోగాత్మకంగా నేర్చుకోవాలని కోరారు. కలెక్టర్ విద్యార్థులతో స్వయంగా సంభాషించి ఇష్టపూర్వకంగా చదివి భావిభారత పౌరులు కావాలని కోరారు.విద్యార్థులను ఉత్తేజ పరుస్తూ భయాన్ని సంకోచతత్వాన్ని వీడాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. అనంతరం ఏక్ పేడ్ మాకే నామ్ లో భాగంగా విద్యాలయ ప్రాంగణంలో కలెక్టర్ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పూర్ణిమ, సురేష్ రామలింగయ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రైతుల రక్తసిక్తమైన కష్టం, ఆశలతో కూడిన విత్తనాలు, వానాకాలం కోసం చేసే ఎదురుచూపులు... అయితే, ఈ ఆశలను నీచమైన నకిలీ విత్తనాలతో మోసగించడం హృదయాన్ని కలచివేస్తుంది. దేశానికి అన్నం పెట్టే రైతన్నలు దళారుల మోసాలకు బలవుతున్న ఈ వేదనాజనక పరిస్థితి మనసును కదిలిస్తుంది. నాణ్యమైన విత్తనాల కోసం ఆశపడే రైతు, తన కష్టార్జిత డబ్బుతో నకిలీ విత్తనాలను కొని, పంటలు ఫలించక నిరాశలో మునిగిపోతున్న దృశ్యం ఎవరి గుండెనైనా బరువెక్కిస్తుంది. ఈ నీచమైన దందాకు అడ్డుకట్ట వేయడం కోసం, రైతుల ఆశలను కాపాడడం కోసం, ఇప్పుడు మనం ఏం చేయాలి?

# నకిలీ విత్తనాలతో గోసపడుతున్న రైతులు

ప్రతిసారి నకిలీ విత్తనాలతో రైతులు మోసపోతున్నారు. దేశానికి అన్నం పెట్టేటువంటి రైతులు దళారుల చేతిలో మోసపోతు గోసపడుతున్నారు. వానాకాలం ప్రారంభమైతే చాలు దుక్కులన్నీ చదును చేసుకుని, పంటలు వేసుకోవడానికి సిద్ధంగా ఉంటాయి. ఇక వారికి కావాల్సింది నాణ్యమైనటువంటి విత్తనాలు. ఈ నాణ్యమైనటువంటి విత్తనాల కోసం వారు వారికి దగ్గరలో ఉన్నటువంటి ప్రైవేటు ఫర్టిలైజర్స్ షాపుల పైన ఆధారపడుతుంటారు. అందులో కొంతమంది నాణ్యమైన విత్తనాలను రైతులకు ఇస్తే, కొంతమంది డబ్బే ప్రధానంగా నకిలీ విత్తనాలను విక్రయిస్తూ సంపాదిస్తున్నారు. ఇటీవల కాలంలో రకరకాల పేర్లతో, రకరకాల కంపెనీలతో నకిలీ విత్తనాలు విచ్చలవిడిగా మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ప్రతి సంవత్సరం వీటిని విక్రయించేటువంటి వారిని పోలీసులు పట్టుకొని, చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకున్నప్పటికీ ఇంకా చాలా ప్రాంతాలలో యేదేచ్ఛగా నకిలీ విత్తనాల దందా కొనసాగుతుంది.నకిలీ విత్తనాల విక్రయించే వారి ఆగడాలకు అంతులేకుండా పోతుంది.వర్షాలు ప్రారంభం కావడంతో నిషేధిత బిటి 3 (లూజ్) విత్తనాల విక్రయాలు గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్నాయి.గ్రామాలకు సంబంధించిన కొంతమంది ఓ ముఠాగా ఏర్పడి ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుండి నకిలీ బీటి 3 విత్తనాలను దిగుమతి చేసి రైతులకు కిలో రూ,3000 లకు రైతులకు విక్రయిస్తున్నారు. ఇవే కాక రైతులు పెట్టేటువంటి పత్తి, వరి, మొక్కజొన్న, ఇతర పంటలకు సంబంధించిన మరియు కూరగాయల,పండ్ల పంటలకు సంబంధించిన నకిలీ విత్తనాలు మార్కెట్లలో చాలాచోట్ల పట్టుబడుతున్నాయి. నకిలీ విత్తనాలే కాకుండా నకిలీ మందులు కూడా అనేకంగా ఉన్నాయి.పంటపై పిచికారి చేసేందుకు ప్రభుత్వ నిషేధిత గ్లైపోసెట్ మందులు సైతం ముందస్తుగానే సరఫరా చేస్తున్నట్లు సమాచారం.ఇదిలా ఉంటే ప్రతి వానకాలం సీజన్ లో కొంత మంది ముఠా సభ్యులు నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లు తెలిసినప్పటికీ సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు తూతూ మంత్రంగా ఎరువుల దుకాణాల తనిఖీలు చేస్తున్నామంటూ చేతులు దులుపుకోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోంది.రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నకిలీ బీటి 3 విత్తనాల అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అవి మంచి విత్తనాలను తీసుకొచ్చినటువంటి రైతులు వారి పొలాల్లో నాటి కొద్దిరోజుల తర్వాత పూత ఖాతా రాకపోవడం వల్ల అవి నకిలీ అని గుర్తించి అధికారులకు సమాచారం ఇస్తున్నారు. పంట వేసిన తర్వాత దానికి కొంత పెట్టుబడి కూడా పెట్టడం జరుగుతుంది. మరి ఈ నకిలీ విత్తనాలను గుర్తించడానికి రైతులకు అనేక అవగాహన కార్యక్రమాలు పెట్టినప్పటికీ, చదువు లేనటువంటి వారు వాటిని గుర్తించలేకపోతున్నారు. ముందుగా వారు కొనే ప్రతి విత్తనానికి ఫర్టిలైజర్ షాపుల యజమానితో రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి.విత్తన అనుమతులు పొందిన మంచి కంపెనీల గుర్తింపు పొందిన డీలర్ల నుంచే విత్తనాలు కొనాలి. ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందినటువంటి లైసెన్స్ కలిగినటువంటి డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు తీసుకోవాలి. స్థానికంగా ఉన్న ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాలు, ప్రభుత్వ వ్యవసాయ పనిముట్లు విత్తనాలు విక్రయించేటువంటి వారి వద్ద మాత్రమే విత్తనాలను తీసుకోవాలి. అక్రమ వ్యాపారులకు దూరంగా ఉండాలి. విత్తనాల బ్యాగును క్షుణ్ణంగా పరిశీలించి, దానిపైన ఉండే హాలో గ్రామ్ ఉందో లేదో సరిచూసుకొవాలి. ప్రతి బ్యాగ్ కు బార్ కోడ్ ఉంటే దాన్ని స్కాన్ చేసినట్లయితే దాని పూర్తి వివరాలు మనకి కనిపిస్తాయి. విత్తన సంచి వెనక స్టిక్కర్ ఉందో లేదో చూసుకోవాలి. ప్రైవేటు కంపెనీల విత్తన సంచుల వెనుక భాగంలో పచ్చ రంగు ట్యాగ్ అంటే రూట్ ఫుల్ లేబుల్ అని,లేదా నీలి ట్యాగ్ ఆధారంగా సర్టిఫైడ్ సీడ్ అని గుర్తించాలి. పత్తి,మిరప వంటి విత్తనాలకు పచ్చ ట్యాగ్ ఉండేలా చూసుకోవాలి. ప్రతి ట్యాగ్ పైన లైసెన్స్ లార్డ్ నెంబర్ క్యూఆర్ కోడ్ ఉంటేనే అది నమ్మకమైన విత్తనముగా గుర్తించాలి. మరొక ముఖ్య విషయం ఏమిటంటే ప్యాకింగ్ తేదీ మరియు చెల్లుబాటు గల తేదీలను ముద్రించబడి ఉన్నాయా లేదా అనేది చూసుకోవాలి. అలా లేని వాటిని కొనొద్దు. ఇవే కాకుండా జీవ సాంకేతికతను ఉపయోగించి జన్యు శాతం వంటి ప్రమాణాలు తప్పక మొలక శాతం 80 కంటే ఎక్కువ. జన్యు శాతం 98 కంటే ఎక్కువగా ఉండేలా చూడాలి. ఇలా చూసుకుని ఉన్నప్పుడే రైతులు నకిలి విత్తనాలు నుండి ఆర్థికంగా నష్టపోకుండా ఉంటారు. లేకపోతే అధిక నష్టం వాటిల్లవచ్చు.అందుకే ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రైవేటు విత్తన విక్రయ కేంద్రాల పైన దాడులు జరిపి అవి మన్నికైనవా కావా అనేటువంటిది చూసుకోవాలి. వాటి తయారీ కేంద్రాలకు వెళ్లి విత్తనాలను పరీక్ష చేయాలి. పకడ్బందీ చర్యలు తీసుకుంటేనే నకిలీ విత్తనాలను అరికట్టవచ్చు. ఆ దిశగా ప్రభుత్వము,వ్యక్తులు పనిచేయాలి.



డాక్టర్ మోటె చిరంజీవి
సామాజికవేత్త, విశ్లేషకులు
సెల్ : 9949194327

# అమెరికా-భారత్ సంబంధాలు




**ట్రంప్ అనాగరిక ప్రవర్తనతో క్షీణిస్తున్న అమెరికా ప్రతిష్ట**

డొనాల్డ్ ట్రంప్ రెండవసారి అమెరికా అధ్యక్షుడిగా అధికారం చేపట్టినప్పటి నుండి, అమెరికా-భారత్ సంబంధాలు గణనీయమైన క్షీణతను చవిచూస్తున్నాయి. "అమెరికాను తిరిగి గొప్పదేశంగా" మార్చాలనే ట్రంప్ లక్ష్యం దేశభక్తితో కూడిన ఆలోచనగా కనిపించినప్పటికీ, ఆయన అనుసరిస్తున్న విధానాలు, హఠాత్తు నిర్ణయాలు, అనాగరిక భాష, ప్రవర్తన అమెరికా ప్రతిష్టను, అంతర్జాతీయ సంబంధాలను దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా భారతదేశంతో సంబంధాలలో ఏర్పడిన చీలిక, ట్రంప్ యొక్క వివాదాస్పద వైఖరి, అంతర్జాతీయ సమాజంలో అమెరికాకు జరుగుతున్న నష్టాన్ని ఈ వ్యాసం విశ్లేషిస్తుంది. భారతీయులే లక్ష్యంగా ట్రంప్ యొక్క విధానాలు భారతీయ వలసదారులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మైక్రోసాఫ్ట్,గూగుల్ వంటి టెక్ దిగ్గజాలలో భారతీయుల నియామకాలను నిషేధించాలని ఆయన చేసిన పిలుపు, భారతదేశంతో సంబంధాలను దెబ్బతీసేలా ఉంది. ఈ వైఖరి కేవలం ఆర్థిక సంబంధాలను మాత్రమే కాకుండా, దీర్ఘకాలిక సాంస్కృతిక, సామాజిక బంధాలను కూడా దెబ్బతీస్తోంది. భారతీయ వలసదారులు అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా సాంకేతిక రంగంలో, గణనీయమైన కృషి చేశారు. ఉదాహరణకు, సుందర్ పిచాయ్ (గూగుల్ సీఈఓ), సత్య నాదెళ్ల (మైక్రోసాఫ్ట్ సీఈఓ) వంటి భారతీయ కంప్యూటర్ సైన్స్, సాంకేతిక నిపుణులు అమెరికా టెక్ రంగంలో విశిష్ట స్థానాన్ని సంపాదించారు. ట్రంప్ యొక్క ఈ హెచ్చరికలు వారి సహకారాన్ని అవమానించడమే కాకుండా, అమెరికా యొక్క బహుసాంస్కృతిక స్ఫూర్తిని కూడా దెబ్బతీస్తున్నాయి.

అమెరికా మీడియాలో కూడా ఈ నిర్ణయాలపై విమర్శలు వెల్లువెత్తాయి. "న్యూయార్క్ టైమ్స్" వంటి పత్రికలు ట్రంప్ యొక్క వలస విధానాలను "ఆర్థిక స్వయం విధ్వంసం"గా అభివర్ణించాయి, ఎందుకంటే భారతీయ టెక్ నిపుణులు అమెరికా ఆర్థిక వ్యవస్థకు బిలియన్ల డాలర్ల విలువైన సహకారం అందిస్తున్నారు. అదే సమయంలో, భారతీయ మీడియా సంస్థలు, "ది హిందూ" మరియు "ఇండియా టుడే" వంటివి, ట్రంప్ వైఖరిని "వివక్షపూరితం" అని ఖండించాయి, ఇది భారతీయ సమాజంలో తీవ్రమైన అసంతృప్తిని రేకెత్తించింది.

**అంతర్జాతీయ సంబంధాలపై ప్రభావం:**

ట్రంప్ యొక్క విదేశీ విధానాలు కేవలం భారతదేశంతోనే కాకుండా, ఇతర దేశాలతో సంబంధాలను కూడా దెబ్బతీస్తున్నాయి. ఉదాహరణకు, ట్రంప్ యొక్క ఇజ్రాయిల్, అలాగే ఉక్రెయిన్‌కు సైనిక, ఆర్థిక సహాయం అందించడం, యుద్ధాలను ప్రోత్సహించడం వంటి చర్యలు అంతర్జాతీయ సమాజంలో అమెరికా యొక్క నైతిక స్థానాన్ని దిగజార్చాయి. "గార్డియన్" (యూకే) మరియు "లే మాండే" (ఫ్రాన్స్) వంటి అంతర్జాతీయ మీడియా సంస్థలు ట్రంప్ నిర్ణయాలను "ప్రపంచ శాంతికి ముప్పు"గా అభివర్ణించాయి. ఈ విధానాలు అమెరికాను ఒంటరిగా నిలబెట్టే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

భారతదేశంతో సంబంధాలలో, ట్రంప్ యొక్క వ్యక్తిగత విమర్శలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో స్నేహపూర్వక సంబంధాలను కూడా దెబ్బతీశాయి. ఒకప్పుడు "మోదీ నా మంచి మిత్రుడు" అని ప్రకటించిన ట్రంప్, ఇప్పుడు భారతదేశంపై విమర్శలు గుప్పించడం, వాణిజ్య ఒప్పందాలలో అసమంజసమైన షరతులు విధించడం వంటి చర్యలతో ద్వైపాక్షిక సంబంధాలను కూడా దెబ్బతీస్తున్నాడు. భారతదేశం యొక్క "మేక్ ఇన్ ఇండియా" వంటి కార్యక్రమాలు అమెరికా సహకారంతో మరింత బలపడవచ్చునని భారతీయ విశ్లేషకులు భావించినప్పటికీ, ట్రంప్ యొక్క ఏకపక్ష నిర్ణయాలు ఈ అవకాశాలను అడ్డుకుంటున్నాయి.

**నిరసనలు, ప్రపంచ ప్రజల అసంతృప్తి:**

ట్రంప్ నిర్ణయాలకు వ్యతిరేకంగా అమెరికాలోనూ, అంతర్జాతీయంగా పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు జరిగాయి. అమెరికాలో, న్యూయార్క్, కాలిఫోర్నియా వంటి నగరాల్లో భారతీయ వలసదారులు, స్థానిక అమెరికన్లు ట్రంప్ వలస విధానాలకు వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించారు.ప్లకార్డులతో నినాదాలతో హోరెత్తించారు. భారతదేశంలో, న్యూఢిల్లీ, బెంగళూరు వంటి నగరాల్లో ట్రంప్ వైఖరిని ఖండిస్తూ నిరసన దీక్షలు జరిగాయి. ఈ నిరసనలు ట్రంప్ విధానాలు కేవలం ఆర్థిక సమస్యలను మాత్రమే కాకుండా, మానవీయ విలువలను కూడా దెబ్బతీస్తున్నాయని స్పష్టం చేశాయి.

అంతర్జాతీయంగా, యూరోపియన్ యూనియన్, కెనడా, మరియు ఆస్ట్రేలియా వంటి దేశాల పౌరులు కూడా ట్రంప్ యొక్క విదేశీ విధానాలను వ్యతిరేకించారు. లండన్‌లో జరిగిన ఒక భారీ నిరసన ర్యాలీలో, ట్రంప్ యొక్క యుద్ధ ప్రోత్సాహక విధానాలను "ప్రపంచ శాంతికి ముప్పు"గా అభివర్ణించారు. ఈ నిరసనలు ట్రంప్ యొక్క అనాలోచిత నిర్ణయాలు అమెరికాను అంతర్జాతీయంగా ఒంటరిగా నిలబెట్టే ప్రమాదాన్ని సూచిస్తున్నాయి.

**ట్రంప్ కు "నోబెల్ శాంతి బహుమతా" !!**

**ఒక వ్యంగ్యం:**


ట్రంప్ యొక్క విధానాలు, ముఖ్యంగా ఇజ్రాయిల్, ఉక్రెయిన్‌లో యుద్ధాలకు సహకారం, ప్రపంచ శాంతికి విరుద్ధంగా ఉన్నాయి. అటువంటి నాయకుడికి నోబెల్ శాంతి బహుమతి లభిస్తే, అది ఆ బహుమతి యొక్క గౌరవాన్ని దిగజార్చడమే అవుతుంది. ప్రపంచ ప్రజలు నవ్వి పోతారు. అంతర్జాతీయ విశ్లేషకులు, "ట్రంప్ యొక్క చర్యలు శాంతిని ప్రోత్సహించడం కాదు, సంఘర్షణలను రెచ్చగొట్టడం" అని స్పష్టం చేశారు. ఉదాహరణకు, ట్రంప్ యొక్క ఇజ్రాయిల్-పాలస్తీనా విధానం మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఈ నేపథ్యంలో, నోబెల్ శాంతి బహుమతి నిర్వాహకులు ట్రంప్‌ను పరిగణనలోకి తీసుకుంటే, అది ప్రపంచ వ్యాప్తంగా నిందలను ఆహ్వానించడమే అవుతుంది. "నోబుల్ శాంతి బహుమతి" ప్రతిష్ట దిగజారుతుంది.

ట్రంప్ యొక్క అనాలోచిత నిర్ణయాలు అమెరికా ప్రతిష్టను దెబ్బ తీస్తాయి. అంతర్జాతీయ సంబంధాలలో "ఏకాకి" అవుతుంది. ఆర్థిక సంక్షోభం, సామాజిక అసమానతలు అమెరికా పౌరులకు దీర్ఘకాలిక నష్టాన్ని కలిగిస్తాయి. భారతదేశంతో సంబంధాల దెబ్బ తినడం వల్ల, అమెరికా టెక్ రంగంలో నైపుణ్యం కలిగిన నిపుణుల కొరతను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. అదే సమయం లో, భారతదేశం వంటి దేశాలు చైనా, రష్యా వంటి ఇతర శక్తులతో సంబంధాలను బలోపేతం చేసుకోవచ్చు. ఇది అమెరికా యొక్క భౌగోళిక-రాజకీయ (జియో పాలిటిక్స్) ప్రభావాన్ని బలహీన పరుస్తుంది. ట్రంప్ యొక్క అనాగరిక భాష అతని మానసిక,బాహ్య ప్రవర్తన, హఠాత్తు నిర్ణయాలు,వివాదాస్పద విధానాలు అమెరికాను అంతర్జాతీయంగా ఒంటరిగా నిలబెట్టే ప్రమాదం ఉంది. భారతదేశంతో సంబంధాల దెబ్బతినడం, వలసదారులపై వివక్ష, యుద్ధ ప్రోత్సాహక విధానాలు అమెరికా యొక్క నైతిక, ఆర్థిక స్థానాన్ని దిగజార్చాయి. ప్రపంచ దేశాల ప్రజలు, మీడియా, మరియు నిరసనకారులు ట్రంప్ వైఖరిని ఖండిస్తున్నారు. ఈ పరిస్థితిలో, ట్రంప్ తన విధానాలను సమీక్షించుకోవాలి, లేకపోతే అమెరికా దీర్ఘకాలిక నష్టాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రపంచ శాంతి, సహకారం, మరియు బహు సాంస్కృతిక సమాజాన్ని ప్రోత్సహించే నాయకత్వం అవసరం. ట్రంప్ యొక్క విభజనకర విధానాలు కాదు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# ఉపరాష్ట్రపతి పోస్టు.. ఊహాగానాల టేస్టు




ఉపరాష్ట్రపతి పోస్టు అనూహ్యంగా, సంచలనాత్మకంగా ఖాళీ అవడం రకరకాల ఊహాగానాల రుచులను వడ్డిస్తోంది. భౌతిక వార్తా పత్రికలు, టెలివిజన్ న్యూస్ ఛానళ్ళకే అయాచిత ముడిసరుకు అయిందంటేనే ఇక తక్కిన బహురూప మీడియాకు మరెంతలా ఆహారమైందో చెప్పక్కర్లేదు. రాజ్యాంగ పరంగా మన దేశంలో రెండో అతిపెద్ద పదవి అయిన భారత ఉప రాష్ట్రపతి పీఠాన్ని జగ్ దీప్ ధన్ ఖడ్ హఠాత్తుగా వీడడం తక్షణ విశ్లేషణలకు ఓ పట్టాన చిక్కని నిష్క్రమణగా ప్రస్తుతానికి నిలిచింది. ఓసారి సీట్లో ఆశీనులైతే చాలు ఇక అస్సలు దిగిపోబుద్ధికాని ఈ రోజుల్లో ఏకంగా ఇంకా రెండేళ్ల పదవి కాలం మిగిలి ఉండగానే రాజీనామా చేయడానికి అధికారికంగా పేర్కొన్న కారణం "అనారోగ్యం". రిజైన్‌కు ఏ రీజనైతే నమోదైందో అచ్చం అదే నమ్మశక్యంగా లేదనేది ఢిల్లీ నుంచి మన దాకా మొత్తం దేశమంతా వినిపిస్తోంది. ఎందుకూ, అసలు కారణం ఏమిటీ? అనే ప్రశ్నలు, సందే హాల వంటకాలు మనకు వదిలేసి ఎంచక్కా సైలెంటుగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆకాశయానం చేయగా.. భిన్న వాదనలు, ప్రశంసలు, విమర్శల మిశ్రమాల మూటతో తనదైన ముద్ర వేస్తూ ఆకస్మికంగా ఇంటి దారి పట్టారు ధన్ ఖడ్. ఆ విధంగా ఆ ఇద్దరు మహానుభావులు ఇంతకీ వాస్తవంగా జరిగింది, జరుగబోయేది ఏందనే చర్చోపచర్చల సరుకు దేశం మొత్తానికి అప్పగించేశారు. ఇప్పటికే కాలమిస్టులు కాలాలు, ఎడిటర్లు ఎడిటోరియళ్ళు పరిచేయగా, పనిలోపనిగా డిజిటల్ కమ్ సోషల్ మీడియా రారాజులు యమ టేస్టీ టేస్టీ ఘుమఘుమలు వదులు తున్నారు. ఉపరాష్ట్రపతి రాజీనామా తర్వాత తొలి పొద్దు తెలుగు రాజకీయాలతో దేశ రాజకీయాలకు లంకె వేస్తూ, ధన్ ఖడ్ ప్లేసులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి బాబు, బాబు ప్లేసులో లోకేశ్ అంటూ క్షణ కాలం కన్ను ఆర్పని, చెవులు మూయని రాజకీయ మాయాజాలాన్ని చూపారు. అదలా ఉండగానే మారిన తేదీన మరో తాత్కాలిక ప్రచారానికి సమరశంఖం పూరించారు. ఈసారి తెలంగాణ వంతు వచ్చింది.

ధన్ ఖడ్ సీటులోకి కేసీఆర్, కేసీఆర్ సీటులో కేటీఆర్ సెటిల్ అవుతారంటూ మరో ఊహాగానాల వేడి వేడి జల్లు కురిపించారు. ఇందుకు ఓ బేసూ ఇచ్చేశారు. ఆ పార్టీ ఈ పార్టీ మమేకం అవుతాయని, ఉద్యమ పార్టీ ఈ డీల్ తో గతం కాబోతుందనే పుకార్లతో అవాక్కు చేయజూస్తున్నారు. కవిత ఆ మధ్య చేసిన వ్యాఖ్యలను ఇందుకు వాడుకుంటున్నారు. ఓవరాల్ గా తదుపరి ఎపుడైనా ఇక తెలంగాణలో ఏర్పడేది బీజేపీ సర్కారేనంటూ కూడికలు, తీసివేతల గణితం వేస్తున్నారు. జగ దీప్ ధన్ ఖడ్ రాజీనామాలో అంతర్గతంగా లోతైన కారణాలు ఉన్నట్టు గట్టిగా శంకిస్తున్నారు. ఇప్పటికిప్పుడు వైదొలగేది లేనందునే ఉపరాష్ట్రపతిగా తన అధికారిక పర్యటనల షెడ్యూల్ ఫిక్స్ ను ఉటంకిస్తున్నారు. జాతీయ స్థాయిలో ఏదో అంతకుమించిన వ్యూహం ఉండబట్టే కేంద్ర ప్రభుత్వాన్ని లీడ్ చేస్తున్న బీజేపీ కదలికలు, సంకేతాలు, మనసెరిగి ఉపరాష్ట్రపతి పదవి నుంచి ధన్ ఖడ్ అర్థాంతరంగా తప్పుకొని ఉండొచ్చని బాగా విశ్వసిస్తున్నారు. అసలే స్వతంత్రంగా వ్యవహరించే ధన్ ఖడ్ ఇంత ఆకస్మికంగా, సున్నితంగా దిగిపోయి ఉండరని భావిస్తున్నారు. అసలు నిజాలు, నేపథ్యం ఈరోజు కాకుంటే రేపు లేదా ఏ ఆత్మకథలోనో తెలియవచ్చు. కానీ, ఖాళీ అయిన ఆ పీఠంపై ఎవరు కూచుంటారనే దానికి జాతీయ స్థాయిలో బిహార్ ను లింక్ చేస్తుండగా, మన వద్ద మాత్రం బాబు లేదా కేసీఆర్ తో ప్రచారాలు తెగ అల్లుతున్నారు. ఉపరాష్ట్రపతి పదవికి బిహార్ సీఎం నితీశ్ కుమార్, రాజ్యసభ ప్రస్తుత డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్, బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా, కాంగ్రెస్ కు పంటి కింద రాయిలా పరిణమించిన ఆ పార్టీ అసమ్మతి నేత శశి థరూర్ ల పేర్ల సరసన మన తెలుగు నేతలు చంద్రబాబు, కేసీఆర్ ల ప్రస్తావన విశేషమే అయినప్పటికీ ఈ క్షణానికైతే ఆ ఊహాగానాలు అసంబద్ధమే. కానీ పాలిటిక్స్ లో ఏదైనా సంభవమే. కొత్త ఉపరాష్ట్రపతి పదవికి ఎవరు పోటీ చేసినా, గెలిచేది మాత్రం ఎన్డీయే అభ్యర్థే. ఇప్పుడు ఎగువ సభలో, పార్లమెంటులో మొత్తంగా ఉభయ సభల్లో సభ్యుల సంఖ్య 786. ఉపరాష్ట్రపతి గెలుపునకు కావాల్సిన సంఖ్య 394. ఎన్డీయే బలగం 422. ఇది చాలు ఆ అత్యున్నత రెండో పోస్టు దక్కేది బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమికేనని డిసైడ్ అయ్యేందుకు. కాబట్టి విదేశాల నుంచి మోదీ తిరిగొచ్చి, నింపాదిగా ఓ కొలిక్కి తెచ్చేదాకా ఈ ఊహాగానాల హోరెత్తుతూనే ఉంటాయి.

ఇల్లెందుల దుర్గాప్రసాద్
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
హైదరాబాద్ , 9440850384

## పెదవి విరుపు



ఒక భిషక్కును అడిగాను
పాడిత్యం చూడమని
ఒక విమర్శకుడిని అడిగాను
కవితలను విశ్లేషించమని
ఒక సాటికవిని అడిగాను
పదబంధాలు శైలిని
వివరించమని
ఒక సామాన్యుడికి
కవిత చదివి వినిపించాను
అర్థమయ్యిందా అని
అడిగాను...
మొదటి ముగ్గురు సరై అన్నారు
బహు కొత్తగా ఉందన్నారు
నాల్గవ వాడు
నా కోసం కాదు
నీ ప్రతిభ కోసం
రాసుకున్నావు
అని పెదవి విరిచాడు

రేడియమ్
9291527757

# ఇదీ ఒక ప్రజాస్వామిక పరిపాలనేనా?

ఇండియాకు పోతున్నారా! జాగ్రత్త సుమీ! అక్కడ హత్యలు, మానభంగాలు, దోపిడీలు, రేప్‌లు రెచ్చిపోతున్నాయి "అని అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ హెచ్చరిక. నాలుగు వేదాలు పుట్టిన భూమిలో రాముడు జన్మించిన పవిత్ర స్థలంలో బుద్ధుడి మూలాలు ఉన్న భారత్‌లో ఘోరాలు నేరాలా ! దేశ ప్రతిష్ట అంతర్జాతీయ స్థాయిలో ఇంతకు దిగజారిందా? అవమానాలు సహింతుమే ! సుంకాల వజ్రాయుధం ఉన్నదని అందరిమీద ఎగబడతారా! అది ఎప్పుడో ఒకప్పుడు గోడకు కొట్టిన బంతిలా వచ్చి కంపు చేసి మట్టి కరిపిస్తుంది ఖబడ్దార్! ట్రంప్ గారు మా అంతరంగిక వ్యవహారంలో తల దూర్చేరు తస్మాత్ జాగ్రత్త! అని మన దేశ రథసారథి మోడీ గారు అమెరికా కు తన వాయిస్‌ను దిక్కులు పిక్కటిల్లేలా వినిపించాల్సిందే. ఇంతకు మనం దేశం ఎటు వైపు పోతుంది ? ఏమి జరుగుతుంది? ఒక్క సారి దేశ పరిపాలన మైక్రోస్కోప్‌తో చూస్తే ఉన్నది ఉన్నట్లుగా దృశ్య మాలిక వీక్షించవచ్చు.

స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఐదు వసంతాలు గడిచినా దేశం అభివృద్ధి చెందుతూనే ఉందా! ప్రధానమంత్రి మోడీగారు ప్రధానమంత్రి పదవి చేబట్టి పది సంవత్సరాలు దాటనున్నాయి. హిందూ భావ జాలం నుండి వచ్చిన మోడీ గారి పరిపాలన మతము తో ముడి పడి ఉన్నందున అనేక విమర్శలను ఎదుర్కొంటున్నారు .లోకం చుట్టిన వీరుడు గా సమర్థమంతమైన నాయకుడిగా మహోన్నత మైన బిరుదులతో సన్మానాలు సత్కారాలు అందుకుంటున్నాడు. అసలు ప్రధాన మంత్రి అంటే ఇలా ఉండాలి అనేలా ఉన్నాడు. అసలు విషయానికి వస్తే స్వంత దేశములో అనేక మైన బర్నింగ్ సమస్యలు పరిష్కారం చేయకుండా దేశాలు తిరిగి ఉపన్యాసలిస్తే దేశం అన్ని కోణాలలో అభివృద్ధి చెందినట్టేనా ! "ఇంట గెలిచి రచ్చ గెలవాలి " ముందు తనదేశం, చక్కబెట్టుకోవాలి .ఒక సారి దేశం ప్రోగ్రెస్ కార్డ్ చూద్దాం రండి ఎలా ఉందో మానవాభివృద్ధి సూచిక లో 193 దేశాలలో భారతదేశం 130 స్థానములో ఉంది . GDP 2024-2025 ఆర్థిక సంవత్సరానికి 6.5% గత సంవత్సరాల కంటే అధికముగా ఉన్న అభివృద్ధి చెందిన దేశాలకంటే వెనుకబడి ఉంది , అని చెప్ప వచ్చు.మన దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నముగా ఉంది, తలసరి ఆదాయం , పారిశ్రామికీ కరణ.అభివృద్ధి అంకెలు అందుకోలేదు. పేదరికము చుట్టుముట్టి ఆకలి కేకలతో అసువులు బాస్తున్నారు.గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతులు లేక నానా అవస్థలు పడుతున్నారు. కాలుష్యము కోరలు విప్పి బుసలు కొడుతూ కాటేస్తూ ఉంది. దేశ రాజధాని డిల్లీ లో శ్వాశ తీసుకునే పరిస్థితి లేదు. పరిశోధన కేంద్రాలకు ప్రాముఖ్యత లేదు.కొత్త కొత్త ఆవిష్కరణలు అంతకన్నా లేవు. సాంకేతికంగా మెరుగ్గా ఉన్నా ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. ముక్కోటి దేవతలున్న దేశాల కంటే లక్ష్మీ, సరస్వతి, ఊసే లేని నాస్తిక దేశా లు అభివృద్ధి చెంది ఉన్నాయి." అందుకే అన్నారు ""అన్నీ తెలిసినవాడు అమావాస్య రోజు చస్తే ఏమి తెలియని వాడు పౌర్ణమి రోజు చచ్చినట్లు"గా ఉంది మన పవిత్ర దేవుళ్ల దేశం. కెనడా ,నార్వే ఆస్ట్రేలియా, బెల్జియం,జపాన్, డెన్మార్క్ దేశాలలో ప్రార్థనా మందిరాలు లేవు. పూజలు, యజ్ఞ యాగాదులు కుంభమేళాలు ఉంటే ఒట్టు మానవతావాదం ,హేతువాద భావ




జాలం తో పాటు పరిశోధనలు కొంగ్రొత్త ఆవిష్కరణలు విరాజిల్లు తున్నాయి. స్థూల దేశీయ ఉత్పత్తి, తలసరి ఆదాయం, పారిశ్రామికీకరణ, భవిష్యత్ అభివృద్ధి, ప్రజల జీవన కాలం, విద్యా స్థాయి మానవ వనరుల అభివృద్ధి విద్యుత్ రవాణా సౌకర్యాలు "మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లు తున్నాయి "మోదీ నాయకత్వం వహించే మనదేశం అభివృద్ధి అంకెల అందాలను అందుకోవాలి. మన ప్రజాప్రతినిధులు ఎలా ఉన్నారంటే,"గొర్రెల మందకు తోడేలును కాపల పెట్టిన "రీతిలో ఉన్నారు. ఆర్థిక క్రమశిక్షణ లేని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత సంక్షేమ పథకాలతో ఆదాయమునకు మించిన ఖర్చులు పెట్టీ అప్పుల పాలవుతున్నాయి. నిత్యావసరాల ధరలు పెరగడానికి కారణం అవుతున్నారు ప్రభుత్వ ఆర్థిక నిపుణులు ,ప్రభుత్వ సలహాదారులు ,యంత్రాంగం అంతా ఏమి చేస్తున్నట్లు? నిరంకుశ అధికార బాహు బలి సినిమా చూస్తు ఆనందించు చున్నారా ! రాజకీయ నాయకులు అధికారం కొరకు అర్రులు చాచి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ప్రజలకు సమాధానం చెప్పలేక పాలకులు మొఖం చాటేస్తున్నారు.. ఉచిత పథకాలు "సోమరిని సోకు "చేస్తున్నాయి.కార్పొరేట్ దిగ్గజాలకు రుణమాఫీ లు ఎందుకు? పన్ను ఎగవేత దారులకు కఠిన శిక్షలు ఎక్కడా? దేశానికి కీలకమైన వ్యవసాయమునకు పెద్ద పీట వేస్తే రైతులకు అండగా నిలిస్తే ఆత్మ హత్యలు ఉండేనా? ఆదాయమునకు మించి ఖర్చు పెట్టకుండా ఆర్థిక మంత్రి బాధ్యత ఎందుకు వహించడం లేదు ? ప్రభుత్వ ముఖ్య సలహాదారులు లోటు బడ్జెట్ కు సలహాలు ఇవ్వడానికేనా ? ఇలా ఉంటే దేశం ఎలా? ఇంకెప్పుడు మారేది మహిళా లోకం ! శాస్త్రీయ దృక్పథం లేని చదువులెందుకు? ప్రశ్నించే తత్వం లేని పనులెందుకు ? .ప్రభుత్వం మాత్రం ఏమి చేస్తుంది ? సమాజములో మార్పు రావాలి మన జీవితాలకు మనమే బాధ్యులం. జైలు లో జీవచ్ఛము లా కాలం గడుపుతున్న బాబాలు పూజారుల అతీత శక్తులు ఏమైనావి ? ఏ దేవుడు కూడా కాపాడలేదు.ఈ మాత్రం తెలియని చదువుకున్న మేధావులు ఎందుకు ? ప్రతి పౌరుడు తనకు తానే ప్రశ్నించుకునే తత్వం అలవరచుకోవాలి .సమర్థమైన నీతి నిజాయితీ గల నాయకుడికి ఓటు వేసి గెలిపించాలి.నోటుకు ఓటు అమ్ముడు పోయే మనుషులు ఆలోచించాలి.గారడి చేసే రాజకీయ నాయకుల మాటలకు లొంగిపోయేరు సుమీ!

కాషాయ ముసుగులో నేరాలు చేస్తున్న వారికి బడా నాయకులు పోర్లు దండాలు పెడుతూ వారి వ్యాపారాలకు అండగా నిలిచి భక్తి చాటుకోవడం వారి మానసిక రుగ్మతగా చెప్పుకోవచ్చు.పాలకులే వారిని పెంచి పోషించడం వారి మూరత్వానికి నిలువెత్తు నిదర్శనం కాదా ! నేటి రాజకీయ నాయకులు అధికార ఆధిపత్యం కొరకు మాట్లాడే భాష కొట్లాడే తీరు చూస్తే వీధిలో కుక్కల అరుపులు గుర్తుకు వస్తాయి భౌతిక దాడులకు దిగుతున్నారు ఖాదీ బట్టలపై బురద చెత్తను అత్తర్‌లా ఒకరిపై ఒకరు చల్లుకొంటున్నారు. "ఆవులు ఆవులు కొట్లాడుకొని లేగదూడల కాళ్లు విరగగొట్టినట్లు "ఉంది . స్వంత టీవీ చానల్స్ ,వార్త సంస్థలు పెట్టుకొని నిబంధనలు పాటించకుండా తన పార్టీ గొప్పదని మిగతా పార్టీల పై అభియోగాలు మోపడం ఆమోదయోగ్యం కాదు ఉన్నతాధికారులు సమాచార చట్టం ఉల్లంఘించి అడిగినవారికి సరైన సమాచారం ఇవ్వకుండా నిజాలను దాచడం చట్ట విరుద్ధం కాదా ? జర్నలిస్టుల లో నిష్పక్షపాత వైఖరి కరువైనది వార్తలు ఆగవు నిజం దాగదు. విచ్చల విడితనం ఉగ్రవాదం, లైంగిక వాంఛలు రక్త సంబంధాలను మానవత్వాన్ని తెగ నరుకుతున్నాయి.

యువతలో ఆలోచన విధానం మారాలి. మహిళలకు రక్షణ లేకుండా పోయింది. మహిళా సాధికారత ఎక్కడుంది ? లింగ వివక్ష చెలరేగుతోంది కులమతాల చిచ్చు రగులుతుంది.నీతి ,నిజాయితీ ధర్మము సత్యం అహింస చెట్టా పట్టాలేసుకొని దిక్కులు తోచక చుక్కల దారి పట్టాయి. రాజ్యాంగం కాళ్ళు చేతులు ఇరిసి కట్టేసి నోటిలో గుడ్డ పెట్టీ అంబేద్కర్ విగ్రహం సాక్షిగా రాజకీయనాయకులు ప్రజాస్వామ్య బిడ్డను సామూహికంగా రేప్ చేస్తున్నారు మరో దిక్కు" మేకల మందలో తోడేలు ప్రవేశించినట్లు "న్యాయవ్యవస్థ లో అవినీతి దొంగలు పడ్డారు.ఇంకా రాజ్యాంగాన్ని కాపాడేదెవరు.? ప్రజాసంక్షేమం తుంగలో తొక్కారు.మరో వైపు చూస్తే రచయితలు సంస్కృతి సంప్రదాయాల ముసుగులో మూఢనమ్మకాలను జోడించి కథలు అందముగా రాస్తున్నారు.టి వి సీరియల్స్ వాటిని కలర్ ఫుల్ గా ప్రసారం చేస్తున్నాయి.కలం బలం తో గుడ్డి నమ్మకాలను బలోపేతం చేస్తారా ? గోరా. శ్రీశ్రీ , త్రిపురనేని రామస్వామి , బాలగంగాధర్ తిలక్, రావిపూడి వెంకటాద్రి మొదలైన వారిని స్ఫూర్తిగా తీసుకొని సమాజములో కుళ్ళును దులుపాలి. పుష్ప లాంటి సినిమాలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే వాడిని హీరో గా చిత్రీకరించడం రైటర్ పొరపాటు కాదా! దానికి ఇంకా ఆస్కార్ అవార్డులు లా ? ఎన్నిక చేసిన జడ్జీ ల భావజాలానికి సంకేతమా ? రాజకీయ ప్రభావమా ! ఒక వ్యాపార దృష్ట్యా కాకుండా సమాజ సేవలో భాగముగా సాహితీ వేత్తలు శాస్త్రీయ దృక్పథంతో విజ్ఞాన స్పృహతో కలాలు ఝుళిపించాలి. పాలకులు ప్రజాసంబంధాల పత్రికల వార్తలు ప్రజల నాడిగా భావించి కుల మతాల కతీతంగా సుపరిపాలన చెయ్యాలి.అప్పుడే ప్రజాస్వామ్య పాలన చిగురులు తొడుగుతుంది. దేశం అన్ని కోణాలలో అభివృద్ధి చెంది సకల జనులు సంపూర్ణ ఆరోగ్య జీవితం గడుపుతారు .ఆ దిశగా అందరం కలసి అడుగులు వేద్దాం రండి.

పూసాల సత్యనారాయణ
హైదరాబాద్, 9000792400

# మార్కెట్‌లో యూరియా కొరత

- యూరియా కోసం రైతన్నల పడిగాపులు
- ఎకరానికి బస్తా అందజేస్తున్న అధికారులు
- మరిన్ని బస్తాలు కావాలని రైతుల ఆందోళన
- విస్తారంగా వర్షాలు కురవడంతో యూరియాకు డిమాండ్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూలై 25 (జనం సాక్షి) :** ఆది నుంచి అంతం వరకు రైతన్నలకు అన్ని కష్టాలే.. నెల రోజులపాటు వర్షాలు లేక ఊరు రా బోనాలు నిర్వహించి గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. తీరా వర్షాలు వచ్చేసరికి అంగట్లో యూరియా కొరత ఏర్పడింది. యూరియా కోసం అధికారులు నిలదీసి రైతులు రోడ్డెక్కారు. అంది అందని యూరియా కోసం సొసైటీల దగ్గర రైతుల పడిగాపులు కాస్తున్నారు. వస్తే ఇస్తాం.. లేకపోతే ఏం చేస్తాం వచ్చేవరకు ఆగాల్సిందే అంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారు.. వివరాల్లోకి వెళితే వికారాబాద్ జిల్లాలో అంగట్లో యూరియా కొరత ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం సొసైటీల ద్వారా యూరియా సరఫరా చేస్తుంది. గత నెల రోజుల నుంచి వర్షాలు లేని కారణంగా రైతుల డిమాండ్ కు తగ్గట్టు యూరియా కొరత ఏర్పడలేదు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అంగట్లో యూరియాకు డిమాండ్ పెరిగింది. రైతు అవసరాలకు సరిపడా యూరియా అంగట్లో దొరకడం లేదు. వర్షాలు కురుస్తున్న కారణంగా సన్న యూరియాకు బాగా డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షం కారణంగా సన్న యూరియా మొక్కకు వేస్తే తొందరగా కరిగిపోయి మొక్క వేపుగా తరిగే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. రైతు డిమాండ్ కు తగ్గట్టు వ్యవసాయ సహకార సంఘాల ద్వారా యూరియాను రైతులకు అందజేస్తున్నామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ప్రకటించాయి. అయితే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే రైతుల అవసరాలకు తగ్గట్టుగా సొసైటీలకు యూరియా సరఫరా జరగడం లేదు. గత వారం రోజులుగా యూరియా అందుబాటు లేకపోవడంతో రైతన్నలు పడిగా పులుకాస్తూ సొసైటీల ముందు ఆందోళన చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్డుపై బైఠాయించి ధర్నాలు నిర్వహించారు. యూరియా వస్తుందని రోజు సొసైటీల చుట్టూ తిరుగుతూ పడిగాపులు కాస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా వస్తే ఇస్తాం పట్టాదారు పాస్ పుస్తకాలు ఆధార్ కార్డు ఇవ్వండి అని రైతుల నుంచి అధికారులు వాటిని తీసుకొని సాయంత్రానికి యూరియా రాలేదని తిరిగి పంపిస్తున్నారని రైతులు ఆందోళన చేశారు. యూరియా వస్తే ఎకరానికి ఒక బస్తా మాత్రమే అధికారులు ఇస్తున్నారని కనీసం ఎకరానికి మూడు బస్తాల యూరియా అవసరముంటుందని రైతులు తెలియజేశారు. దళారుల జోక్యం వలన యూరియా కొరత ఏర్పడుతుందని దళారుల జోక్యాన్ని తగ్గించాలని వ్యవసాయ అధికారులను రైతులు నిలదీశారు. యూరియా అందుబాటులోకి రావడానికి మరో మూడు రోజులు పట్టవచ్చునని వ్యవసాయ అధికారులు తెలియజేశారు.

# మంత్రి ఆదేశాలతో ప్రారంభమైన నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణ పనులు

- అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి
- కుసునూర్ బ్రిడ్జి నిర్మాణానికి ఐదు కోట్లు మంజూరు చేస్తాం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**రాయికోడు, జూలై 25 (జనంసాక్షి) :** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో రాయికోడు చౌరస్తాలో కొనసాగుతున్న నాలుగు లైన్ల సిసి రోడ్డు నిర్మాణ పనులు ఆగమేగాల మీద శుక్రవారం పున ప్రారంభమయ్యాయి. గురువారం సాయంత్రం మంత్రి దామోదర్ రాజనర్సింహ రాయికోడు మండలంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్ధన్న పాటిల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలాజీ నర్సింలు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కేదార్నాథ్ పాటిల్ లతో కలిసి సుడి గాలి పర్యటన నిర్వహించారు.మంత్రి రాఇకోడు చౌరస్తాలోని ఆత్మలింగం ఫర్టిలైజర్ షాప్ లో కొద్దిసేపు కూర్చొని కార్యకర్తలతో ముచ్చటించారు. పలువురు నాయకులు కార్యకర్తలు రైకోడ్ చౌరస్తా లోని నాలుగు లైన్ల సిసి రోడ్డు నిర్మాణానికి 12 కోట్ల 70 లక్షలు మంజూరు అయినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు కొనసాగడం లేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు స్పందించిన మంత్రి వెంటనే సంబంధిత అధికారులకు కాంట్రాక్టర్కు ఫోన్లో మందలించారు వీలైనంత తొందరలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు మంత్రి ఆదేశాలతో గురువారం రెండు జెసిబిలతో రాయికోటి చౌరస్తాలో నాలుగు లైన్ల సిసి రోడ్డు నిర్మాణ పనులను అధికారులు పున ప్రారంభించారు కుసునూరు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మండల సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కార్యకర్తలు మంత్రి దామోదర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన మంత్రి బ్రిడ్జి నిర్మాణానికి ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు సింగితం లోని నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణాన్ని పరిశీలించారు వీలైనంత తొందరలో పనులు పూర్తి చేయాలని మంత్రి దామోదర్ అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బసవరాజ్ పటేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వినయ్, వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విదర్శన్ రెడ్డి మాజీ అధ్యక్షులు ఏ ప్రభాకర్ మాజీ ఎంపీటీసీలు నాల్లోల ఆగమయ్య జీ విట్టల్ యు పండరి జి కృష్ణ కాంగ్రెస్ నాయకులు జ్ఞానేశ్వర్ మహంకాళి ఎం శివకుమార్ బాసిత్ పటేల్ వై మోహన్ ఎండి రఫీక్ ఆర్ రాజకుమార్ వీరేశం మహమ్మద్ సుల్తాన్ గొల్ల విటల్ ఒగ్గు శ్రీనివాస్ పలువురు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహాల నిర్మాణలలో పురోగతి కనిపించాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, జూలై 25 (జనం సాక్షి) :** ఇందిరమ్మ గృహాల నిర్మాణాలలో పురోగతి కనిపించేలా క్షేత్ర స్థాయిలో చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు ఇందిరమ్మ గృహాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 7 వేల ఇందిరమ్మ గృహాలు మంజూరు కాగా, ఇప్పటివరకు 543 గృహాలు మాత్రమే బేస్మెంట్ స్థాయికి చేరుకున్నాయని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల విషయంలో అలసత్వము వహించ రాదని, క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తూ,నిర్దేశిత లక్ష్యాల సాధన కోసం స్పష్టమైన దిశానిర్దేశం చేస్తున్నప్పటికీ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో స్పష్టమైన పురోగతి కనిపించకపోతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. జిల్లాను రాష్ట్ర స్థాయిలో టాప్ 10లో ఉండేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. పంచాయతీ సెక్రటరీలు, ఏ.ఈ.లు, వార్డ్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి, లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. స్థలాలపై వెంటనే మార్కింగ్ చేసి, బేస్‌మెంట్ పనులు ప్రారంభించి, ప్రతి విజిట్‌కి ఫోటోలు అప్‌లోడ్ చేసి, పనుల స్థితిని క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం అవసరమైన ఇసుక, మట్టి సోమవారం నుండి అన్ని మండలాల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు.అన్ని మున్సిపల్ పట్టణాలు,గ్రామ పంచాయతీలలో లబ్దిదారుల వివరాలను ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పోర్టల్ లో ఆన్లైన్ నమోదు చేయాలని ఆదేశించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో లక్ష్యం మేరకు సమిష్టిగా మొక్కలు నాటాలున్నారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలను మున్సిపల్ గ్రామ పంచాయతీలలో మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అన్నారు. రోడ్లపై, గుంతలలో నీరు నిలవకుండా చూడాలని అధికారులను సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస రావు, ఏ.డి. మైన్స్ వెంకట రమణ, హౌసింగ్ పీడీ కాశీనాథ్,అన్ని మండలాల ఎంపిడిఒలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి

- విద్యార్థుల భోజనం విషయంలో నాణ్యత పాటించాలి
- బడి బయట పిల్లలను బడిలో చేర్పించేందుకు కృషి చేయండి
- బర్దిపూర్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 25 (జనం సాక్షి) :** విద్యార్థులకు మెరుగైన, నాణ్యతతో కూడిన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా ఝరా సంఘం మండలంలోని బర్దిపూర్ గ్రామంలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల , ఉన్నత పాఠశాలల ను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ ... ఉపాధ్యాయులు విద్యార్థుల చదువు విషయంలో పూర్తి బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. బడీడు పిల్లలు ఎవరు బడి బయట ఉండకూడదని, బడి వయసు పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి పాఠశాలలలో చేర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతిగదులు, ఉపాధ్యాయుల హాజరు పట్టిక, విద్యార్థుల హాజరు, వంటి అంశాలను పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. తరగతి గది లను పరిశీలిస్తూ విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల అభ్యస విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులందరికీ యూనిఫారమ్స్ ,పాఠ్యపుస్తకాలు అందరికి అందాయి అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో కాంపౌండ్ వాల్ లేకపోవడాన్ని కలెక్టర్ గమనించారు. అలాగే ఇతర మౌలిక సదుపాయాల కల్పనపైనా ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపుకల్లెక్టర్ మాధురి , జహీరాబాద్ ఆర్ డి ఓ రామ్ రెడ్డి , సంబంధిత విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 2 కోట్లకు పైగా సైబర్ మోసం



**అచ్చంపేట, జూలై 24 (జనం సాక్షి) :** అచ్చంపేట పట్టణానికి చెందిన అనిరుద్ అనే వ్యక్తి సైబర్ మోసాలకు పాల్పడుతూ రెండు కోట్లకు పైగా సైబర్ మోసాలకు ప్రజలు మోసపోతు తమ అకౌంట్లో ఉన్న డబ్బులు పోగొట్టుకుంటున్న సందర్భాలు. అలాంటి సైబర్ మోసానికి పాల్పడిన అనిరుద్ అనే వ్యక్తి నాగర్ కర అచ్చంపేట పట్టణానికి చెందిన వ్యక్తి ఉన్నట్లు బీహార్ పోలీసులు అక్కడి రాష్ట్ర ప్రజలకు సైబర్ మోసాలకు గురైన వారు ఫిర్యాదు చేయడంతో స్థానికుల ఫిర్యాదుతో సైబర్ మోసాలకు పాల్పడిన వ్యక్తిని చాకచక్యంగా చేదించేందుకు శుక్రవారం అచ్చంపేట పట్టణానికి బిహారి పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో విచారణ చేపట్టడం తో పట్టణంలో కలకలం రేపింది సైబర్ మోసాలకు పాల్పడిన వ్యక్తి బీటెక్ పూర్తి చేశాడని, పలు సాఫ్ట్ వేర్ కంపెనీలలో పనిచేశాడని, కంప్యూటర్ వాడటంలో మెరుగైన నైపుణ్యం కలవాడని ఈ క్రమంలోనే సైబరు మోసాలకు పాల్పడ్డాడని ఆ వ్యక్తిపై ఆరోపణలు చేస్తూ అక్కడి పోలీసులు తెలిపారు. ఈ విషయంపై అచ్చంపేట ఎస్సై విజయ భాస్కర్ ను జనం సాక్షి ఫోన్ ద్వారా వివరణ కోరగా సైబర్ నేరాలకు పాల్పడిన వ్యక్తి అచ్చంపేట పట్టణంలో ఉన్నాడు మీ సహకారం కావాలని బీహార్ రాష్ట్రానికి చెందిన పోలీసులు మా సహకారం తీసుకున్నారన్నారు. దాదాపు రెండు కోట్లకు పైగా డబ్బులను తనకున్న జ్ఞానముతో అడ్డదారిలో ఇతరుల అకౌంట్ లో నుండి మాయం చేశాడని అనిరుద్ వ్యక్తి పై ఆరోపణలు ఉన్నాయన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ వ్యక్తి ఇంటికి వెళ్లిన పోలీసులు తండ్రి పూర్తిస్థాయిలో సహకరించకపోతే కుటుంబమంతా ఇబ్బందులు పడతారని పోలీసులు వారిని హెచ్చరించారు.

# ఆగస్టు 3న అంబేద్కర్ విగ్రహావిష్కరణ

- పోస్టర్ విడుదల చేసిన స్పీకర్
- విగ్రహ ఆవిష్కరణ కోసం ఏర్పాట్లు పూర్తి
- అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృధ్వీరాజ్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూలై 25 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని పట్లూరు గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు అన్ని పూర్తయినట్లు అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృధ్వీరాజ్ తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ పోస్టర్‌ను మర్పల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్రంలోనే మూడవ అతిపెద్ద అంబేద్కర్ విగ్రహంగా పేర్కొంటున్న విగ్రహాన్ని యువజన సంఘం అందంగా ముస్తాబ్ చేస్తుంది. ఈ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కోసం తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతితో పాటు అనేకమంది మంత్రులు ఎమ్మెల్యేలు యువజన సంఘం నాయకులు రాజకీయవేతలు హాజరుకానున్నారు. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కోసం పట్లూరు యువజన సంఘం నాయకులు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేస్తున్నారు. ఆవిష్కరణ సందర్భంగా భారీ ఏర్పాట్లను చేస్తున్నారు. ఊరూరా అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ పోస్టర్ ను విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్ గ్రంధాలయ మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు రమేష్ ప్రభాకర్ రాకేష్ రాచన్న రాజు అశోక్ రెడ్డి నందు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నిమ్జ్ భూ సేకరణ వేగవంతం చేయాలి

- నిమ్జ్‌లో మౌలిక వసతుల పరిశీలన
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**ఝరాసంగం, జూలై 25 (జనం సాక్షి) :** జహీరాబాద్‌లో ఏర్పాటవుతున్న నిమ్జ్ (నిమ్జ్)కి సంబంధించి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఝరాసంగం మండలం చిలపల్లి తండాలోని నిమ్జ్ భూములను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, అదనపు కలెక్టర్ మాధురి,నిమ్జ్ అధికారులతో కలిసి పరిశీలించారు. నిమ్జ్ భూముల మ్యాప్‌ను పరిశీలిస్తు, ఇప్పటివరకు సేకరించిన భూముల వివరాలను పరిశీలిస్తూ ఇంకా సేకరించవలసిన భూములను వేగవంతంగా సేకరించాలని అధికారులను ఆదేశించారు . ఈ సందర్భంగా నిమ్జ్ లో ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం నిమ్జ్ ప్రత్యేక అధికారి, ఆర్డీవో రామిరెడ్డి, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ... నిమ్జ్ ప్రాజెక్టు అవసరమైన భూమి సేకరించాల్సి ఉందని దాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఫేస్ వన్ లో మొత్తం 3,240 ఎకరాల భూమి అవసరం కాగా, ఇప్పటివరకు 2,888 ఎకరాల భూమి మాత్రమే స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన భూసేకరణ ఇంకా పూర్తికాలేదని, సంబంధిత గ్రామాల రైతులు, భూమి యజమానులతో చర్చించి వీలైనంత త్వరగా భూ సేకరణ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు భూముల కోల్పోతున్న రైతుల సమస్యలను పరిష్కరించి భూసేకరణను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు.నిమ్జ్ ద్వారా పరిశ్రమలు, ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు. భూముల సేకరణ విషయంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిమ్జ్ ఏర్పాటు అయ్యే ప్రాంతాన్ని కలియ తిరుగుతూ అధికారులకు పలు సూచనలు చేశారు.నిమ్జ్ లో మౌలిక వసతుల ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఏ ప్రాంతాల్లో ఇంకా భూసేకరణ జరపాల్సి ఉందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని సూచించారు.నిమ్జ్ ఏర్పాటు వల్ల ఈ ప్రాంతానికి కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని అనంతరం భూసేకరణ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా
- ప్రభుత్వసుపత్రి చుట్టూ పరిశుభ్రంగా ఉండాలని ఆదేశాలు..



**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, జూలై 25 (జనంసాక్షి) :** ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని శానిటేషన్ చేపట్టాలని రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ కమ్యూనిటి ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు ఆస్పత్రికి సరిపడా వైద్య సిబ్బంది ఉన్నారా లేదా అని అక్కడి మెడికల్ ఆఫీసర్ ను అడిగారు సిబ్బంది అవసరమైతే తనకు తెలియజేయాలన్నారు హాజరు పట్టిక ప్రకారం వైద్యాధికారి సిబ్బంది విధుల్లో ఉన్నారా లేదా అని పరిశీలించారు సిహెచ్ సీ ద్వారా అందిస్తున్న వైద్య సేవల గురించి మెడికల్ ఆఫీసర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల ఔషధాలు సరిపడా అందుబాటులో ఉండాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆసుపత్రికి రోజు ఎంతమంది అవుట్ పేషంట్, ఇన్ పేషెంట్లు వస్తుంటారని డాక్టర్ ను ప్రశ్నించారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను సందర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు ఆస్పత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండకుండ వారం రోజుల్లో చర్యలు తీసుకొని శుభ్రంగా ఉంచాలని తెలిపారు. కమ్యూనిటి హెల్త్ సెంటర్లో డయాలసిస్ పేషంట్లకు అవసరమైన నీరు అందించుటకు ఇబ్బందిగా ఉందని కలెక్టర్ దృష్టికి మెడికల్ ఆఫీసర్ తీసుకొని వచ్చారు అందుకు కలెక్టర్ స్పందిస్తూ వారం రోజుల్లో నీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు ప్రభుత్వం వైద్యం విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టినందున ప్రభుత్వ అంచనాలకు తగిన విధంగా ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ సీ వైద్యాధికారి దుర్గలత శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కల్లు దుకాణాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు దారుణం

- గౌడన్నలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- రూ.12 కోట్ల 94 లక్షలు వెంటనే విడుదల చేయాలి
- ఆగస్టు 2 నుండి 18 వరకు అమరవీరులు సామాజిక చైతన్య యాత్ర
- రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి రమణ

**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 25 (జనం సాక్షి) :** కల్లు దుకాణాలపై శాంపిల్స్ పేరుతో ఎక్సైజ్ అధికారల దాడులు చేయడం దారుణమని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణ మండిపడ్డారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి సుందరయ్య భవనంలో కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు ఎం వి రమణ హాజరై మాట్లాడారు... రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో కళ్ళు దుకాణాలపై శాంపిల్ల పేరుతో విచ్చలవిడిగా దాడులు చేస్తూ కళ్ళుగీత కార్మికులను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. వెంటనే దాడులు ఆపాలని సంబంధిత అధికారులను ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్న గీత కార్మికులకు గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని వెంటనే హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



**సామాజిక చైతన్య యాత్ర...**

ఆగస్టు 2 నుండి 18 వరకు అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన వారిని గుర్తు చేసుకుంటూ గౌడ, గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లాలో సామాజిక చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆగస్టు 2 న బొల్లగాని పుల్లయ్య వర్ధంతి రోజు ప్రారంభమ సర్దార్ సర్వాయి పాపన్న జయంతి రోజు 18 న సంగారెడ్డిలో ఈ యాత్ర ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని గౌడ, కల్లుగీత కార్మికులు శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి సంపద ఒక కోటి తాటి ఈత చెట్లు ఉన్నాయని, కల్లు తో పాటు నీరా, తాటి ఈత ఉత్పత్తులు తయారుచేసి ఉపాధి కల్పించే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వము ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు పెన్షన్ రూ. 4 వేలకు, ఎక్స్ గ్రేషియా రూ. 10 లక్షల కు పెంపు, సొసైటీ కి 5 ఎకరాల భూమి, నీరా తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమ అభివృద్ధి, ట్యాంక్ బండ్ పై పాపన్న విగ్రహం ఏర్పాటు, జనగామ జిల్లాకు పాపన్న పేరు పెడతామని ఇచ్చిన తదితర హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు వృత్తి చేసే గీత కార్మికులందరికీ సేఫ్టీ కిట్టు ఇవ్వాలని, పెండింగ్ ఎక్స్ గ్రేషియా డబ్బులు రూ.12 కోట్ల 94 లక్షలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలోని నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమ ప్రారంభించాలని, హైదరాబాదులోని నీరా కేఫ్ ను టెండర్ వేసి వచ్చిన ఆదాయంతో గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలని అన్నారు. ఈ యాత్రల సందర్భంగా ప్రమాద నివారణకు తీసుకోవలసిన చర్యలు, కాటమయ్య రక్షణ కవచం ప్రాధాన్యత, ఆరోగ్య సంరక్షణ , స్ఫూర్తిదాతల జీవిత విశేషాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రమేష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు అంజా గౌడ్, కార్యదర్శి ప్రసాద్ గౌడ్, కమిటీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, కృష్ణ గౌడ్, రామా గౌడ్, రవి గౌడ్, నరసింహా గౌడ్, భూమా గౌడ్, రామచంద్ర గౌడ్, యాద గౌడ్ రాజు గౌడ్, ఎల్లా గౌడ్, శేఖర్ గౌడ్, మల్లేశం గౌడ్, వెంకటేష్ గౌడ్ , ఎల్లేష్ గౌడ్, కనకరాజు కనకరాజు గౌడ్ పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



**నారాయణఖేడ్, జూలై 25 (జనం సాక్షి) :** లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ లక్ష్యం అని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం నాగల్ గిద్ద మండలంలో 371 లబ్ధిదారులకు మంజూరైన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. మండలంలోని ఎస్గి గ్రామంలో గ్రామ స్వరాజ్యం సంస్థ ద్వారా కుట్టు మిషన్ కేంద్రాన్ని గ్రామంలో ప్రారంభించారు. ఇందిరమ్మ ఇండ్లు బిస్మిట్ నిర్మించుకున్న వారికి చెక్కులు అందజేశారు.అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ఆర్గారంటీలను తూచా తప్పకుండా అమలుచేయడం జరుగుతుందని మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల విద్యుత్ ఫ్రీ, 500 రూపాయలకే వంట గ్యాస్, రైతులకు 500 బోనస్, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 10 లక్షల వైద్య సేవలు, డ్వాక్రా గ్రూప్ మహిళలకు పావుల వడ్డీ రుణాలు, రైతు బంధు, రైతు బీమా, మహిళ గ్రూపులకు సోలార్ ప్లాట్లు, 60 వేల ఉద్యోగాలు, పేదల వైద్య సేవల కోసం ముఖ్యమంత్రి నిధి సహకారం, ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఉన్నవారికి కట్టుకోవడానికి 5 లక్షలు, వంటి సంక్షేమ పథకాలను అందజేయడం జరుగుతుందని గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని, వారు మాటల గారితో ప్రజలను మోసం చేశారని అన్నారు. గతంలో నాగల్ గిద్ద, మనూర్ మండలాలలో ఇల్లు లేని పేదల కోసం మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఆయములో ఇండ్లు, రేషన్ కార్డు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రహీం, మాజీ సర్పంచ్లు విఠల్ రావు పటేల్, అనిల్ పటేల్, మనోహర్ పటేల్, నారాయణ జాదవ్, పిఎసిఎస్ వై చైర్మన్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హాఫ్ మారథాన్ నిర్వహించడం గొప్ప విషయం

- హాఫ్ మారథాన్ టీ షర్ట్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏసీపీ రవీందర్ రెడ్డి

**సిద్దిపేట బ్యూరో, జూలై 25 (జనం సాక్షి) :** సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే హాఫ్ మారథాన్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ఆదివారం నిర్వహించనున్న హాఫ్ మారథాన్ టీ షర్ట్ లను సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, జిల్లా జర్నలిస్ట్ సంఘం అధ్యక్షుడు రంగాచారితో కలిసి ఏసీపీ రవీందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో తాను కూడా రన్నింగ్, కబడ్డీ పోటీల్లో పాల్గొని ఛాంపియన్ గా నిలిచానన్నారు. సిద్దిపేటలో హాఫ్ మారథాన్ నిర్వహించడం గొప్ప విషయమని ప్రతిరోజు రన్నింగ్, వాకింగ్ చేయడం అనేది చాలా అవసరం అన్నారు. శారీరకంగా, మానసికంగా బలంగా లేకపోవడం వల్లఆత్మహత్యలు పెరుగుతున్నాయని తెలిపారు. ఇలాంటి రన్నింగ్ రేసులు సమాజానికి ఎంత ఉపయోగపడతాయన్నారుశారీరక వ్యాయమం చేయకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తున్నాయని ఏసీపీ తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షుడు రంగాచారి మాట్లాడుతూ తమ సంపూర్ణ సహకారం ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఈ హాఫ్ మారథాన్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. ఆరోగ్య సిద్దిపేట గా మార్చాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం హాఫ్ మారథాన్ నిర్వహిస్తున్నామని, యువకులు డ్రగ్స్ గంజాయి లాంటి మత్తు




పదార్థాలకు అలవాటు కాకుండా బెట్టింగ్ యాప్ లకు దూరంగా ఉండే విధంగా అనేక అవగాహన రన్నింగ్ కార్యక్రమాలు నిర్వహించమని అన్నారు మా పోరాటం డ్రగ్స్ బెట్టింగ్ యాప్స్ పైన నిరంతరం ఉంటుందని తెలిపారు. యువకులు ఏదో ఒక వ్యాయామం వ్యాపకంగా గా అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ రన్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ కౌన్సిలర్ బ్రహ్మం, సీనియర్ జర్నలిస్ట్ లు సంజీవరెడ్డి, పాండు, బబ్బూరి రాజు, రంగధాంపల్లి శ్రీను, రమణారావు, ఎన్.రాజు, రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు నిమ్మ కృష్ణారెడ్డి,రమేష్, అశోక్, రాజిరెడ్డి హరికృష్ణ, గోపాల్ శ్రావణ్ లింగారెడ్డి వీరన్న పాల్గొన్నారు.

# చేర్యాల బంద్‌తోనైనా ముఖ్యమంత్రి స్పందించాలి

- జేఏసీ చైర్మన్ డాక్టర్ ఆర్. పరమేశ్వర్
- చేర్యాల బంద్ సక్సస్ ప్రజలకు జేఏసీ కృతజ్ఞతలు
- రెండు నెలల ఉద్యమ కార్యాచరణ ప్రకటించిన జేఏసీ

**చేర్యాల, జూలై 25 (జనంసాక్షి) :** చేర్యాల ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేర్చడం కోసం జేఏసీ నిర్వహించిన బందుతోనైనా ప్రజల ఆకాంక్ష ఎంత బలంగా ఉందో ప్రభుత్వానికి తెలిసి రావాలని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ అన్నారు. శుక్రవారం జేఏసీ తలపెట్టిన బంద్ తో పట్టణంలో వ్యాపార వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బందు పాటించాయి. చేర్యాల,మద్దూరు,కొమురవెల్లి, ధూళ్మిట్ట మండల మండల కేంద్రాలతో పాటు మేజర్ గ్రామపంచాయతీలు సైతం ఉదయం నుండే జేఏసీ నాయకులు రోడ్డుపైకి వచ్చి పాదయాత్ర బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ పరమేశ్వర్ మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో నాటి పీసీసీ అధ్యక్షులు నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటిస్తామని హామీ ఇచ్చిన సందర్భంలో 18 నెలల కాలంలో వారి హామీని నెరవేర్చకపోవడం ఈప్రాంత ప్రజల దురదృష్టకరమన్నారు. ప్రజలు, వ్యాపార వాణిజ్య వర్గాలే నాయకులై స్వచ్ఛందంగా బందు చేశారని, ఇందుకు నిదర్శనమే రెవెన్యూ డివిజన్ ఆకాంక్ష ప్రజల్లో ఎంత ప్రభలంగా ఉందో అర్థమవుతుందన్నారు. ఇది ఒక భౌతిక అంశం మాత్రమే కాకుండా ఈప్రాంత ప్రజల ఆకాంక్ష అస్తిత్వం, ఉనికి ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్నదని ఈ బందు ద్వారా ప్రజల ఆకాంక్షను వెలిబుచ్చారు. ఇదే స్ఫూర్తితో రెవెన్యూ డివిజన్ సాధించేవరకు పోరాటం



కొనసాగిస్తామని తెలియజేశారు. వ్యాపార వాణిజ్య వర్గాలు ఇచ్చినటువంటి స్ఫూర్తితో ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తున్నామన్నారు. త్వరలో విద్యాసంస్థల బంద్, రహదారి దిగ్బంధం, చలో కలెక్టరేట్, వంటావార్పు తదితర అంశాలపై తేదీలను ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అందె అశోక్, అందె బీరయ్య, బుట్టి సత్యనారాయణ, పిల్లి చంద్రం, పోలోజు వెంకటాద్రి, ఎక్కలదేవి సుధాకర్, ఈరి భూమయ్య, సుతారి రమేష్, కత్తుల భాస్కర్ రెడ్డి, పొన్నబోయిన మమత, సనవాల ప్రసాద్, పోషబోయిన పరమశేఖర్, భూమిగారి మధూకర్, పుల్ల ఆంజనేయులు, నంగి కనకయ్య, పోనుగోటి శ్రీనివాస్ రెడ్డి, అరుట్ల లింగం, కడుదూరి పుల్లారెడ్డి, పొన్నబోయిన శ్రీనివాస్, కర్రె నర్సిరెడ్డి, భూర సీతారాముల, పుల్ల కుమార్, ముద్దల్ల యాదయ్య, కత్తుల లక్ష్మరెడ్డి, బింగి పోశయ్య, మురళి, మహేందర్, రాజు,తదితరులు పాల్గొన్నారు.

# భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెక్కుల అందజేత

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 25 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలోని రైతులకు సాగు నీరందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ నారాయణపేట నియోజకవర్గ ఇంచార్జీ కుంభం శివకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోయిన 36 మంది రైతులకు నష్ట పరిహారం చెక్కులను స్థానిక ఆర్డీఓ రామచంద్రనాయక్ కలిసి అందజేశారు. ఈ సందర్భంగా శివ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు దేశంలో ఎక్కడా ఇంత తక్కువ సమయంలో నష్టపరిహారం అందించలేదని, కానీ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నారాయణపేట -కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులకు ఇస్తున్న పరిహారాన్ని ఇంకా కొంత పెంచి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్న విస్తానని, సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిహారం పెంచేందుకు ప్రయత్నం చేస్తానని ఆయన చెప్పారు.నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని పథకం పూర్తి చేయడానికి అందరూ సహకరించాలని ముఖ్యంగా భూములు కోల్పోయే రైతులు ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు.ఆర్డీఓ రామచంద్రనాయక్ మాట్లాడుతూ... నారాయణ పేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు, ఇతర ఆస్తులు కోల్పోయిన ప్రతి ఒక్కరికి నష్టపరిహారం అందిస్తామని ఎవరు ఆందోళన చెందవద్దని సూచించారు.భూములు అందించిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా శుక్రవారం భూములు కోల్పోయిన దామరగిద్ద మండలం బాపన్ పల్లి



గ్రామానికి చెందిన 21 మంది రైతులకు 59.99 లక్షల రూపాయల నష్టపరిహారం చెక్కులను, అలాగే నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామానికి చెందిన 15 మంది రైతులకు రూ.52.15 లక్షల చెక్కులను శివకుమార్ రెడ్డి, ఆర్డీఓ అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, ఆర్డీఓ కార్యాలయ ఏ.వో. అనిల్ కుమార్, తహసిల్దార్లు తిరుపతయ్య, వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్, డీటీ బాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# యువత ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉండాలి

- నేటి డిజిటల్ యుగంలో యువత నైపుణ్యతను అధిగమించాలి
- ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి

**నాగర్‌కర్నూల్ ఆర్సీ, జూలై 25 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుభం డిజిటల్ ఈ - సేవ మరియు సి ఎస్ సి కామన్ సర్వీసెస్ సెంటర్ ను ప్రారంభోత్సవంలో పాల్గొన్ని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, యువతను నైపుణ్యాలను ఉద్దేశించి ప్రసంగించారు. నేటి సమాజానికి యువ వికాసమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ఉద్యోగమే ఆధారం కాదు నైపుణ్యత కలిగి ఉంటే ఏ రంగంలో అయినా రాణించవచ్చు. నేటి డిజిటల్ యుగంలో ఏఐ చార్జి జిపిటి లాంటి క్రియేటివిటీ సాధారణ మానవుడి క్రియేటివిటీ తప్ప మరొకటి కాదు ఇలాంటి క్రియేటివిటీ ప్రపంచ అభివృద్ధిలో భాగంగా దేశ నవ నిర్మాణమే లక్ష్యంగా నేటి యువత నిరంతరంగా అన్వేషణలు జరగాలని అందుకు ప్రభుత్వ ప్రోత్సహం అనునిత్యం అండగా తోడుగా ఉంటుందని అన్నారు. ఉద్యోగ సాధనలో భాగంగా తమ తమ నైపుణ్యాలను మెరుగుపరచుకుంటూ నవ సమాజానికి మేల్కొల్పిన వారు అవుతారని తదనుగుణంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఒక నూతన ఉత్తేజంతో వరవడి సృష్టిస్తూ డిజిటలైజేషన్ ఆన్లైన్ సర్వీస్ ప్రతి ఒక్కరికి అందుబాటులోకి తీసుకు వస్తున్న యువతని నేటి



సమాజం కూడా ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా మార్కెట్ చైర్మన్ రమణ రావు, స్థానిక మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జక్క రాజు, కావలి శ్రీనివాసులు, తెలకపల్లి మండల మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాలె శ్రీను, సింహయ్య, సుల్తాన్, కామన్ సర్వీస్ సెంటర్ జిల్లా మేనేజర్ శివ, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నాగర్ కర్నూల్ మండల అధ్యక్షులు హరికృష్ణ ముదిరాజ్, అశోక్, వినయ్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల కోసం రైతుల ఎదురుచూపులు

- అధికారుల రాక కోసం పంపిణీ కేంద్రం వద్ద పడిగాపులు



**న్యాల్‌కల్, జూలై 25 (జనం సాక్షి) :** మండలంలో గత కొన్ని రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో రైతులు వివిధ రకాల ఎరువులను పంట పొలాల్లో వేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. రైతులకు అవసరం మేరకు ఎరువులను అందజేసేందుకు ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు సహకార సంఘాలు, డీసీఎంఎస్, ఆగ్రోస్ కేంద్రాల ద్వారా ఎరువులను అందజేసేందుకు చర్యలు చేపట్టింది. ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడకుండా దృష్టి సారించింది. ఈ మేరకు మండలంలోని హద్దునూర్ సహకార సంఘం కార్యాలయం వద్ద సంఘం పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఎరువులను కొనుగోలు చేసేందుకు శుక్రవారం తెల్లవారు జామునే పంపిణీ కేంద్రానికి తరలివచ్చారు. అధికారుల రాక కోసం రైతులు ఎదురు చూశారు. ఉదయం 11 గంటలైన పంపిణీ కేంద్రానికి అధికారులు సకాలంలో రాకపోవడంతో రైతులు సహకార సంఘం కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు. అనంతరం సహకార సంఘం అధికారులు రైతులకు రూ:275 / 280 చొప్పున ఎకరానికి రెండు యూరియా బస్తాలను అందజేశారు. ఐతే స్థానిక సహకార సంఘం పరిధిలోని పలువురు అధిక భూములు ఉన్న రైతులు, భూస్వాములు, రాజకీయ పలుకుబడి ఉన్న నేతలు పెద్ద మొత్తంలో యూరియా బస్తాలను కొనుగోలు చేసి కర్ణాటక ప్రాంత రైతాంగానికి ఒక యూరియా బస్తాకు రూ:330 - 340 చొప్పున విక్రయిస్తున్నట్లు పలువురు చిన్న, సన్న కారు రైతులు బహిరంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు రైతులు స్పష్టం చేస్తున్నారు.

# ఆగస్టు 15లోపు ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

- లేనిచో పీఆర్టీయూ ఆధ్వర్యంలో మహా ధర్నా
- పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్ శర్మ

**సిద్దిపేట, జూలై 25 (జనం సాక్షి) :** ఆగస్టు 15వ తేదీ లోపు ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని లేనిచో పీఆర్టీయూ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తామని పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి అదరాసుపల్లి శశిధర శర్మ తెలిపారు. శుక్రవారం పీఆర్టీయూ బెజ్జంకి మండల శాఖ అధ్యక్షుడు ఎడబోయిన మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి రేకులపల్లి నరసింహారెడ్డిల ఆధ్వర్యంలో బెజ్జంకి మండలంలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. సందర్భంగా పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి అదరాసుపల్లి శశిధర శర్మ మాట్లాడుతూ ఆగస్టు 15 లోపు అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే పీఆర్టీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని అన్నారు. సీ పీ ఎస్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు ఒకటవ తేదీన పదివేల మందితో ఇందిరాపార్క్ వద్ద ఉద్యమిస్తామని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి ప్రకటించారని చెప్పారు. ఉపాధ్యాయులు




సెప్టెంబర్ 1న హైదరాబాద్ కదలాలని కోరారు. ఉపాధ్యాయుల జీ పీ ఎఫ్, సరెండర్ బిల్లులు రెండు సంవత్సరాలు గడుస్తున్నా పెండింగ్ లో పెట్టడం శోచనీయమన్నారు. ఆగస్ట్ 15 లోపు పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయకుంటే జిల్లా కేంద్రాలలో పెద్ద ఎత్తున మెరుపు ధర్నాలకు రాష్ట్ర శాఖ పిలుపు ఇవ్వబోతుందన్నారు. అనారోగ్య కారణాలతో ఆసుపత్రికి వెళ్ళిన ఉపాధ్యాయుల వైద్య బిల్లులు తడిసి మోపెడవుతున్నాయని చెప్పారు. మెడికల్ బిల్లులు చెల్లించలేక ఉపాధ్యాయుల కుటుంబాలు ఆర్థికంగా బలహీన పడుతున్నాయని వాపోయారు. బేషరతుగా అన్ని కార్పొరేట్ హాస్పిటల్లో వర్తించే విధంగా హెల్త్ కార్డులు మంజూరు చేయాలని శశిధర్ శర్మ డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 కింద వేతనాలు చెల్లిస్తూ పదోన్నతులు కల్పించాలని కోరారు. అన్ని గురుకులాల టైం టేబుల్ మార్చాలని. పెండింగులో ఉన్న అన్ని డీఏలను విడుదల చేసి, పీ ఆర్ సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలకు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పోస్ట్ మంజూరు చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ బెజ్జంకి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడబోయిన మల్లారెడ్డి, రేకులపల్లి నరసింహారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు మాలతి ప్రవీణ్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్, జిల్లా కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.

# వైద్యసేవలో ఎంసిహెచ్ తీరు బాగుంది

- సీజనల్ వ్యాధులు రాకుండా అవగాహన కల్పించాలి
- వైద్యులు అందుబాటులో ఉండాలి
- సరిపడా మందుల నిల్వలు ఉండాలి
- తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ప్రాజెక్టు డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి



**జనగామ ప్రతినిధి, జూలై 25 (జనంసాక్షి) :** తెలంగాణా ముఖ్య మంత్రి వర్యుల ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధుల నియంత్రణ,పర్యవేక్షణ ప్రత్యేక అధికారి గా నియమాకం అయిన (ఉమ్మడి వరంగల్ జిల్లాలకు) తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీజనల్ వ్యాధుల నియంత్రణ పర్యవేక్షణ ప్రత్యేక అధికారి (ఉమ్మడి వరంగల్ జిల్లాలకు) తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ప్రాజెక్టు డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రం లో సీజనల్ వ్యాధులను నియంత్రించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు, సెక్రటరీలు ప్రత్యేక అధికారులను నియమించిన సందర్భంగా శుక్రవారం ప్రత్యేక అధికారి చంపక్ హిల్స్ లోని మాత శిశు ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఎంసిహెచ్ లో అందుతున్న వైద్యాన్ని, వివిధ విభాగల సేవలను ప్రత్యేక అధికారికి తెలిపారు. ముందుగా ఓపి, చిన్న పిల్లల వార్డ్ లను పరిశీలించి.. ఎంత మంది చిన్నారులు వైద్యం పొందుతున్నారు, ఏ ఏ సమస్యలతో ఇక్కడికి వచ్చారు అని డాక్టర్ లను అలాగే ఏ సమస్య తో ఇక్కడికి వచ్చారు?ఎక్కడి నుండి వచ్చారు? ఎన్ని రోజుల నుండి వైద్యం తీసుకుంటున్నారు? టైమ్‌కు మందులు ఇస్తున్నారా? డాక్టర్‌లు అందుబాటులో ఉంటున్నారా? అని పెషేంట్ లను అడిగారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పెషేంట్ తల్లిదండ్రులు మాట్లాడుతూ... జ్వరం రావడంతో తమ పిల్లలను ఇక్కడకు తీసుకొచ్చుమని.. అడ్మిట్ అయిన నాటి నుండి నేటి వరకు మంచి వైద్యం అందడంతో తమ పిల్లలు బాగా కవర్ అయ్యారాని.. టైం కి ముందులు, భోజనం ఇస్తున్నారని ప్రత్యేక అధికారికి, కలెక్టర్ కి వివరిస్తూ సంతృప్తి వ్యక్తం చేసారు. అనంతరం ఎంసిహెచ్ కి సంబందించిన వివిధ విభాగల వైద్యులతో, సిబ్బంది తో ప్రత్యేక అధికారి, కలెక్టర్ రివ్యూ తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం గా ఉండటమే కాకుండా అవగాహన కలిగి ఉండటం కూడా ప్రాధాన్యం అన్నారు. మాత శిశు ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందుతున్న తీరు బాగుందని, ఆస్పత్రి అంతా శానిటేషన్ నిర్వహణ చక్కగా ఉందన్నారు. నీరు శుభ్రంగా ఉంటే ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఎక్కువ శాతం అరికట్టవచ్చని తెలిపారు. పారిశుద్ధ్యం విషయంలో అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా చూడాలని... దోమల వ్యాప్తి ని అరికట్టాలన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టడం లో భాగంగా ప్రతీ గ్రామం లో ప్రజలకు పరిసరాలు అలాగే వ్యక్తి గత శుభ్రత ప్రాధాన్యత పైన అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు క్షేత్ర స్థాయి నుండి వివిధ శాఖల అధికారులు బాగా పని చేస్తున్నారన్నారు. తప్పనిసరిగా ప్రతీ ఇంట్లో ఫీవర్ సర్వే నిర్వహించాలని ఆదేశించామన్నారు. స్పెషల్ ఆఫీసర్స్ ని నియమించి.. పర్యవేక్షణ చేపిస్తున్నామన్నారు. మున్సిపల్, పంచాయతీ , వైద్య ఆరోగ్య శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు రివ్యూలు చేయడమే కాకుండా నిరంతరం సీజనల్ వ్యాధులు ప్రబలకుండ క్షేత్ర స్థాయి సందర్శనలు చేసేలా తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నియంత్రించేందుకు... గ్రామాలలో రెగ్యులర్‌గా ఫాగింగ్ నిర్వహిస్తున్నట్లు, గ్రామాలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. దోమల వ్యాప్తిని నివారించేందుకు , మురికి గుంటల్లో ఆయిల్స్ బాల్స్ వేస్తూ... గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారన్నారు. టీబి ముక్త భారత్ అభియాన్ క్రింద ప్రతీ ఇంటికి వెళ్లి స్క్రినింగ్ చేస్తున్నారని, ఇప్పటి వరకు 40 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అందులో 54,148 మందికి స్క్రీనింగ్ నిర్వహించారు. 3469 ఎక్స్‌రే లు, తెమడ పరీక్షలు 498, టీబీ పరీక్షలు 677 మందికి చేయడం జరిగిందన్నారు. అలాగ పక్కాగా... పక్కాగా ఫీవర్ సర్వే కూడా జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ కె.మల్లిఖార్జున రావు డైఎం హెచ్ ఓ, డా నాగమణి ప్రిన్సిపల్ జిఎంసి, డా రాజలింగం మెడికల్ సూపరింటెండెంట్, ప్రోగ్రాము ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నివారణకు చర్యలు చేపట్టాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, జూలై 25 (జనంసాక్షి):** మత్తు పదార్థాలను నివారించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణిలతో కలిసి జిల్లాస్థాయి నార్కోటిక్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నియంత్రణ, నషాముక్త భారత్ లో భాగంగా చేపడుతున్న చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. విద్యార్థులకు అవగాహన కల్పించాలని ముఖ్యంగా యువతలో చైతన్యం తేవాలన్నారు. డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని , కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులు గంజాయి వినియోగించకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. ఈ సమీక్షలో జెడ్పి సీఈవో రామిరెడ్డి,డిఇఓ జ్ఞానేశ్వర్, డి డబ్ల్యు ఓ రాజమణి, డిఎం హెచ్ ఓ సాంబశివరావు పోలీసు, నార్కోటిక్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచర్ అరెస్ట్



**పర్వతగిరి, జులై 25 (జనం సాక్షి):** ఈ నెల 7 వ తేదీన పర్వతగిరి మండలం చింత నెక్కొండ గ్రామ శివారులో డ్రాగన్ ఫ్రూట్స్ అమ్ముతున్న మహిళ మెడలో నుంచి ఇద్దరు వ్యక్తులు టూవీలర్ మీద వచ్చి పుస్తె ల తాడు అపహరించారు. కేసు నమోదు చేసిన పర్వతగిరి ఎస్సై ప్రవీణ్ మరియు పర్వతగిరి సీఐ బి రాజగోపాల్ విచారణ జరపి నెల్లికుదురు మండలం ఔసలితండాకు చెందిన మౌర్య నరేష్‌ను సమాచారం మేరకు అదుపులోకి తీసుకొని విచారించగా జల్సాలకు అలవాటు పడి చైన్ స్నాచింగ్ చేశానని నేరాన్ని ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు.అతని వద్ద నుండి 34 గ్రాముల పుస్తెలతాడు, దొంగతనానికి వాడిన బైక్, ఒక సెల్ ఫోన్ రికవరీ చేయడం జరిగిందని ఇంకొక నిందితుడు మౌర్య హేమంత్ కేసముద్రం పోలీస్ స్టేషన్లో వేరొక చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడుగా ఉండి ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నాడని,మౌర్య నరేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సిఐ రాజగోపాల్ అన్నారు.

## జనగామకు బతుకమ్మ కుంట స్పెషల్ అట్రాక్షన్

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
- తుది దశకు చేరుకున్న బతుకమ్మ కుంట అభివృద్ధి పనులు



**జనగామ ప్రతినిధి, జూలై25(జనంసాక్షి):** జనగామ పట్టణం కి స్పెషల్ అట్రాక్షన్ గా ఉండే బతుకమ్మ కుంట అభివృద్ధి పనులు పూర్తి కావచ్చాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. పట్టణంలోని బతుకమ్మ కుంటను అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి, తుది దశ కి చేరుకున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్‌లి మాట్లాడుతూ రూ. కోటి 50 లక్షలతో బతుకమ్మ కుంట అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని, ఈ మేరకు బతుకమ్మ కుంట ను పంచతంత్ర థీమ్ తో అభివృద్ధి చేస్తున్నామన్నారు. సుందరీకరణ నేపథ్యంలో గ్రిల్స్, గజిబోలు, వ్యాయామ పరికరాలు, చిన్నారుల ఆటస్థలం, ఆడుకునేందుకు పరికరాలు, చిన్న పార్కు ఏర్పాటుకు ప్రారంభించిన పనులనుసివిల్ వర్క్స్ వారం లోగ పూర్తి చేసి ,15 రోజుల్లోగా బతుకమ్మ కుంట ప్రారంభించేలా పనులు జరగాలన్నారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేయనున్న అట వస్తువుల పరికరాల నాణ్యత ను కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటి వరకు చెరువు పూడికతీత పనులు,వాకింగ్ ఏరియా, లైటింగ్, రైలింగ్,ఫెన్సింగ్,ఒక వాటర్ ట్యాంక్ పనులు అయిపోయాయని మిగతా పనులు కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. త్వరగా అభివృద్ధి పనులను పూర్తి చేసి.. పట్టణ వాసులకు బతుకమ్మ కుంట ని వాడుకలోకి తీసుక రావాలన్నారు. ఈ కార్యక్రమం లో కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు,డి ఈ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ నిమిత్తం 205 కోట్లు విడుదల

- సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ కడియం కావ్య
- వరంగల్ ప్రజల దశాబ్దాల కలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం



**స్టేషన్ ఘన్పూర్, జూలై 25 ( జనం సాక్షి ) :** వరంగల్ నగర అభివృద్ధికి దోహదపడే మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ముందడుగు వేసిందని వరంగల్ పార్లమెంట్ సభ్యురా లు డాక్టర్ కడియం కావ్య అన్నారు. భూసేకరణ నిమి త్తం 205 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేయడంపై ఎంపీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ విమానాశ్రయ ఏర్పాటుకు సాంకేతిక అడ్డంకిగా ఉన్న 150 కిలోమీటర్ల పరిమితిపై ఇప్పటికే కేంద్రం నుంచి అనుమతి పొందిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు నిధులు విడుదల చేయడం ద్వారా తన నిబద్ధతను మరోసారి చాటు కుందని పేర్కొ న్నారు. ఎంతో గొప్ప చారిత్రక ప్రాధాన్యం కలిగిన వరంగల్ నగర అభివృద్ధిలో ఇది ఒక కీలక మైలురాయి అ న్నారు. వరంగల్ ప్రజలు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఆకాంక్షల కు ఈ నిర్ణ యం ఒక ప్రత్యక్ష సాక్ష్యం అన్నారు. ఇప్పుడు కేంద్ర విమానయాన శాఖ కూడా రాష్ట్ర ప్రభుత్వ చొరవను దృష్టిలో ఉంచుకొని ఎయిర్పోర్ట్ నిర్మాణ విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ప్రజల తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఫిట్స్‌తో ట్రాక్టర్ డ్రైవర్ మృతి



**మంగపేట జూలై25 (జనంసాక్షి) :** పంట పొలంలో ట్రాక్టర్ తో దమ్ము చేస్తున్న సమయంలో ఒక్కసారిగా ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ కు మూర్చ(ఫిట్స్) రావడంతో అదుపుతప్పి ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని బుక్షంపేట గ్రామంలో చోటుచేసుకుంది. ప్రత్యేక సాక్షుల వివరాల ప్రకారం ట్రాక్టర్ డ్రైవర్ దిగొండ శేషు (26) సోమలకుంట చెరువు ప్రాంతంలో ఉదయం 10.45 గంటల సమయంలో రాచకొండ మల్లయ్య వరి పొలంలో నాటు వేసేందుకు శేషు దమ్ము చేస్తుండగా ఒక్కసారిగా మూర్ఛ (ఫీట్స్) రావడంతో ట్రాక్టర్ పై నుండి అదుపుతప్పి ట్రాక్టర్ దమ్ము చక్రాల క్రింద పడడంతో నీటిలో మునిగి ఊపిరాడక మృతిచెందినట్లు వారు తెలిపారు. శేషు తండ్రి యాకాంతం గత ఐదుల క్రితం మరణించడంతో తల్లి లక్ష్మి తో కలిసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన కొడుకు మృత్యువాత పడడంతో తల్లి కన్నీరుమున్నీరు అయింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై టివిఆర్ సూరి సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా పూర్తి చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు వారు తెలిపారు.

## దివ్యాంగుల్లో అద్భుతమైన నైపుణ్యాలుంటాయి..

- అవకాశాలు కల్పిస్తే ప్రతిభకు వైకల్యం అడ్డురాదు..
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** దివ్యాంగుల్లో అద్భుతమైన ప్రతిభ, నైపుణ్యాలు ఉంటాయని, అవకాశాలు కల్పిస్తే ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని నిరూపిస్తారని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖకు చెందిన దివ్యాంగుల సాధికారత విభాగం ఆధ్వర్యంలో పర్పుల్ ఫెయిర్ 2025 ను సుభాష్ కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో మహిళా శిశు దివ్యాన్గుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, పథకాల ద్వారా వారి ప్రతిభకు తగిన గుర్తింపు, ప్రోత్సాహం అందించాలని అన్నారు. మొట్ట మొదటి సారిగా మన జిల్లాలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల అభినందించారు. దివ్యాన్గుల్లోని సృజనాత్మకత ను వెలికి తీయడానికి ఇదొక మంచి అవకాశమని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దివ్యాన్గుల పథకాలు ప్రతి మారుమూల ప్రాంత స్థాయికి చేర్చాలని, దివ్యాన్గులను గుర్తించి వారి ప్రతిభ ఆధారంగా అవకాశాలు కపిస్తే వైకల్యం తమ ప్రతిభకు అడ్డు కాదని నిరూపిస్తారని తెలిపారు. అధికారులు దివ్యాంగుల అవసరాలను గుర్తించి, వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహించి, వారి నైపుణ్యాలను మెరుగుపరిచే దిశగా దృష్టి పెట్టాలని సూచించారు. దివ్యాన్గుల సంక్షేమం, సంక్షేమ శాఖ బాధ్యతని, సంక్షేమం, సౌకర్యాల కల్పనకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. దివ్యాన్గులకు పాఠశాలల్లో విద్యాభ్యాసం, వృత్తి నైపుణ్యం, భవిత కేంద్రాల నిర్వహణ, వారికి అవసరమైన పరికరాలు అందిస్తున్నామని తెలిపారు. నేను మీకు అభయం ఇస్తున్నాను దివ్యాన్గులకు వర్తించే అన్ని పథకాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అన్ని వర్గాల సమన్వయంతో అభివృద్ధి లో దివ్యాన్గులను భాగస్వాములను చేస్తూ చేయూతను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బుద్ధిమాంద్యంతో బాధపడే దివ్యాంగుల సాధికారత కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిసేబులిటీఎస్ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 18 ఎన్‌జీవోల స్టాళ్లు ఏర్పాటు చేయగా, వారు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. యూత్ ఫర్ జాబ్స్ సంస్థ ఉద్యోగ మేళా కోసం స్టాల్ ఏర్పాటు చేసింది. అలీం కో, ఐజినిష్డ్ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్టాళ్లు పరిశీలించి దివ్యాంగులతో ప్రత్యేకంగా ముఖాముఖీ మాట్లాడారు. అన్ని స్టాళ్లను సందర్శించి, దివ్యాన్గులు వేసిన పెయింటింగ్ కొనుగోలు చేసి నగదు చెల్లించి అభినందించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. డైరెక్టర్ డా. బి.వి. రామ్ కుమార్ దివ్యాంగులకు సౌకర్యాల కల్పన, అవసరమైన సేవల సమన్వయం కోసం ఆయన తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, డీఈఓ రాజేందర్, వాసవి క్లబ్ అనిల్, సుమారు 600 మంది దివ్యాంగులు, 300 ఐఈఆర్పీలు, ఎన్‌జీవోలు పాల్గొన్నారు.

## అంగన్వాడీలో ఆటపాటలతో విద్యను బోధించాలి

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, జులై 25(జనంసాక్షి) :** జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నూతన సిలబస్ ప్రకారం ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను బోధించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శుక్రవారం ములుగు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ లోని మల్లంపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంగన్వాడి లో తల్లులతో మాట్లాడారు. పిల్లలు ఇక్కడే భోజనం చేస్తున్నారా, లేదా ఆరా తీశారు. సామ్ పిల్లలు, మ్యామ్ పిల్లల గ్రోత్ ఎలా ఉందని, ఏ ఫుడ్ ఇస్తున్నారు, బాలమృతం ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లలను ప్రతి ఒక్కరూ అంగన్వాడీ కేంద్రానికి పంపాలని సూచించారు. కిచెన్ షేడ్ ను, స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగించి చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యను బోధించాలని, వారితో మమేకమై గేయాలు పాడించలన్నారు. అన్ని అంగన్వాడీ కేంద్రాలలో నెలవారి సిలబస్ ను కచ్చితంగా అమలు చేయాలని అన్నారు. గర్భిణీలు, బాలింతలకు మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారం వేడివేడిగా ఇవ్వాలని సూచించారు. క్రమం తప్పకుండా పిల్లల బరువు, ఎత్తు తూచాలని, బరువు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టి సాధారణ బరువు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పిల్లలకు ఇవ్వాల్సిన పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించా లని సూచించారు. అతిగా బరువు తక్కువ ఉన్న పిల్లలను ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి రిఫర్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యుఓ టి రవి, సిడిపిఓ కె శిరీష, సూపర్వైజర్ ఖమురునిసా బేగం, అంగన్వాడీ టీచర్లు మల్లికాంబ, ప్రియాంక, అంగన్వాడీ పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

## జీపీవో, లైసెన్సుడ్ సర్వేయర్ల పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, జులై 25 (జనంసాక్షి) :** ఈ నెల 27వ తేదీన జరగబోయే గ్రామ పాలనా అధికారులు (జీపీవో), లైసెన్స్ సర్వేయర్ల నియామక పరీక్షలను ఎలాంటి లోటుపాట్లూ లేకుండా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జీపీవో పరీక్ష నిర్వహణకు పట్టణంలోని చాణక్య పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, మొత్తం 55 మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు అభ్యర్థులను 10 గంటలలోపు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. ఈ పరీక్షకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని వెల్లడించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 85 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ పరీక్షకు ఏడి సర్వే, ల్యాండ్ రికార్డ్స్ అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరగాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాలలోని జిరాక్స్ కేంద్రాలను పరీక్ష సమయంలో మూసివేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఏడి సర్వే, ల్యాండ్ రికార్డ్స్ అధికారి ఆర్. సుదర్శన్, కలెక్టరేట్ ఏవో సూర్యారావు, పర్యవేక్షకులు మోతిరాం, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త రేషన్ కార్డు దరఖాస్తులు నిరంతర ప్రక్రియ

- ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్
- నూతన రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**మరిపెడ, జూలై 25 (జనంసాక్షి) :** కొత్త రేషన్ కార్డు దరఖాస్తులు నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఆడిటోరియంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ డాక్టర్ రామచంద్రనాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మండలంలోని గ్రామాల కు చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఆహార భద్రత పథకం కింద నూతన రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో అధికారం ఉన్న ప్రభుత్వం 10 సంవత్సరాలలో ఏ ఒక్కరికి క్రొత్త రేషన్ కార్డు ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేదల కష్టాలు అర్థం చేసుకుని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రభుత్వం అని ఆహార భద్రత తో పాటు రేషన్ కార్డు ద్వారా ప్రజలకు ప్రయోజనాలు కలుగుతాయి అన్నారు. ప్రతిపక్ష నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని నాయకులు తిప్పికొట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దారు కృష్ణవేణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రేషన్ కార్డ్ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు అర్హత కలిగిన వారందరికీ రేషన్ కార్డును అందజేస్తామని అన్నారు,ఈ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి వేణుగోపాల్ రెడ్డి, సోమ్లా నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అభినవరెడ్డి, మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్లి రఘువీరారెడ్డి, జిల్లా నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి, మండల టౌన్ అధ్యక్షులు షేక్ తాజుద్దీన్, కేసముద్రం మార్కెట్ కమిటీ మెంబర్ ఐలమల్లు, రవి, మండల కాంగ్రెస్ పార్టీ యూత్ ఉపా అధ్యక్షులు జాటోత్ సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాల అదుపునకు ప్రత్యేక దృష్టి సారించాలి

- పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించేలా చర్యలు చేపట్టాలి
- ఎన్డీపీఎస్ చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలి
- నిందితులకు శిక్ష పడే విధంగా పని చేయాలి
- నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్




**నల్గొండ బ్యూరో, జూలై 25 (జనంసాక్షి) :** జిల్లాలో నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అంతే కాకుండా నేరాలను అదుపు చేయడానికి మరింత సమర్ధవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెల వారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లాలో నేరాలను నియంత్రించడానికి తీసుకుంటున్న చర్యలు, పెండింగులో ఉన్న కేసుల వివరాలు, కేసుల పరిష్కారానికి అధికారులు చూపిస్తున్న చొరవ, నేరాలకు పాల్పడిన నేరస్తులకు కోర్టులో శిక్షలు పడే విధంగా తీసుకుంటున్న ముందస్తు చర్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా అవసరాలకు అనుగుణంగా పోలీసు శాఖ పారదర్శక సేవలందిస్తూ ప్రజా మన్ననలు పొందేలా ముందుకు సాగాలని సూచించారు. పెరిగిపోతున్న వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి నియంత్రణ కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటూ శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా పని చేయాలన్నారు. ముఖ్యంగా నిఘా వ్యవస్థకు ప్రధాన సంపత్తిగా మారిన సీసీ టీవీల వల్ల భద్రతా ప్రమాణాలు పెరుగుతున్న క్రమంలో నేను సైతం, కమ్యూనిటీ పోలీసింగ్ లో సీసీ కెమెరాల ఏర్పాటును మరింత ప్రోత్సహించే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. నేరం చేసే వాడికి శిక్ష పడాలి, నేరం చేయని వారికి రక్షణగా ఉంటూ, సమర్ధ సేవలు ప్రజలకు అందాలన్న సంకల్పంతో పోలీస్ శాఖ లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. అదే విధంగా మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ వారి రక్షణ ప్రధాన ధ్యేయంగా నాణ్యమైన, సత్వర సేవలు అందించాలన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ లో పోక్సో, గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో విచారణ వేగవంతంగా పూర్తి చేసి కోర్ట్ లో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అవసరమైన అన్ని రకాల రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించడం, అన్ని ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు సంబంధిత శాఖలు, ప్రజలను సమన్వయం చేస్తూ వాటిని అధిగమించేలా ముందుకు సాగాలన్నారు. జిల్లాలో దొంగతనాల నివారణకు రాత్రి, పగలు పెట్రోలింగ్ నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రౌడీ షీట్స్, సస్పెక్ట్స్, పాత నేరస్థుల పై నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. సైబర్ నేరాల ఆన్ లైన్ బెట్టింగ్, లోన్ యాప్ ల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలు అక్రమ గంజాయి, జూదం, పీడీఎస్ బియ్యం, అక్రమ ఇసుక రవాణా వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ లు నర్సింగరావు, శివ నాయుడు లు ఎన్డీపీఎస్ యాక్ట్ కేసులలో చట్ట ప్రకారం నిందితులను సెర్చ్ చేసే విధానం, స్వాధీన పరుచుకున్న గంజాయిని సీజ్ చేసే సమయంలో సంబంధిత అధికారులు, పంచుల సమక్షంలో చేయవలసిన విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దర్యాప్తు అనంతరం చట్ట ప్రకారం నిందితులకు కోర్టులో శిక్ష ఎలా పడాలనే తదితర అంశాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ మౌనిక, అడిషనల్ ఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివ రాం రెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు, డీసీఆర్బీ డీఎస్పీ రవి, సీఐలు, ఎస్సై లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోచంపల్లి టై అండ్ డై ఆధ్వర్యంలో టెక్స్టైల్ ప్రిన్సిపల్ సెక్రెటరీకి వినతి

- ఇక్కత్ ప్రింటింగ్ వ్యవస్థను అరికట్టుటకు కృషి చేస్తామని హామీ

**భూదాన్ పోచంపల్లి, జూలై 25 (జనం సాక్షి) :** పోచంపల్లి చేనేత టై అండ్ డై సిల్క్ చీరల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు భారత లవకుమార్ శుక్రవారం హైదరాబాద్‌లోని చేనేత భవనంలో టెక్స్ టైల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ హ్యాండ్లూమ్ కమిషనర్ శైలజ రామయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. పోచంపల్లి ఇక్కత్ అభివృద్ధి కొరకు పలు కీలకమైన అంశాలపై చర్చించి, భూదాన్ పోచంపల్లి ప్రాంతానికి ఒక చేనేత మెగా క్లస్టర్ ని మంజూరు చేయించాలని, పోచంపల్లి ఇక్కత్ వ్యవస్థ మొత్తాన్ని అభివృద్ధి చేయుట కొరకు కృషి చేయాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా భారత లవ కుమార్ మాట్లాడుతూ టెక్స్టైల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ హ్యాండ్లూమ్ కమిషనర్ శైలజ రామయ్య చేనేత సమస్యల పరిష్కారం కొరకు సానుకూలంగా స్పందించి వీలైనంత తొందరలో పోచంపల్లికి మెగా క్లస్టర్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా ఇక్కత్ ప్రింటింగ్ ని అరికట్టుట కొరకై రాష్ట్ర ప్రభుత్వం తరఫున తమ వంతు కృషి చేస్తూనే కేంద్ర ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రింటింగ్ వ్యవస్థను అరికట్టకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు కర్నాటి బాలరాజు, సంఘ కార్యదర్శి ముసుగుర్ నరసింహ, ఉపాధ్యక్షులు ఈపూరు ముత్యాలు, కుడికాల రామనరసింహ, క్యాషియర్ మంగళంపల్లి రమేష్, సహాయ కార్యదర్శి గంజి బాలరాజు, కొండగట్ల శంకరయ్య, సీత కృష్ణ, వేముల నరేష్, కడవేరు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



# లక్ష్మీ ప్రసన్న దవాఖాన సీజ్

**జిల్లేడ్ చౌదరిగూడ, జూలై 25 (జనం సాక్షి) :** ఇటీవల పత్రిక కథనాలతో జిల్లా మెడికల్ అధికారులు కదిలారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆర్ ఎంపీ దవాఖానాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శంకర్ దాదా ఎంబిబిఎస్ డాక్టర్‌గా చలామణి అవుతున్న డాక్టర్ పై చర్యలు చేపట్టారు. జిల్లేడ్ చౌదరిగూడ కేంద్రంలో ఒక ఆర్ఎంపీ దవాఖానలో గత కొద్ది రోజుల కిందట చోటు చేసిన ఘటన సంచలనంగా మారడంతో శుక్రవారం జిల్లా వైద్య బృందం వచ్చి దవాఖానాలు సీజ్ చేశారు. జిల్లా డిఎంహెచ్ఓ ఆదేశాల అనుసారం డిఎంహెచ్ఓ డా " విజయలక్ష్మి, అమృత జో సహబ్, హెల్త్ హెడ్ కెటర్ శ్రీనివాస్ పి హెచ్ ఎన్ డీఏ. లుధియా తనిఖీలు చేపట్టారు. కొన్ని దవాఖానాలకు ప్రథమ చికిత్స చేస్తున్నట్లు బోర్డ్ పేటకపోవడంతో వారిపైన వైద్య బృందం మండిపడింది మరో ల్యాబ్ కు వెళ్లి తనిఖీలు చేయగా అందులో కాలం చెల్లిన మెడిసిన్ దొరకడంతో వారిపై కూడా మండిపడ్డారు. ముఖ్యంగా లక్ష్మీప్రసన్న దవాఖాన పూర్తిగా సీజ్ చేశామని పేర్కొన్నారు. కొందరు డా. "రుగా సర్టిఫికెట్ పొందిన క్లినికల్‌కు పర్మిషన్ తెచ్చుకోలేరని పేర్కొన్నారు. ఇందులో ఎంపిహెచ్ఎన్ఈఓ, హుసాన్, శ్రీనివాస్, డీపీఎంఓ, వెంకటేశ్వర్ పాల్గొనరు.



# భావితరాల భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**నల్గొండ బ్యూరో, జూలై 25 (జనం సాక్షి) :** భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రం లోని మహిళా డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విచక్షణా రహితంగా చెట్లను నరికి వేయడం, అడవుల నిర్మూలన, తదితర కారణాలవల్ల కాలుష్యం పెరిగిపోయి మానవ మనుగడకు ముప్పు ఏర్పడుతుందని, ఇది భావి తరాలకు అనర్ధదాయకమని అన్నారు. అందువల్ల భావి పౌరులైన విద్యార్థులు స్థలాలు ఉన్న ప్రతి చోట మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించాలన్నారు. అంతే కాకుండా మహిళలు బాగా చదువుకోవాలని, పరిస్థితులకు తగ్గట్టుగా స్పందించాలని, మహిళలు దృఢంగా ఉన్నప్పుడే ఇది సాధ్యమవుతుందని, ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఎలా స్పందించాలో ఆలోచించాలని, ఇందుకు చదువు ఒకటే మార్గం అని అన్నారు. నల్గొండ మహిళా డిగ్రీ కళాశాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, గత మార్చిలో డిజిటల్ తరగతులను ప్రారంభించడం జరిగిందని, బయోటెక్నాలజీ వంటి కొత్త కోర్సులను ప్రవేశపెట్టడం జరుగుతుందని తెలిపారు. కనగల్ తిప్పర్తి మండల కేంద్రాలలో జూనియర్ కళాశాలలను ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు. అలాగే జూనియర్ కళాశాల స్థాయిలో మధ్యలో కళాశాల మాని వేసే వారినే కాకుండా ఇతరులు కూడా నేరుగా రామగిరి డిగ్రీ కళాశాలలో చేరవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**హుజూర్‌నగర్, జూలై 25 (జనంసాక్షి) :** బ్యాంకు, బంగారు దుకాణ యజమానులు అపరిచితుల వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హుజూర్‌నగర్ సర్కిల్ సిఐ చరమందరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బ్యాంకులు, బంగారు షాపులను ఆయన సందర్శించారు. అనంతరం బ్యాంకు, బంగారు దుకాణ యజమానులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ చరమందరాజు మాట్లాడుతూ బ్యాంకు నందు స్ట్రాంగ్ రూములలో ఉన్న లాకర్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, బంగారు షాపు యజమానులు సీసీ కెమెరాలు షాపు లోపల రోడ్డు వైపు కనిపించే విధంగా ఏర్పాటు చేయాలని, గ్రిల్స్ ఏర్పాటు చేయాలని, గుర్తుతెలియని వ్యక్తుల వద్ద నుండి బంగారం కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు వహించాలని వారి వివరాలు తెలుసుకొవాలని వారిపై ఎలాంటి అనుమానం కలిగిన పోలీస్ వారికి సమాచారం అందించాలని తెలిపారు.

# రాజ్యాంగం ప్రతి ఒక్కరూ చదవాలి

- సామాజిక కార్యకర్త రాయిరాల సుమన్
- కలెక్టర్‌కు రాజ్యాంగ ప్రతి బహుకరణ



**మునగాల, జూలై 25 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరికి రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని మండల పరిధిలోని బరాఖత్ గూడెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త రాయిరాల సుమన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాయిరాల సుమన్ కలెక్టర్ కు భారత రాజ్యాంగ పుస్తకం బహుకరించారు. అంతేగాక రాజ్యాంగంలోని కొన్ని చట్టాలను చదివి వినిపించారు. ప్రతిఒక్కరు రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. రాజ్యాంగం బహుకరించడం పట్ల రాయిరాల సుమన్‌ను కలెక్టర్ అభినందించారు. భారత రాజ్యాంగం, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ పై జరుగుతున్న విషప్రచారాన్ని కట్టడి చేయాలంటే ప్రతి పౌరుడు రాజ్యాంగం గురించి తెలుసుకోవాలని, అది విద్యార్థి దశ నుండే మొదలవ్వాలనే లక్ష్యంతో రాజ్యాంగ పుస్తకాలను అందరికి అందుబాటులో ఉంచాలన్నారు. రాబోయే రోజుల్లో కోదాడ నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని పాఠశాలలకు, లైబ్రరీలకు రాజ్యాంగ ప్రతులను అందిస్తానని, గతంలో వివాహాది శుభకార్యాలలో 253 బాబా సాహెబ్ అంబేద్కర్ ఫోటోలు బహుమతులు ఇవ్వటం జరిగిందని సుమన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మునగాల ఎం.ఈ.ఓ పి. వెంకటేశ్వర్లు, అలుగుబెల్లి కరుణాకర్, గంధం సైదులు, ఓరుగంటి రవి, దార సతీష్, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళాభ్యుదయానికి పెద్దపీట

- ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి



**నాగర్‌కర్నూల్ ఆర్సీ, జూలై 25 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ మహిళాభ్యుదయానికి పెద్దపీట వేయడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన మహాలక్ష్మి విజయవంత సదస్సుకు డిఎం యాదయ్య అధ్యక్షత న పలువురు మహిళలు విద్యార్థులు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారో వివరించారు. పలు పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పెయింటింగ్ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు బాధ్యతలు చేపట్టిన వెంటనే మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించడం జరిగిందని వివరించారు. 200 కోట్ల మంది ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవడం జరిగిందని. ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ సంస్థకు 6680 కోట్లు చెల్లించడం జరిగిందని వివరించారు. వంటింటికే పరిమితమైన మహిళలు ఈ పథకం ద్వారా ఇతర ప్రాంతాలకు వెళ్లి చిరు వ్యాపారం చేసుకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మహిళలను కోటీశ్వరులు చేసేందుకు పెట్రోల్ పంపులు నిర్వాణతో పాటు బస్సులను కొనుగోలు చేసేందుకు రుణాలను మహిళా సంఘాలకు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ పథకం ద్వారా ఆర్టీసీ బలోపేతం కావడంతో పాటు మహిళలు కూడా ఆర్థికంగా ప్రయోజకులుగా మారుతున్నారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బందితోపాటు నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కలెక్టర్ సందర్శనతో మెరిసిన ప్రభుత్వ ఆసుపత్రి


- పిచ్చి మొక్కలను తొలగించి, మునగ ఔషధ మొక్కలు నాటిన వైద్య బృందం



**టేకులపల్లి, జూలై 25 (జనంసాక్షి) :** వర్షాకాలం వచ్చిందంటే ఏజెన్సీ గిరిజన గ్రామాలు విష జ్వరాలతో వణికిపోతుంటాయి. చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, నీటి నిలువలు, మురికి నీరు, గ్రామాల్లో సిమెంట్ రోడ్లకు సైడ్ డ్రైనేజీలు లేక వర్షపు వరద నీరు ఇళ్ల ఆవరణలోకి చేరుకొని అపరిశుభ్రంగా తయారై దోమలు స్వైర విహారం చేస్తూ విష జ్వరాలు ప్రబులుతుంటాయి. వీటిపై వైద్య బృందాలు ప్రతిరోజు గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,పిచ్చి మొక్కలు తొలగించుకోవాలని నీటి నిల్వలు ఉంచుకోకూడదని అవగాహన కల్పిస్తున్న వైద్య బృందానికి నిత్యము ఆసుపత్రికి వందలాదిమంది చికిత్స కోసం రోగులు వస్తూ ఉంటారు. ప్రతిరోజు వైద్యం అందించే వైద్య బృందం వారు ఉండే ఆసుపత్రి ప్రాంగణమంతా చెత్తాచెదారంతో, పిచ్చి మొక్కలతో దోమలు స్వైర విహారం చేస్తున్న పట్టించుకోకపోవడం విశేషం. భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆకస్మికంగా మంగళవారం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్యశాల ప్రాంగణమంతా పిచ్చి మొక్కలతో నిండుకొని ఉండటంతో వైద్య బృందానికి అవగాహన కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెత్త మొక్కలను తొలగించాలని, వైద్యశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మునగ, ఇతర ఔషధ మొక్కలను నాటాలని ఆదేశించారు. దీంతో వైద్య బృందం శుక్రవారం చెత్త మొక్కలను తొలగించి, మునగ మొక్కలతో పాటు వందకు పైగా వివిధ రకాల ఔషధ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జయలక్ష్మి, ఎంపీడీవో మల్లీశ్వరి, డాక్టర్ కందుల దినేష్, డాక్టర్ కంచర్ల వెంకటేష్, డాక్టర్ మధు వరుణ్ లు స్వయంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ వృక్షాలను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని, ప్రతి ఆరోగ్య ఉప కేంద్రంలో కూడా మునగ మొక్కలు, ఇతర ఔషధ గుణాలు కలిగిన మొక్కలు నాటాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లు వజ్జా పార్వతి, పాయం శ్రీనివాస్, స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్వేత, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, ఆరోగ్య విస్తరణాధికారి దేవా, సూపర్వైజర్లు గుజ్జా విజయ, కౌసల్య సింగ్, నాగు బండి వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అవినీతి అక్రమాలకు అడ్డాగా మారిన మర్రిగూడ మోడల్ స్కూల్

- పాఠశాలలో పరిశుభ్రత కరువు, టాయిలెట్స్ లేక ఇబ్బందులు
- లెక్కలేని నలభై లక్షలు..సిపీఎస్ ఇంట్రెస్ట్
- నాలుగు లక్షలకు పంగ నామాలు...?
- పాత సమాన్‌లు అమ్మకానికి ప్లాన్.. విలేకరుల అటాక్‌తో వెనకడుగు..?
- ఇప్పటికి ఇవ్వని 90 వేల స్కావెంజర్ వేతనాలు
- మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి
- మాజీ ఎంపిపి అనంత రాజు గౌడ్





**మర్రిగూడ, జూలై 25 (జనం సాక్షి) :** అవినీతి అక్రమాలకు అడ్డాగా మారిన మర్రిగూడ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శివ స్వరూప రాణి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపిపి అనంత రాజు గౌడ్ అన్నారు. అవినీతి అక్రమాలకు అడ్డాగా మారింది మర్రిగూడ మోడల్ స్కూల్ వాలకం. ప్రభుత్వం నుండి అభివృద్ధి నిధులు ఎన్ని వచ్చినా, కోతుల మలాలతో నిండిన నీరే కనపడుతుంది తప్ప, అభివృద్ధి పనులు జరగలేదని తెలుస్తుంది. టాయిలెట్స్ కోసం చిన్నారులు అవస్థలు పడుతున్న తీరు, పాఠశాలలో ఇబ్బంది మారింది. పాఠశాల అభివృద్ధికి కరువై, అవినీతికి లోనవుతుందని అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి.! ఈ నేపథ్యంలో మర్రిగూడ మాజీ ఎంపీపీ, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు అనంతరాజు గౌడ్, డైరెక్టర్ పాఠశాల విద్యాశాఖ, రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్, సమగ్ర శిక్ష తెలంగాణ ఇ. నవీన్ నికోలస్ ఐపీఎస్ కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో పలు అంశాల గురించి, జరిగిన అవినీతి అక్రమాల గురించి పేర్కొన్నారు. మర్రిగూడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివస్వరూపారాణి చేసిన అవినీతి చిట్టాను, రాజు గౌడ్ అధికారికి సమర్పించారు. ఈ సందర్భంగా అనంతరాజు గౌడ్ మాట్లాడుతూ, మోడల్ స్కూల్ నందు పరిశుభ్రత పరువైందని, టాయిలెట్స్ సుచి శుభ్రత లేకుండా పోయిందన్నారు. మధ్యాహ్నం పిల్లలకు పెట్టే సన్నబియ్యం పక్కదారి పడుతుందని, గతంలో ప్రిన్సిపాల్ పై ఇదే తంతు ఆరోపణలు వచ్చి, ఉన్నత అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. శివ స్వరూపారాణి ప్రిన్సిపల్‌గా రాకముందు, స్కూల్ ఖాతాలో 40 లక్షల రూపాయలు ఉన్నాయని, వాటిని లెక్కా పత్రాలు లేకుండా భస్మం చేసిందన్నారు. నాలుగు లక్షల సిపిఎస్ ఇంట్రెస్ట్ డబ్బులకు పంగనామాలు పెట్టిందన్నారు. స్కూల్ నందు పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ సురేష్ కే, ప్రభుత్వం ఇచ్చిన కంప్యూటర్ ని అమ్మిన మేధావి అన్నారు. స్కూల్ నందు పాత సామాన్లు, తదితర వస్తువులను ప్రైవేటు వ్యక్తులకు అమ్మకానికి పెట్టడంతో, స్థానిక విలేకరులు ఆ దారుణానికి అడ్డుగా నిలవడంతో, ప్రభుత్వ వస్తువులను పక్కదారి పట్టకుండా ఆపగలిగారన్నారు. 90 వేల రూపాయలు స్కావెంజర్ వేతనాలు, ఖాతాలో జమ అయినప్పటికీ వారికి వేతనాలు ఇవ్వకుండా, ఇబ్బందులకు గురి చేస్తుందని తెలిపారు. ఒకేషనల్ ట్రైనర్ గా పనులు చెయ్యని అన్వేష్ అనే ఓ వ్యక్తికి, జీతాల పేరుతో ప్రభుత్వ సొమ్మును లూటీ చేసిందని ఆరోపించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో పదకొండు లక్షలకు బోడి గుండు కొట్టిందని, ఇప్పటివరకు అటువంటి అభివృద్ధి పనులు ఏవి కూడా జరగలేదని చెప్పుకొచ్చారు. ప్రశ్నించిన విలేకరులపై బెదిరింపులకు పాల్పడుతూ, తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని రచ్చకెక్కుతానని అనడం పరిపాటిగా మారిందన్నారు. నన్నేమీ చేయలేరు, ఉన్నత స్థాయి అండ నాకు కొండంత ఉందని, కొసెక్కిరి మాటలతో, అవినీతి అక్రమాలు చేస్తుందన్నారు. ప్రిన్సిపల్ శివస్వరూపారాణి చదువుపై అనేక అనుమానాలు ఉన్నాయని, ఆమె సర్టిఫికెట్లను సంబంధిత అధికారులు వెరిఫై చేయాలన్నారు. వెంటనే సంబంధిత అంశాలపై, పూర్తి విచారణ చేసి తగు చర్యలు తీసుకొని ప్రభుత్వ సొమ్మును, రికవరీ చేయాలని ఫిర్యాదులో పొందుపరిచారు. ఈ అంశాలపై స్పందించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన, అనంతరాజు గౌడును మండల ప్రజలు అభినందించారు.






## రూ.10 వేల లోపు కేటగిరిలో మరో కొత్త స్మార్ట్ ఫోన్

రూ.10 వేల లోపు కేటగిరిలో మరో కొత్త స్మార్ట్ ఫోన్ విడుదలైంది. హెచ్‌డీం డిస్‌ప్లే, 5,000 ఎంఏహెచ్ బ్యాటరీ, ఐపీ64 వాటర్ రెసిస్టెన్స్, 3.5 ఎంఎం హెడ్ ఫోన్ జాక్, ఎన్ఎఫ్‌సీ, ఎఫ్ఎం రేడియో సపోర్ట్ తో ఇన్ఫినిక్స్ కొత్త ఫోన్ ను లాంచ్ చేసింది. ఈ కొత్త ఫోన్ వివో టీ4 లైట్, పోకో ఎం7, లావా స్టార్మ్ ప్లే ఫోన్లకు గట్టి పోటీ ఇవ్వనుంది.ఇన్ఫినిక్స్ స్మార్ట్ 10 స్మార్ట్‌ఫోన్ 4 జీబీ ర్యామ్ / 64 జీబీ స్టోరేజ్ వేరియంట్‌లో మాత్రమే వస్తుంది. దీని ధర రూ .6,799. ఐరిస్ బ్లూ, ట్విలైట్ గోల్డ్, టైటానియం సిల్వర్, స్లీక్ బ్లాక్ రంగుల్లో ఈ ఫోన్ లభిస్తుంది. ఆగస్టు 2వ తేదీ నుంచి ఫ్లిప్ కార్ట్ లో ఈ ఫోన్ సేల్ ప్రారంభం కానుంది.ఇన్ఫినిక్స్ స్మార్ట్ 10లో 6.67 అంగుళాల హెచ్‌డీం ఎల్‌సీడీ డిస్‌ప్లే, 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, 700 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉన్నాయి. ఇది ఐపీ 64 వాటర్ రెసిస్టెన్స్, డస్ట్ రెసిస్టెన్స్ రేటింగ్ తో వస్తుంది. అంటే ఫోన్‌పై దుమ్ము, నీటి చుక్కలు పడినా ఏమీ అవ్వదు కానీ నీటిలో పూర్తిగా మునిగిపోకుండా ఉండాలి.స్మార్ట్ 10 డీటీఎస్ ట్యూన్ చేసిన డ్యూయల్ స్పీకర్ సెటప్ తో వస్తుంది. 300% వాల్యూమ్ బూస్ట్ ను సపోర్ట్ చేస్తుంది.ఏ55 జీపీయూతో కూడిన యూనిసోక్ టీ7250 ప్రాసెసర్ పై ఈ ఫోన్ పనిచేస్తుంది. ఈ ఏడాది లాంచ్ అయిన ఇతర ఇన్ఫినిక్స్ ఫోన్ల మాదిరిగానే, ఈ స్మార్ట్ 10 ఆండ్రాయిడ్ 15 ఆధారిత కంపెనీ తాజా ఎక్స్ఓఎస్ 15 పై పనిచేస్తుంది.ఇందులో 4 జీబీ ఎల్‌పీడీడీఆర్4ఎక్స్ ర్యామ్, 64 జీబీ స్టోరేజ్‌ను అందించారు. మైక్రో ఎస్ డీ కార్డ్ స్లాట్ ద్వారా స్టోరేజ్ ను 2 టీబీ వరకు పెంచుకునే వెసులుబాటు కూడా ఉంది.ఆప్టిక్స్ విషయానికొస్తే, ఫోన్లలో 8 మెగాపిక్సెల్ ప్రైమరీ సెన్సార్, వెనుక భాగంలో డెప్త్ సెన్సార్ ఉన్నాయి.

# మళ్లీ నష్టాల్లోకే..

## కుప్పకూలిన బజాజ్ షేర్లు



**జనంసాక్షి:**బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇతర హెవీవెయిట్ షేర్ల బలహీనత మధ్య భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం గణనీయంగా నష్టాల్లో ముగిశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 721 పాయింట్లు (0.88 శాతం) నష్టపోయి 81,463.09 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 225 పాయింట్లు (0.9 శాతం) క్షీణించి 24,837 వద్ద స్థిరపడ్డాయి. బీఎస్ఈలో బజాజ్, పవర్ గ్రిడ్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ట్రెంట్ షేర్లు టాప్ లూజర్స్‌గా నిలవగా సన్ ఫార్మా మాత్రమే లాభపడింది.
విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1.61 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 2.1 శాతం నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఫార్మా (0.54 శాతం) మినహా అన్ని కౌంటర్లలో అమ్మకాలు కనిపించాయి. నిఫ్టీ ఆటో 1.27 శాతం, నిఫ్టీ ఐటీ 1.42 శాతం, నిఫ్టీ మెటల్ 1.64 శాతం, నిఫ్టీ రియల్టీ 0.99 శాతం, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ 0.91 శాతం, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 0.9 శాతం నష్టపోయాయి.దేశీయ మార్కెట్లో మార్కెట్ అస్థిరతకు కొలమానమైన ఇండియా వీఐఎక్స్ 5.15 శాతం లాభంతో 11.28 వద్ద ముగిసింది.

## వేగంగా 1 లక్ష కార్లు ఎగుమతి చేసి రికార్డు




భారత ఆటోమొబైల్ తయారీలో మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్ తన కాంపాక్ట్ ఎస్‌యూవీ ఫ్రాంక్స్ ఎగుమతుల్లో రికార్డు నెలకొల్పింది. భారతదేశం నుంచి వేగంగా 1 లక్ష ఎగుమతులను అధిగమించిన ఎస్‌యూవీగా నిలిచిందని కంపెనీ ప్రకటించింది.2023 జూన్‌లో ప్రపంచ ఎగుమతి కార్యకలాపాలు ప్రారంభమైన కేవలం 25 నెలల్లోనే ఈ మైలురాయిని చేరుకుందని చెప్పింది.గుజరాత్‌లోని మారుతీ సుజుకీ ప్లాంట్‌లో ప్రత్యేకంగా తయారు చేసిన ఫ్రాంక్స్ లాటిన్ అమెరికా, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికాతో సహా విదేశీ మార్కెట్లలో బలమైన పనితీరును కనబరుస్తోందని కంపెనీ తెలిపింది. జపాన్‌లో దీనికి పెరుగుతున్న ప్రజాదరణ ఎగుమతి వృద్ధికి దోహదం చేసిందని చెప్పింది. మారుకీ సుజుకీ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ హిసాషి టేకుచి మాట్లాడుతూ.. 'ప్రపంచ మార్కెట్ల కోసం ప్రపంచ స్థాయి వాహనాలను తయారు చేయగల సామర్థ్యం కంపెనీకి ఉంది. మేక్ ఇన్ ఇండియా చొరవకు కంపెనీ సాధించిన విజయమే నిదర్శనం. ప్యాసింజర్ వాహన ఎగుమతులు, అంతర్జాతీయ మార్కెట్లపై దృష్టి సారిస్తున్నాం' అని చెప్పారు. 2026 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలోనే మారుతీ సుజుకీ 96,000 వాహనాలను ఎగుమతి చేయడం విశేషం. భారతదేశ ప్యాసింజర్ వాహన ఎగుమతుల్లో రికార్డు స్థాయిలో 47 శాతం వాటాను ఆక్రమించింది. వరుసగా నాలుగో ఏడాది భారతదేశపు టాప్ ప్యాసింజర్ వాహన ఎగుమతిదారుగా కంపెనీ తన స్థానాన్ని నిలుపుకుంది.

## విస్కీ ధరలు తగ్గింపు..?



**జనంసాక్షి:**భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై ఇరు ప్రాంతాల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ డీల్ కుదరడంతో స్పిరిట్లపై దిగుమతి సుంకాలు తగ్గుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రీమియం అంతర్జాతీయ మద్యం బ్రాండ్లను భారతీయ వినియోగదారులకు మరింత చౌకగా అందించే వీలుందని భావిస్తున్నారు. ఒక్కో బాటిల్‌పై సరాసరిగా రూ.300 వరకు ధరల తగ్గింపు ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు.ఈ ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దీర్ఘకాలంలో ఇరుదేశాల వాణిజ్యాన్ని 35 బిలియన్ డాలర్లకు పెంచుతుంది. ఈ డీల్ కోసం మూడేళ్లకు పైగా సాగుతున్న చర్చల ఫలితంగా మే నెలలో ఎఫ్‌టీఏను ఖరారు చేయగా, ప్రధాని నరేంద్ర మోదీ బ్రిటన్ పర్యటన సందర్భంగా వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, యూకే ప్రధాని జోనాథన్ రేనాల్డ్స్ ఒప్పందంపై తాజాగా సంతకాలు చేశారు. రెండు ప్రభుత్వాల మధ్య లండన్‌లో కుదిరిన ఎఫ్‌టీఏ ప్రకారం యూకే విస్కీ, జిన్‌లపై సుంకాన్ని భారత్ 150 శాతం నుంచి 75 శాతానికి తగ్గించనుంది. ఈ ఒప్పందం కుదిరిన పదేళ్లలో మరో 40 శాతం సుంకాలు తగ్గించేలా నియమాలున్నాయి. భారతదేశంలో ప్రీమియం ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఎస్‌డబ్ల్యూఏఐ) ఈ వాణిజ్య ఒప్పందాన్ని ఆల్కహాలిక్ బేవరేజ్ రంగానికి చారిత్రాత్మక క్షణంగా అభివర్ణించింది. ఈ ఒప్పందం వల్ల ప్రీమియం అంతర్జాతీయ స్పిరిట్స్ మరింత అందుబాటులోకి వస్తాయని, ఈ డీల్ భారతీయ వినియోగదారులకు ప్రయోజనం చేకూరుస్తుందని ఐఎస్‌డబ్ల్యూఏఐ సీఈఓ సంజిత్ పాధి తెలిపారు. ఇది హాస్పిటాలిటీ, టూరిజం, రిటైల్ వంటి అనుబంధ రంగాల్లో వృద్ధికి ఊతమిస్తుందని పేర్కొన్నారు.

## నిలిచి గెలిచిన ప్రేమికులు!

### కుటుంబం తొలుత ఒప్పుకోకపోయినా వివాహంతో ఏకమైనా అనిల్ అంబానీ బాలీవుడ్ నటి టీనా మునిమ్ జంట



రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్, ముఖేష్ అంబానీ సోదరుడు అనిల్ అంబానీ ఆస్తులపై ఈడీ దాడుల నేపథ్యంలో ఆయన ప్రేమ కథ మరోసారి వార్తల్లో నిలిచింది.1991లో అప్పటి బాలీవుడ్ నటి టీనా మునిమ్‌ను వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ వివాహం వెనుక పెద్ద స్టోరీనే నడించిందట. మొదట్లో అనిల్, టీనా ప్రేమకథను అంబానీ కుటుంబం అంగీకరించ లేదట. అవును.. వివరాలు తెలుసుకుందాం. కేవలం నటి అన్న కారణంగానే టీనాను ఇంటి కోడలిగా తెచ్చుకునేందుకు తమ చిన్న కొడుకు అనిల్ అంబానీ -టీనాను ప్రేమను తొలుత తల్లిదండ్రులు ధీరూభాయ్ , కోకిలాబెన్ అంబానీ వ్యతిరేకించారట. కానీ ఓపిగ్గా ఎదురు చూసి, తల్లిదండ్రులను ఒప్పించుకుని మరీ తమ ప్రేమను గెలిపించుకున్నారు అనిల్ అంబానీ -టీనా మునిమ్. అంతేకాదు అన్యోన్య దాంపత్యంతో తమ ప్రేమ అమరమని నిరూపించుకున్నారు. అనిల్ టీనాను తొలుత ఎక్కడ చూశాడంటే 1983లో వార్టన్‌లో పూర్తి చేసిన తర్వాత, అనిల్ మొదటిసారిగా టీనాను ఒక వివాహంలో తొలిసార చూశాడు. తొలి చూపులోనే ఆమెపై ప్రేమ చిగురించింది. సాంప్రదాయ హిందూ వివాహంలో బ్లాక్ సారీలో ప్రత్యేకంగా కనిపించిన టీనాను అనిల్‌ను దృష్టిని ఆకర్షించింది. కానీ అప్పుడు వారిద్దరూ మాట్లాడుకోలేదు. కానీ కొన్ని నెలల తర్వాత ఒక పరస్పర స్నేహితుడు వారిని ఫిలడెల్ఫియాలో పరిచయం చేశాడు.అపుడు టీనా పెద్దగా పట్టించుకోలేదు. కానీ 1986లో మరోసారి టీనా మేనల్లుడు ద్వారా అనిల్ టీనా కలయిక వీరి జీవితాలను మలుపు తిప్పింది. అనిల్ అంబానీ పెళ్లి ప్రపోజల్ ప్లాన్‌తో టీనా మునిమ్‌ను తన తల్లిదండ్రులు ధీరూభాయ్, కోకిలాబెన్ అంబానీలకు పరిచయం చేశాడు. ఈ సందర్భంలోనే ఆమెకు ప్రపోజ్ చేయాలనుకున్నాడు. కానీ అనిల్ అలా బయటికి వెళ్లగానే అక్కడే వున్న సోదరుడు ముఖేష్ టీనాకు ఆ రహస్యాన్ని చెప్పడంతో ప్రపోజల్ ప్లాన్ చెడిపోయిందట. అటు తమ చిన్న కుమారుడు ఒక నటితో ప్రేమలో ఉన్నాడని తెలిసి అంబానీ కుటుంబం ఆ సంబంధాన్ని వ్యతిరేకించింది. దీంతో అమితమైన ప్రేమ ఉన్నప్పటికీ వేరే దారిలేక అనిల్ టీనా విడిపోవాల్సి వచ్చింది. టీనా ఇంటీరియర్ డిజైనర్ కోర్సు చేయడానికి అమెరికా వెళ్లిపోయింది. అనిల్‌తో సంబంధాలు దాదాపు కట్ అయిపోయాయి. ఇక్కడ అనిల్ మాత్రం ఎన్ని పెళ్లి సంబంధాలు తెచ్చినా, అన్నింటినీ తిరస్కరిస్తూ వచ్చాడు. అలా నాలుగేళ్లు గడిచిపోయాయి. అయితే లాస్ ఏంజిల్స్‌లో భూకంపం రావడంతో అనిల్ పరిగెత్తుకుంటూ ప్రియురాలికి దగ్గరికి వెళ్లిపోయాడు.మరోవైపు టీనాను వివాహం చేసుకునేందుకు అనిల్ కుటుంబం ఎట్టకేలకు ఒప్పుకుంది. కానీ టీనా అనిల్‌ను పెళ్లి చేసుకోవాలా వద్దా అని ఆలోచిస్తున్న క్రమంలో అనిల్ గట్టిగా పట్టుబట్టడంతో ఆ సమయం కోసమే ఎదురు చూస్తున్న టీనా రెక్కలు కట్టుకుని మరీ ఇండియాలో వాలిపోయింది. అలా కుటుంబ ఆమోదంతో 1991, ఫిబ్రవరి 2న సాంప్రదాయ గుజరాతీ పద్ధతిలో వివాహం జరిగింది. ఇపుడు కోకిలాబెన్‌కు టీనా కూడా ఇష్టమైన కోడలు. తమ ప్రేమను గెలిపించుకునేందుకు అనిల్-టీనా చూపించిన ఓర్పు, పట్టుదల వారి అమర ప్రేమకు చిహ్నంగా నిలిచింది. అలా మూడు దశాబ్దాలకు పైగా అనిల్-టీనా వైవాహిక జీవితం కొనసాగుతోంది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, జై అన్మోల్ ,జై అన్షుల్ ఉన్నారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.25 | ₹ 4.27 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 92,100 | ₹ 1,00,480 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,28,000

# ఇండియన్స్‌ను వద్దనుకుంటే యూఎస్‌కే నష్టం..



భారత్ వంటి దేశాలతో సహా విదేశాల్లో నియామకాలను నిలిపివేయాలని గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి బడా టెక్ కంపెనీలకు ఇటీవల ట్రంప్ సందేశం పంపారు.ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయానికి కారణాలు లేకపోలేదు. 'అమెరికా ఫస్ట్' అనే నినాదంతో ఎన్నికల్లో గెలిచిన ట్రంప్ అక్కడి స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతోపాటు ఇంకా కొన్ని కారణాలున్నాయి. అయితే దీని అమలు చేస్తే యూఎస్ సాంకేతిక అభివృద్ధి మందగిస్తుందని కొందరు నిపుణులు చెబుతున్నారు.

**జనంసాక్షి:**2025 జులై 23-24 తేదీల్లో జరిగిన ఏఐ సదస్సులో ట్రంప్ రాడికల్ గ్లోబలిజం నుంచి టెక్ కంపెనీలు బయటకు రావాలని నొక్కి చెప్పారు. టెక్ కంపెనీలు యూఎస్ నుంచి ప్రయోజనం పొందుతున్నాయని చెబుతూ, చైనా, భారత్ వంటి దేశాల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను ఎత్తిచూపారు. అమెరికాలో ఉపాధిని పెంచేందుకు స్థానిక టెక్నాలజీ కంపెనీలు ముందుకు రావాలన్నారు. ఇదే సదస్సులో కృత్రిమ మేధకు సంబంధించి కొత్త కార్యనిర్వాహక ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు. అమెరికాలో కృత్రిమ మేధ అభివృద్ధిని పెంచడానికి, దేశ పురోగతి అడ్డంకులను తగ్గించడానికి 'విన్నింగ్ ది రేస్' పేరుతో జాతీయ వ్యూహాన్ని తెలియజేశారు. ఈ ప్రణాళికలో డేటాసెంటర్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడం ద్వారా, కృత్రిమ మేధకు అవసరమైన మౌలిక సదుపాయాలను కంపెనీలు సులభంగా నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ట్రంప్ తెలిపారు. అమెరికాను కృత్రిమ మేధలో అగ్రగామిగా నిలపాలని చెప్పారు. ఏఐని అభివృద్ధి చేయడానికి ఫెడరల్ ఫండింగ్ పొందే కంపెనీలను లక్ష్యంగా చేసుకుని ట్రంప్ ఉత్తర్వుపై సంతకం చేశారు. అందులో భాగంగా కంపెనీలు రాజకీయంగా తటస్థంగా ఉండే ఏఐ టూల్స్‌ను తయారు చేయాల్సి ఉంటుంది. ట్రంప్ గత హయాంలో జారీ చేసిన బై అమెరికన్, హైర్ అమెరికన్ కార్యనిర్వాహక ఉత్తర్వులను పునసమీక్షించాలని యోచిస్తున్నట్లు తెలుస్తుంది. అమెరికా టెక్ సంస్థల్లో భారతీయులు ఎక్కువగా ఉపయోగించే హెచ్-1బీ వీసా విధానాలపై ఇది ఒత్తిడి తెస్తుంది. ఈ వీసా అమెరికా కంపెనీలు స్థానిక సిబ్బంది కంటే విదేశీ ప్రతిభావంతులపై ఎక్కువగా ఆధారపడటానికి ప్రోత్సహిస్తుందని విమర్శకులు వాదిస్తున్నారు.గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో డెవలప్‌మెంట్ సెంటర్లను నిర్వహిస్తున్నాయి. భారత్‌లో నియామకాలు ఆపేయాలనే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక కంపెనీల దీర్ఘకాలిక కార్యకలాపాలకు సవాలుగా మారుతుంది. ఇప్పటికే యాపిల్ సీఈఓ టిమ్ కుక్‌తో జరిగిన ప్రైవేట్ కార్యక్రమంలో ఇండియాలో కార్యకలాపాలు నిర్వహించడం తనకు ఇష్టం లేదని ట్రంప్ అన్నారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు తమ ఆర్ అండ్ డీ, ఇంజినీరింగ్ ఉద్యోగులను తిరిగి యూఎస్‌కు రప్పించాలని కూడా ట్రంప్ ఆంక్షలు విధిస్తున్నట్లు తెలుస్తుంది.ట్రంప్ వ్యాఖ్యలపై భారత అధికారులు, ప్రపంచ ఆర్థికవేత్తలు, టెక్ ఇండస్ట్రీ లీడర్ల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతర్జాతీయ ప్రతిభావంతులకు భారతదేశం నెలవుగా కొనసాగుతోంది. చాలా కంపెనీలు ఇక్కడి నైపుణ్యాన్ని తమ అభివృద్ధికి ఉపయోగిస్తున్నాయి. ట్రంప్ నిర్ణయం అమెరికా ఆవిష్కరణలకు సహాయపడటం కంటే ఎక్కువ హాని కలిగిస్తుందని చాలా మంది అభిప్రాయపడుతు న్నారు. ముఖ్యంగా గ్లోబల్ టెక్ ఎకోసిస్టమ్‌లో భారత్ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రపంచంలోని ప్రముఖ టెక్ సంస్థల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, క్లౌడ్ ఇన్‌ఫ్రా కోసం భారతీయ ఇంజినీర్లు, డెవలపర్లు, పరిశోధకులు గణనీయంగా దోహదపడుతున్నారు. భారత్ నుంచి నియామకాలను నిలిపివేస్తే అమెరికా-భారత్ సంబంధాలు దెబ్బతిం టాయని, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంలో పురోగతి మందగించవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

### వరుసగా రెండో రోజు తగ్గిన పసిడి



**ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.గత కొన్ని రోజులుగా భారీగా పెరిగిన బంగారం ధరలు ఊగిసలాడుతున్నాయి. నిన్నటి బులియన్ మార్కెట్‌లో పసిడి ధరలు తగ్గడంతోపాటు, ఈ రోజు కూడా ఊరట లభించింది. గురువారంతో పోలిస్తే శుక్రవారం పసిడి ధరలు తగ్గాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈరోజు బంగారం ధరలు ఎలా ఉన్నాయో కింద తెలుసుకుందాం.**

## వెజ్ ప్రోటీన్ స్లైస్‌ను విడుదల చేసిన మెక్‌డొనాల్డ్స్

### సీఎస్ఐఆర్-సీఎఫ్‌టీఆర్ఐ సహకారంతో అభివృద్ధి

**జనంసాక్షి:**ఆహార ప్రియులకు ఆరోగ్యకరమైన, మరింత స్థిరమైన ఫాస్ట్ ఫుడ్‌ను అందించాలనే లక్ష్యంతో మెక్‌డొనాల్డ్ ఇండియా 'ప్రోటీన్ ప్లస్ స్లైస్'ను విడుదల చేస్తున్నట్లు తెలిపింది.ఈ వెజిటేరియన్ ఆధారిత ఆవిష్కరణ కోసం మెక్‌డొనాల్డ్ సీఎస్ఐఆర్-సీఎఫ్‌టీఆర్ఐ తో జత కట్టినట్లు పేర్కొంది. ప్రోటీన్ ప్లస్ స్లైస్ అనేది మొక్కల ఆధారిత ప్రోటీన్ స్లైస్. ఇది అధిక పోషకాలు కలిగి మాంసాహార ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా పనిచేస్తుంది. ముఖ్యంగా భారతీయ అభిరుచులు, ఆహార ప్రాధాన్యతలకు అనుగుణంగా దీన్ని తయారు చేసినట్లు కంపెనీ తెలిపింది. ఈ స్లైస్ 100% శాఖాహారంతో తయారు చేసినట్లు చెప్పింది. ఇందులో మొక్కల ఆధారిత ప్రోటీన్ అధికంగా ఉంటుంది. భారతీయ ఆహార సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి స్థానికంగా అభివృద్ధి చేశారు. ఈ స్లైస్ ఆవిష్కరణకు మైసూరు కేంద్రంగా పనిచేస్తున్న సీఎస్ఐఆర్-సీఎఫ్‌టీఆర్ఐతో ఒప్పందం కుదుర్చుకోవడం మరింత విశ్వసనీయతను చేకూరుస్తుందని కంపెనీ నమ్ముతుంది. పప్పులు, తృణధాన్యాల నుంచి సేకరించిన మొక్కల ఆధారిత ప్రోటీన్లను ఉపయోగించి పోషకాల సమతుల్యానికి సీఎఫ్‌టీఆర్ఐ పరిశోధనలు ఎంతో తోడ్పడ్డాయని మెక్‌డొనాల్డ్ తెలిపింది.



## ఇండియా-యూకే ట్రేడ్ డీల్ వ్యవసాయానికి జాక్‌పాట్

భారత వ్యవసాయ రంగానికి ఇండియా-యూకే ఇటీవల సంతకం చేసిన కాంప్రహెన్సివ్ ఎకనామిక్ అండ్ ట్రేడ్ అగ్రిమెంట్ (సీఈటీఏ) ఎంతో మేలు చేస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.భారతీయ వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఎగుమతుల్లో 95% యూకే మార్కెట్‌లో సుంకం లేకుండా అనుమతించే వీలుంది. ఇది భారతీయ రైతులు, వ్యవసాయ ఎగుమతిదారులకు మార్కెట్ అవకాశాలను గణనీయంగా పెంచుతుందని భావిస్తున్నారు. ఇటీవల కుదిరిన ఒప్పందం ప్రకారం వ్యవసాయానికి సంబంధించి కొన్ని ప్రధాన అంశాలు కింది విధంగా ఉన్నాయి. బాస్మతి, బాస్మతియేతర బియ్యం,పండ్లు మరియు కూరగాయలు, మసాలా దినుసులు ప్రాసెస్ చేసిన ఆహారాలు ఇది కీలకమైన దేశీయ పరిశ్రమలను కాపాడుతుంది.

## రాజస్థాన్‌లో విషాదం

**జైపూర్(జనంసాక్షి):**రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం ఓ ప్రాథమిక పాఠశాల పైకప్పు కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఆరుగురు చిన్నారులు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఝాలవర్‌లోని పీప్లోడీ ప్రభుత్వ పాఠశాలలో ఈ ప్రమాదం జరిగింది. ఉదయం పిల్లలు తరగతులకు హాజరవుతుండగా ఒక్కసారిగా భవనం పైకప్పు కూలిపోయింది.ఈ ప్రమాదంలో 15 మంది చిన్నారులకు తీవ్ర గాయాలవగా వారిని ఆస్పత్రికి తరలించారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని స్థానిక పోలీసు అధికారి తెలిపారు. రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించారు. జేసీబీ సాయంతో శిథిలాలను తొలగించి, చిన్నారులను బయటకు తీయడంలో స్థానికులు సాయపడుతున్నారు. భవనం శిథిలావస్థలో ఉందని, దీనిపై గతంలో అనేకసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి మదన్‌దిలావర్ స్పందించారు. ఈ విషాద ఘటన తనను ఎంతో బాధించిందన్నారు. గాయపడిన చిన్నారులు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారని, వారి చికిత్సకు ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. భవనం పైకప్పు ఎలా కూలిపోయిందో తెలుసుకునేందుకు విచారణ జరిపిస్తామన్నారు
.రాష్ట్రపతి, ప్రధాని సంతాపం..
కాగా.. ఈ ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. విద్యార్థుల మరణ వార్త తనను ఎంతో బాధించిందని ముర్ము పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు

## నా కుమారుడి మరణంపై అనుమానాలున్నాయి



కరిష్మా మాజీ భర్త సంజయ్ కపూర్ మరణంపై తల్లి సంచలన ఆరోపణలు

**జనంసాక్షి:**వ్యాపారవేత్త, నటి కరిష్మా కపూర్ మాజీ భర్త, సంజయ్ కపూర్ ఆకస్మికమరణంపై ఆమె తల్లి సంచలన ఆరోపణలు చేశారు. ఆయన మరణించిన నెల రోజుల తర్వాత తన కొడుకు మరణాన్ని అనుమానాస్పదం అని పేర్కొంటూ కొన్ని దిగ్భ్రాంతికర వాదనలు చేశారు.సంజయ్ మరణం తర్వాత ప్రజలు, కుటుంబ వారసత్వాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు.సోనా కామ్‌స్టార్ మాజీ ఛైర్మన్ సంజయ్ కపూర్ (కెనడాలో జూన్ 12న) పోలో ఆడుతూ మరణించడం అందర్నీ దిగ్భ్రాంతికి గురిచేసింది. తేనెటీగ కుట్టడం వలన గుండెపోటు వచ్చి చివరికి అతని మరణం సంభవించిందని వార్తలొచ్చాయి. తాజాగా ఆయన తల్లి రాణి కపూర్ తన కొడుకు ఆకస్మిక మరణంపై అనుమానాలు వ్యక్తం చేయడం సంచలనంగా మారింది.అంతేకాదు సోనా కామ్‌స్టార్‌వార్షిక సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేయమని కోరుతూ లేఖ రాశారు. తన కొడుకు మరణంపై అనేక చిక్కు ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదని వాపోతోంది. తన ఏకైక కుమారుడు మరణంపై వచ్చిన వార్తలన్నీ ఊగాహానాలేనని, యూకేలో చెప్పుకోలేని పరిస్థితులలో చనిపోయాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎన్ని సార్లు అడిగినా తన కొడుకు మరణానికి సంబంధించిన వివరాలు అందదండం లేదు. సంబంధిత సమాధానాలు, పత్రాలు నాకు అందలేదు. ఇంత దుఃఖంలో కొంతమంది కుటుంబ వారసత్వాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు.అంతేకాదు సంజయ్ కపూర్‌కు ఖాతాలకు యాక్సెస్‌ను కూడా నిరాకరించారట. సంజయ్ మరణించిన ఒక నెలలోనే ఎంపిక చేసిన కొద్దిమందికే దీనికి అవకాశం కల్పించారని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. తనకు అర్థం కాని పత్రాలపై సంతకం చేయమని బలవంతం చేశారని కూడా పేర్కొన్నారు. ఏమి రాసి సందో అర్థం చేసుకునేంత భావోద్వేగ స్థితిలో తాను లేనని, తీవ్ర మానసిక, మానసిక వేదన పడుతోంటే, నాలుగ్గోడల మధ్య పత్రాలపై సంతకం చేయమని బలవంతం చేశానంటూ షాకింగ్ వాదనలు చేశారు. తన దివంగత భర్త సురీందర్ కపూర్ ఎస్టేట్‌కు ఏకైక లబ్ధిదారురాల్ని తానేని, సోనా కామ్‌స్టార్‌తో సహా సోనా గ్రూప్‌లో మెజారిటీ వాటాదారుని రాణీ తన లేఖలో పేర్కొన్నారు. సంజయ్ కపూర్ తల్లిగా మాత్రమే కాకుండా, కపూర్ కుటుంబ అధిపతిగా, కంపెనీలో అతిపెద్ద వాటాదారుగా తాను వ్రాస్తున్న ఈ లేఖను బోర్డు,వాటాదారులు నిర్లక్ష్యం చేస్తే కంపెనీ యొక్క దుర్వినియోగం నమ్మక ఉల్లంఘన కేసు అవుతుందని కూడా ఆమె స్పష్టం చేశారు.మరోవైపు ఇప్పటికే ప్రారంభమైందని, సంజయ్ కపూర్ భార్య ప్రియా సచ్‌దేవ్ సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉందని నివేదికలు తెలిపాయి. కాగా పలు నివేదిక ప్రకారం, రూ. 39 వేల కోట్ల ఆస్తిని సంజయ్ కపూర్, అతని ఇద్దరు సోదరీమణులు, సూపర్నా మోట్వానే , మందిరా కపూర్ మధ్య విభజించే అవకాశం ఉంది. దీనిపై ఎలాంటి ధృవీకరణ లేనప్పటికీ, సంజయ్ తన సోదరి మందిరాతో గత నాలుగేళ్లుగా వివాదం నడుస్తోంది.

# మున్నూరు కాపులకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి

- మున్నూరు కాపుల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తే నిలదీస్తం
- మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూలై 25 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మంత్రి వర్గ విస్తరణలో మున్నూరు కాపులకు స్థానం కల్పించాలని, మున్నూరు కాపుల ఆత్మ గౌరవానికి భంగం కల్పిస్తే నిలదీస్తామని మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం, చల్ల హరిశంకర్‌లు అన్నారు. శుక్రవారం ఆయనతో పాటు రాష్ట్ర నాయకులు రాజన్న దర్శించుకుని, బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం మొక్కులు సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర క్యాబినెట్ లోనే మొట్ట మొదటిసారిగా కాపు సామాజిక వర్గానికి న్యాయం దక్కలేదన్నారు. కార్పొరేషన్ కూడా ప్రకటించి ఇప్పటివరకు పదవులు కూడా ఇవ్వకపోగా నిధులు కూడా కేటాయించలేదని వారు ఆరోపించారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను హర్షిస్తూనే, ప్రభుత్వం తమ ఆత్మగౌరవానకి భంగం కలిగిస్తే తప్పనిసరిగా నిలదీస్తామని హెచ్చరించారు. రాష్ట్ర సంఘంలోని వివిధ పదవులు పొందిన వారికి నియామక పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు బండి పద్మ, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్, అపెక్స్ కమిటీ సభ్యులు మీసాల చంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, పట్టణ అధ్యక్షుడు కోయినేని బాలయ్య, నాయకులు ఎర్ర మహేష్, బింగి శ్రీనివాస్, సోయినేని మహేష్, నామాల శేఖర్, 33 జిల్లాల మూకాస నాయకులు పాల్గొన్నారు.





# ముష్కిన్ చెరువును కాపాడే పనిలో హైడ్రా

### ఎఫ్‌టీఎల్‌లో పోసిన మట్టిని తొలగించాలని ఆదేశాలు

**హైదరాబాద్, జూలై 25 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా మణికొండ మున్సిపాలిటీలోని ముష్కిన్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వేసిన మట్టిని వెంటనే తొలగించాలని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. ఆగస్టు నెలాఖరుకు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వేసిన మట్టితో పాటు.. పై భాగంలో వేసిన బండ్‌ను తొలగించాలని.. లేని పక్షంలో బాధ్యులపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. అభివృద్ధి పేరిట చెరువు ఎఫ్‌టీఎల్‌లో బండ్ నిర్మించి.. పైభాగాన్ని చెరువు నుంచి బండ్ ద్వారా వేరు చేస్తున్నారని స్థానికుల ఫిర్యాదుతో.. హైడ్రా శుక్రవారం హై డ్రా కార్యాలయంలో విచారణ చేపట్టింది. సీఎస్ఆర్ నిధుల కింద చెరువును అభివృద్ధి చేస్తున్న తత్వ రియల్ ఎస్టేట్ సంస్థతో పాటు ఆ పనులు చేపట్టిన ద్రవాన్ష్ అనే ఎన్‌జీవో సంస్థ ప్రతినిధులు కూడా ఈ సమావేశానికి హాజర య్యమారు. చెరువు విస్తీర్ణం మొత్తం 50 ఎకరాల వరకూ ఉండగా.. చెరువు చుట్టూ ఎగువ భాగంలో కూడా బండ్ నిర్మించడంతో కేవలం 12 ఎకరాలకు పరిమితం చేసినట్టు అవుతోందని నివాసితులు, ముష్కి చెరువు పరిరక్షణ సమితి ప్రతినిధులు హైడ్రా ముందు వాపోయారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత అభివృద్ధి పనుల పేరిట నిబంధనలకు వ్యతిరేకంగా చెరువులో మట్టి పోయడం పట్ల హైడ్రా కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మట్టిని తొలగించి పూర్తి స్థాయిలో చెరువును కాపాడి అభివృద్ధి పనులు కొనసాగించాలని సూచించారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయం

- రేషన్ కార్డు అనేది నిరంతర ప్రక్రియ - మార్పులు చేర్పులకు అవకాశం
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



**జగిత్యాల బ్యూరో, జులై 25 జనంసాక్షి :** శుక్రవారం రోజున చొప్పదండి నియోజకవర్గంలోని కొడిమ్యాల, మల్యాల మండలాలకు సంబంధించి గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో నూతనంగా మంజూరైన 3,632 కొత్త తెల్ల రేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమ కోసం పాటు పడుతుందని, వారి అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. అదే విధంగా రేషన్ కార్డులలో పేర్లు నమోదు కాని వారు నమోదు చేయించుకోవాలని, రేషన్ కార్డు అనేది నిరంతర ప్రక్రియ అని వాటిలో మార్పులు – చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుం దని అన్నారు. తెల్ల రేషన్ కార్డు ద్వారా మనిషికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను అందజేస్తున్నదని సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు మహాలక్ష్మి పథకం అందించి ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించి, మహిళలను కోటీశ్వరులు చేయాలన్న ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఎన్నో కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేస్తున్నదని వీటన్నిటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేషన్ కార్డులు రానివారు ఇప్పుడు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రభుత్వం వెంటనే వారి దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి రేషన్ కార్డులను మంజూరు చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం కొత్త కార్డు రాని వారు ఇబ్బందులు పడాల్సిన పని లేదని, రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే వీలు ఉంటుందని, ఇది కాకుండా ప్రజాపాలనలోనూ ధరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. మీ వివరాలను పరిశీలించి.. అర్హత ఉంటే కార్డును వెంటనే మంజూరు చేస్తారు. రేషన్ కార్డులు పొందిన వెంటనే వీరు సంబంధించిన మున్సిపల్, మండల పరిషత్ కార్యాలయాలలో దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించింది. దాంతో వెంటనే ఆ సంక్షేమ పథకాలు తెల్ల రేషన్ కార్డులు పొందిన కొత్త వారికి కూడా వర్తించనున్నాయి.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధు సుధన్, సివిల్ సప్లై అధికారి జితేందర్ రెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజ్ కుమార్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎమ్మార్వో, ఎంపిడిఓ, పాల్గొన్నారు.

### హన్మాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్యాస్ కనెక్షన్ మంజూరు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాలతో అందుబాటులోకి
- మధ్యాహ్న భోజన నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రుల హర్షం



**వేములవాడ రూరల్, జూలై 25 (జనంసాక్షి):** కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మిక తనిఖీ.. ఆదేశాల మేరకు వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్యాస్ కనెక్షన్ అందుబాటులోకి వచ్చింది. మధ్యాహ్న భోజన నిర్వాహకుల ఇబ్బందులు దూరం చేసింది. కలెక్టర్ బుధ వారం వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కట్టెల పొయ్యి పై వంటలు సిద్ధం చేస్తూ మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇబ్బంది పడుతుండడాన్ని గుర్తించారు. వెంటనే ఆ పాఠశాలకు గ్యాస్ కనెక్షన్ మంజూరు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు శుక్రవారం హన్మాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్యాస్ కనెక్షన్ అందజేశారు. దీంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆహార పదార్థాలను గ్యాస్ స్టవ్ పైనే సిద్ధం చేశారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీ తో తమ పాఠశాలలోని కట్టెల పొయ్యి దూరమై గ్యాస్ కనెక్షన్ అందుబాటులోకి రావడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు కృతజ్ఞతలు తెలిపారు.



### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారు తుప్పాటి లావణ్య. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పిల్లర్స్ స్థాయి వరకు నిర్మాణం పూర్తయినందున మిగతా నిర్మాణం కూడా వేగవంతం చేయాలని లబ్ధిదారుకు సూచించారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి ఎక్కడ కూడా ఇసుక, మొరం సమస్య లేకుండా ప్రభుత్వం సూచించిన విధంగా నాణ్యతగా ఇండ్లను నిర్మించుకొని త్వరగా గృహప్రవేశాలు చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ను ప్రారంభించడానికి డబ్బులు ఇబ్బందిగా ఉన్న నిరుపేద లబ్ధిదారులకు ఐకెపి ద్వారా ముందస్తు రుణం అందించాలని లబ్ధిదారులు ఐకెపి గ్రూపులో లేకపోతే గ్రూపులో చేర్చి మరీ రుణాలను అందించాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగంగా జరిగేలా ఎంపీడీవోను పంచాయతీ సెక్రెటరీ నీ ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీరితోపాటు హౌసింగ్ పీడీ విజయపాల్ రెడ్డి, డి ఇఇ సుభాష్, మరియు ఏఈ సుచిత్ర ఇందిరమ్మ ఇళ్లను పర్యవేక్షించి తొందరగా పూర్తి చేయగలరని కలెక్టర్ ఆదేశించారు.

### రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని

## ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 25 (జనం సాక్షి)**



కామారెడ్డి జిల్లా రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్నటువంటి సేవల గురించి ఆరా తీశారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడి రామారెడ్డి ఆసుపత్రిలో ఉన్నటువంటి సేవల గురించి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో వివిధ విభాగాలలో అందుచున్నటువంటి సేవల గురించి తెలుసుకుని సంతృప్తి చెందారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి చంద్రశేఖర్ కలెక్టర్ వెంట ఉన్నారు. మరియు జిల్లా ఉప వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రభు కిరణ్ జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు. రెండు రోజుల క్రితం దేమే కలాన్ లో ప్రబలిన అతిసార వ్యాధి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గ్రామస్థాయిలో వైద్యులు వైద్య సిబ్బంది ముందుగా చర్యలు చేపట్టి అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. విధుల పట్ల అలసత్వం గానీ అశ్రద్ధ వహించినటువంటి సిబ్బంది పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య శాఖ అధికారిని ఆదేశించారు. రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ సురేష్ సరిగ్గా అందుబాటులో ఉండడం లేదని కొందరు గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చినందున షోకాజ్ నోటీస్ జారీ చేయమని కలెక్టర్ ఆదేశించారు కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి ఇతర రెవెన్యూ శాఖ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్

- రాజేంద్రనగర్ సర్కిల్ 11లో అవినీతి అధికారి
- ఐదు లక్షలు డిమాండ్ చేసి 2 లక్షలు తీసుకుంటుండగా పట్టివేత





**రాజేంద్రనగర్, జూలై 25 (జనంసాక్షి) :** బాధ్యతగా నిర్వర్తించాల్సిన పనుల్లోనూ చేతివాటం ప్రదర్శించేందుకు యత్నించిన ఓ అధికారిని అవినీతి నిరోధక శాఖ రెడ్ అండ్ హ్యాండ్‌గా పట్టుకుంది. ఏసిబీ, సిటీ రేంజ్ డిసిపి శ్రీనివాస్ రెడ్డి తెలిపిన ప్రకారం.. రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి 11వ సర్కిల్ ఉప కమిషనర్ కె.రవి కుమార్ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఓ హోటల్ తనిఖీకి వెళ్లారు. వంటగదిలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారం సాగడంతో విషయం బయటకు రాకుండా ఉండేందుకు హోటల్ సీజ్ చేయకుండా ఉండటానికి ఐదు లక్షలు డిమాండ్ చేశారు. సదరు యజమానిని తరచూ విసిగించడంతో ఉప కమిషనర్ రవికుమార్‌కు రూ. 2 లక్షలకు అంగీకార ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈలోపు బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు హోటల్ వద్ద మాటువేశారు. ఉప కమిషనర్ హోటల్ యజమాని వద్ద లంచంగా తీసుకోవాల్సిన 2 లక్షల సొమ్మును ఏఓకు అందించేలా పురామాయించాడు. ఏసీబీ అధికారులు వెంబడిరచి జిహెచ్ఎంసి కార్యాలయానికి చేరుకొని ఉప కమిషనర్ రవి కుమార్‌ను విచారించగా.. పొంతనలేని సమాధానం చెప్పాడు.

నగదు మొత్తాన్ని ఏఓ నుండి స్వాధీనం చేసుకున్నారు. అధికారులు నిర్వహించిన రసాయన పరీక్షలో ఏఓ రెండు చేతుల వేళ్లు పాజిటివ్‌గా రావడంతో రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి ఉప కమిషనర్ రవికుమార్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగిన సందర్భంలో, చట్ట ప్రకారం చర్య తీసుకోవడానికి ప్రజలు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్‌ను అంటే 1064ను సంప్రదించాలని ఏసీబీ అధికారి శ్రీనివాస్ రెడ్డి కోరారు.

## రైతుల అవసరాలకు సరిపడా అందుబాటులో యూరియా, ఎరువులు

- జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి
- ఎరువుల గిడ్డంగి ఆకస్మికంగా తనిఖీ



**ఎడపల్లి, జూలై 25 (జనంసాక్షి) :** జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్ పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎరువుల విషయంలో ఎవరు కూడా ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఎడపల్లి మండల కేంద్రంలోని సహకార సంఘం ఎరువుల గోడౌన్ ను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిడ్డంగిలో రికార్డులలో పేర్కొన్న విధంగా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయా లేవా అని పరిశీలించారు. ఎరువుల కొనుగోలు కోసం వచ్చిన రైతులను కలెక్టర్ పలుకరించి, సరిపడా ఎరువులు అందుతున్నాయా అని ఆరా తీశారు. జిల్లాలో ఇంకనూ 11 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి రెండు రోజులకు ఒకసారి ఎరువుల స్టాక్ జిల్లాకు వస్తోందని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రాంతాలలో రైతులకు ఎరువులు అందేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లో ఎరువుల కొరత తలెత్తకుండా పర్యవేక్షణ చేస్తున్నామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా రైతులు కూడా తమకు పూర్తి స్థాయిలో ఎరువులు లభిస్తున్నాయని, ఎలాంటి కొరత లేదని సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, రైతులు వరికి ప్రత్యామ్నాయంగా అధిక లాభాలను అందించే ఆయిల్ పామ్ పంట సాగు వైపు దృష్టి సారించాలని కలెక్టర్ హితవు పలికారు. ఈ పంట సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తోందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ పోల మల్లారెడ్డి, సహకార సంఘం కార్యదర్శి రాజారాం తో పాటు సిబ్బంది, స్థానిక నాయకులు ఉన్నారు.









## ఆసియా ఖండంలోనే అరుదైన రోడ్డుకు

# ఇదేమి దుస్థితి!

**అత్యంత పెను ప్రమాదకరంగా గంగ్వార్ ప్రధాన కూడలి**

**తరచూ ప్రమాదాల బారిన ప్రయాణికులు**

**న్యాల్‌కల్, జూలై 25, (జనం సాక్షి) :**

స్వాతంత్రానికి ముందు, నిజాం నవాబుల పాలనలో నిర్మించిన రోడ్డది. ఎలాంటి ప్రమాదకర మూల మలుపులు లేకుండా ఏకంగా దాదాపు 39 కిలో మీటర్ల మేర రోడ్డును నిర్మించారు. అది ఆసియా ఖండంలోనే అరుదైన రోడ్డుగా నేటికీ గుర్తింపున్న రోడ్డది. ఆర్‌అండ్‌బి విశ్రాంతి భవనం, అల్లాదుర్గం ప్రధాన కూడలి నుండి న్యాల్ కల్ మండలం, గంగువార్ ప్రధాన కూడలి మార్గం ద్వారా మెటల్ కుంట రైల్వే స్టేషన్ వరకు రోడ్డును నిర్మించారు. రోడ్డు మధ్య నుండి కుడి, ఎడమ 75 అడుగుల మేరకు రోడ్డును నిర్మించారు. ఐతే ఎంతో చారిత్రక నేపథ్యం గల రోడ్డు ప్రస్తుతం ప్రయాణికులు, వాహన చోదకులకు అత్యంత పెను ప్రమాదకరంగా మారింది. మోస్తారు వర్షం కురిసిందంటే చాలు జహీరాబాద్ - బీదర్ రోడ్డు, గంగువార్ ప్రధాన కూడలి వద్ద అధిక మొత్తంలో వరద నీరు చేరి చిన్నపాటి చెరువును తలపిస్తోంది. ఆ రోడ్డు మార్గాన అనునిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు, వాహన చోదకులు జహీరాబాద్, న్యాల్ కల్, నారాయణఖేడ్, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గంగువార్ ప్రధాని కూడలి వద్ద భారీగా వరద నీరు చేరడంతో పెను ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర, ఆటో వాహన చోదకులు తరచుగా ప్రమాదాల బారిన పడాల్సిన పరిస్థితి నెలకొంది. పాలకులు, జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి వరద నీటిని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహన చోదకులు, చిరు వ్యాపారులు కోరుతున్నారు.



## వికసించిన బ్రహ్మ కమలం

**అమీన్ పూర్ జూలై 25 (జనం సాక్షి) :** అమీన్ పూర్ పట్టణంలోని బీరంగూడలో బ్రహ్మ కమలం వికసించి స్థానికులను ఆకర్షించింది. బీరంగూడ జవహర్ నగర్ కాలనీలో ఉండే రమాదేవి ఇంట్లో ఉన్న బ్రహ్మ కమలం చెట్టుకు గురువారం రాత్రి మూడు పువ్వులు వికసించాయి. శుక్రవారం ఉదయం స్థానికులు ఆ పుష్పాలను చూసేందుకు వచ్చారు. కుటుంబ సభ్యులు ఆ పుష్పాలకి పూజలు నిర్వహించారు. బ్రహ్మ కమలం పుష్పాలు అరుదుగా వికసిస్తాయని స్థానికులు తెలిపారు.

# క్రికెటర్ యశ్ దయాల్‌పై ఫోక్సో కేసు



జైపూర్: ఐపీఎల్ క్రికెటర్ యశ్ దయాల్‌పై మరో లైంగిక వేధింపుల కేసు నమోదు అయ్యింది. ఇప్పటికే ఆ ఆర్సీబీ బౌలర్‌పై యూపీలో ఓ కేసు ఉన్న విషయం తెలిసిందే. జైపూర్‌లోని సంగనీర్ పోలీస్ స్టేషన్‌లో యశ్ దయాల్‌పై కేసు బుక్ అయినట్లు ఓ ఎఫ్ఐఆర్ ద్వారా తెలిసింది. రెండేళ్లుగా ఆ మైనర్ బాలికను రేప్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. క్రికెట్ కెరీర్ కల్పిస్తానని చెప్పి 17 ఏళ్ల అమ్మాయిని యశ్ దయాల్ లైంగికంగా వాడుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సితాపురలోని ఓ హెూటల్‌కు ఆ బాలికను రమ్మని లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో పోలీసులు అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

ఇటీవలే అలహాబాద్ హైకోర్టు దయాల్‌కు రక్షణ కల్పించిన విషయం తెలిసిందే. ఓ మహిళను రేప్ చేసిన కేసులో అతన్ని అరెస్టు చేయరాదు అని ఇటీవల అలహాబాద్ హైకోర్టు తీర్పును ఇచ్చింది. జస్టిస్ సిద్ధార్థ వర్మ, అనిల్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ఆ ఆదేశాలు జారీ చేసింది. అరెస్టుపై స్టే విధించాలని దయాల్ పెట్టుకున్న పిటీషన్‌కు ధర్మాసనం స్పందించింది. 27 ఏళ్ల ఆర్సీబీ క్రికెటర్ దయాల్‌పై జూలై 6వ తేదీన కేసు నమోదు చేశారు. ఘజియాబాద్ జిల్లాలోని ఇందిరాపురం పోలీసు స్టేషన్‌లో ఆ కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహితలోని 69వ సెక్షన్(మాటలతో మోసం చేసి, లైంగికంగా వాడుకోవడం) కింద కేసు బుక్ చేశారు.

# మాంచెస్టర్‌లో హోరాహోరీ

## ఇంగ్లాండ్‌తో భారత్ 4వ టెస్ట్

- రెండో రోజు భారత్ 358 పరుగులకు ఆలౌట్
- 15 ఫోర్లు, 7 సిక్సర్లతో ఏబీ డివిలియర్స్ ఊచకోత



మాంచెస్టర్ టెస్టులో భారత బౌలర్లను పరీక్షిస్తూ.. రికార్డు బ్రేకింగ్ ఇన్నింగ్స్ ఆడిన జో రూట్ (150) ఎట్టకేలకు ఔటయ్యాడు. లంచ్ తర్వాత చెలరేగి ఆడిన అతడిని జడేజా పెవిలియన్ పంపాడు.

మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా 23న ప్రారంభమైన ఇంగ్లాండ్‌తో నాలుగో టెస్ట్ మ్యాచ్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 358 పరుగులు చేసింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్, బెన్ స్టోక్స్ (5/72), జోఫ్రా ఆర్చర్ (3/73) బౌలింగ్‌తో భారత్‌ను కట్టడి చేసింది. భారత బ్యాటర్లలో సాయి సుదర్శన్ (61), యశస్వి జైస్వాల్ (58), రిషబ్ పంత్ (54) రాణించారు. పంత్ మొదటి రోజు కుడి పాదానికి గాయంతో ఆసుపత్రికి తరలించబడ్డాడు, ఇది జట్టుకు గట్టి దెబ్బ. భారత్ టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించగా, జైస్వాల్ (58), కేఎల్ రాహుల్ (46) 94 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యంతో బలమైన పునాది వేశారు. సాయి సుదర్శన్ తొలి టెస్ట్ అర్ధ శతకంతో (61) స్థిరత్వం చూపాడు. పంత్ 37 పరుగుల వద్ద గాయంతో రిటైర్ హర్ట్‌గా వెనుదిరిగి, తర్వాత 54 పరుగులతో ఇన్నింగ్స్ ముగించాడు. రవీంద్ర జడేజా (19లి), శార్దూల్ ఠాకూర్ (19లి) క్రీజులో ఉండగా, మొదటి రోజు చెడు వెలుగు కారణంగా 264/4 వద్ద ఆట ముగిసింది. పంత్, కుడి పాదంలో ఫ్రాక్చర్ ఉన్నప్పటికీ, 75 బంతుల్లో 54 పరుగులు, ఒక సిక్స్‌తో రికార్డు సృష్టించి, ఇంగ్లాండ్‌లో టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు (465) చేసిన వికెట్ కీపర్‌గా నిలిచాడు. అయితే, గాయం కారణంగా ఐదవ టెస్ట్‌కు దూరమయ్యే అవకాశం ఉంది. రెండో రోజు ఇంగ్లాండ్ 46 ఓవర్లలో 225/2 స్కోరుతో బలంగా నిలిచింది, భారత్ స్కోరు కంటే 133 పరుగులు వెనుకబడి ఉంది. బెన్ డకెట్ (94), జాక్ క్రాలీ (84) 166 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యంతో ఆధిపత్యం చెలాయించారు. మూడో రోజు మధ్యాహ్నం వరకు ఇంగ్లాండ్ 253/2 స్కోరుతో భారత్‌పై 105 పరుగుల ఆధిక్యంలో ఉంది. జో రూట్, ఒల్లీ పోప్ స్థిరంగా బ్యాటింగ్ చేస్తూ ఇంగ్లాండ్‌ను బలమైన స్థితిలో నిలిపారు. 112 ఓవర్లకు ఇంగ్లాండ్ స్కోరు 471/4 వద్ద ఉండగా, బెన్ స్టోక్స్ 97 బంతుల్లో 50 పరుగులు చేశాడు. జో రూట్ 138 పరుగులతో కొనసాగాడు. చివరి పది ఓవర్లలో 38 పరుగులు వచ్చాయి. ఇంగ్లాండ్ లీడ్ 113 పరుగులకు చేరుకుంది. 116 ఓవర్లకు ఇంగ్లాండ్ స్కోరు 491/4 వద్ద ఉంది, జో రూట్ 144 పరుగులతో, బెన్ స్టోక్స్ 66 పరుగులతో కొనసాగారు. అయితే, స్టోక్స్ (66) క్రాంప్ కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు. జెమీ స్మిత్ బ్యాటింగ్‌కు వచ్చాడు. 119.2 ఓవర్లలో రవీంద్ర జడేజా బౌలింగ్‌లో జో రూట్ (150) స్టంపౌట్‌గా వెనుదిరిగాడు, ఇంగ్లాండ్ 499/5 వద్ద అయిదో వికెట్ కోల్పోయింది. లియామ్ డాసన్ క్రీజులోకి వచ్చాడు. జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో జెమీ స్మిత్ ఔట్ కావడంతో ఇంగ్లాండ్ 515/6 వద్ద ఆరో వికెట్ కోల్పోయింది. ఇంగ్లాండ్ 124.3 ఓవర్లలో 515/6 స్కోరుతో 157 పరుగుల ఆధిక్యం సాధించింది.

జో రూట్ రాహుల్ ద్రవిడ్, జాక్వెస్ కలిస్‌లను అధిగమించి టెస్టుల్లో రెండో అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. భారత బౌలర్లు, ముఖ్యంగా బుమ్రా (0/78), వికెట్ల కోసం తీవ్రంగా పోరాడుతున్నారు. మాంచెస్టర్‌లో వాతావరణం మేఘావృతంగా, చల్లగా ఉంది, తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ, వేగవంతమైన బౌలర్లకు కొంత సహకారం అందిస్తోంది. ఈ సిరీస్‌లో ఇంగ్లాండ్ 2–1తో ఆధిక్యంలో ఉంది. భారత్ ఈ టెస్ట్‌లో గెలిచి సిరీస్ సమం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది, కానీ పంత్, నీతీష్ రెడ్డి, ఆకాశ్ దీప్ గాయాలతో జట్టు ఇబ్బందులు ఎదుర్కొంటోంది. అన్షుల్ కాంబోజ్ టెస్ట్ అరంగేట్రంలో డకెట్ వికెట్ తీసినప్పటికీ, భారత బౌలింగ్ యూనిట్‌పై ఒత్తిడి ఎక్కువగా ఉంది. రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్, బుమ్రా మెరుగైన ప్రదర్శన చేయాల్సిన అవసరం ఉంది. మూడో రోజు ఇంగ్లాండ్ తమ ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తుంది, భారత్ వికెట్ల కోసం తీవ్రంగా ప్రయత్నించాలి. ఈ మ్యాచ్ ఫలితం సిరీస్ దిశను నిర్ణయించనుంది.

## ఏబీ డివిలియర్స్ ఊచకోత

దక్షిణాఫ్రికా ఆటగాడు ఏబీ డివిలియర్స్ 2025 వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్‌లో దుమ్మురేపుతున్నాడు. ఇంగ్లాండ్ ఛాంపియన్స్‌తో జరిగిన 8వ మ్యాచ్‌లో, డివిలియర్స్ తన తుఫాను బ్యాటింగ్‌తో బౌలర్లను ఆశ్చర్యపరిచాడు. దక్షిణాఫ్రికా ఛాంపియన్స్ తరపున డివిలియర్స్ కేవలం 41 బంతుల్లోనే సెంచరీ చేసి జట్టుకు సులభమైన విజయాన్ని అందించాడు. టోర్నమెంట్‌లో దక్షిణాఫ్రికాకు ఇది వరుసగా రెండో విజయం. ఈ మ్యాచ్‌లో ఏబీ డివిలియర్స్ 51 బంతుల్లో 116 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, 7 సిక్సర్లు కూడా ఉన్నాయి. ఈ విధంగా, దక్షిణాఫ్రికా ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా మ్యాచ్‌ను గెలుచుకుంది.

# వేద.. వీడ్కోలు

- కృష్ణమూర్తి.. విధ్వంసక క్రికెటర్..
- తారాజువ్వలా మెరిసిన ఆటగత్తె!



భారత క్రికెటర్ వేద కృష్ణమూర్తి క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించింది. సుదీర్ఘ కాలం మిడిలార్డర్ బ్యాటర్‌గా జట్టుకు సేవలందించిన ఆమె, అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంది. గత ఐదేళ్లుగా జట్టులో స్థానం సంపాదించలేకపోయిన వేద, సోషల్ మీడియా వేదికగా మనస్ఫూర్తిగా క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు తెలిపింది. విధ్వంసక బ్యాటర్‌గా, చురుకైన ఫీల్డర్‌గా అభిమానులను అలరించిన వేద, చిన్న పట్టణం నుంచి వచ్చి తన కలలను సాకారం చేసుకుంది."కర్నాటకలోని కదూర్ అనే చిన్న పట్టణం నుంచి వచ్చిన నేను, పెద్ద కలలు కన్నాను. చిన్నప్పుడు తెలియ కుండానే బ్యాట్ పట్టాను. అది నన్ను ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని ఊహించలేదు. అమ్మ ప్రోత్సాహంతో అబ్బాయిల ఆటగా భావించే క్రికెట్‌ను ఎంచుకున్నాను. ఆ ఆటను హృదయపూర్వకంగా ప్రేమించాను. చిన్న వీధుల్లో పెరిగిన నన్ను క్రికెట్ పెద్ద స్టేడియాలకు తీసుకెళ్లింది. నిరాశలో ఉన్న నన్ను గర్వంగా టీమ్ ఇండియా జెర్సీ ధరించేలా చేసింది. క్రికెట్ నాకు కెరీర్ మాత్రమే కాదు, చాలా ఇచ్చింది. నా సామర్థ్యం ఏమిటో తెలియజేసింది. కష్ట సమయాల్లో పోరాడటం, పడినా లేవడం నేర్పించింది. ఈ రోజు మనస్ఫూర్తిగా క్రికెట్‌కు వీడ్కోలు చెబుతున్నాను," అని ఆమె పేర్కొంది. ఈ సందర్భంగా తనకు అండగా నిలిచిన తల్లిదం డ్రులు, బీసీసీఐ, సహచరులు, కుటుంబ సభ్యులకు వేద కృతజ్ఞతలు తెలిపింది.

**రెండేళ్ల క్రితం..**

దూకుడే తన మంత్రంగా, తారాజువ్వలా 2011లో జట్టులోకి దూసుకొచ్చిన వేద, దాదాపు తొమ్మిదేళ్ల పాటు దేశానికి ప్రాతినిధ్యం వహించింది. 48 వన్డేలు, 76 టీ20లు ఆడిన ఆమె, చివరిసారిగా 2020లో ఆస్ట్రేలియాలో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో ఆడింది. వన్డేల్లో ఆమె ప్రస్థానం 2018లోనే ముగిసింది. వన్డేల్లో 829 రన్స్, టీ20ల్లో 875 రన్స్ సాధించిన వేద, 2017 టీ20 ప్రపంచకప్ ఫైనల్ ఆడిన భారత జట్టులో సభ్యురాలు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో కర్నాటక, రైల్వే జట్లకు కెప్టెన్‌గా కూడా వ్యవహరించింది.



## వాటర్ పోలోలో జాతీయ స్థాయికి ఎంపికైన రెహమాన్

### ప్రతిభ కనబరిచిన శ్లోక శ్రీవాణి హైస్కూల్ విద్యార్థి

**సంగారెడ్డి టౌన్ జూలై 25 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని డిఎస్ఎ స్విమ్మింగ్ పూల్ నుండి మొహమ్మద్ అబ్దుర్ రెహమాన్ సిద్ధిఖ్ వాటర్ పోలోలో జాతీయ స్థాయిలో ఎంపికైనారు. హైదరాబాద్ గచ్చిబౌలి బాల యోగి స్టేడియంలో ఈనెల 19,20 తేదిలలో 10వ తెలంగాణ జూనియర్, సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జాతీయ స్థాయికి ఎంపికలను నిర్వహించారు. వివిధ విభాగాలలో, వాటర్ పోలో లో జాతీయ స్థాయికి ఎంపికైన స్విమర్స్ కు తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉమేష్ అభినందనలు తెలియజేశారు. ఈ ఎంపికలలో సంగారెడ్డి జిల్లా నుండి వాటర్ పోలలో బాలల విభాగం నుండి మహమ్మద్ అబ్దుర్ రెహమాన్ సిద్ధిఖ్ ఎంపికైనారు. వచ్చేనెల ఆగస్టు 4 నుండి 8 తేదీల వరకు బెంగళూరులో జరిగే 51వ జూనియర్ నేషనల్ ఆక్విటిక్ ఛాంపియన్షిప్ 2025 వాటర్ ఫోలో జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని సంగారెడ్డి జిల్లా స్విమ్మింగ్ ఇంచార్జ్ శేషు కుమార్ తెలిపారు. డివైఎస్ఓ కాసీం బేగ్ అభినందనలు తెలుపుతూ మునుముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# కరీంనగర్ నగరపాలక సంస్థలో సానిటేషన్

**టౌన్ ప్లానింగ్.. ఇంజనీరింగ్.. అధికారులతో సమీక్షా సమావేశం**

**కరీంనగర్ నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 25 (జనంసాక్షి) :** సీజనల్ వ్యాదులు ప్రభలకుండ పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో సానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వర్షాల నేపథ్యంలో చేపట్టే పారిశుధ్య కార్యక్రమాలు, సీజనల్ వ్యాదులకు తీస్కోవాల్సిన చర్యలు, వనమహెూత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటడంతో పాటు తదితర అంశాలపై అధికారులతో చర్చించి, కమీషనర్ పలు సలహాలు సూచనలు చేశారు. సంబంధిత అంశాలపై పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.... కురుస్తున్న వర్షాల పట్ల అధికారులు చాలా అప్రమత్తంగా ఉండి సహాయక కార్యక్రమాలు చేపట్టేలా చూడాలని ఆదేశించారు. నగర వ్యాప్తంగా ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్న, ప్రజల నుండి ఫిర్యాదులు వచ్చిన వాటికి స్పందించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఖాళీ స్థలాలను శుభ్రం చేసి నీరు నిలిస్తే తొలగించాలని తెలిపారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని అన్నారు. విలీన గ్రామాల డివిజన్లతో సహా షిఫ్టుల వారిగా విధులు నిర్వర్తించి చర్యలు చేపట్టాలని కోరారు. పారిశుధ్య పనులను మరింత మెరుగు పర్చాలని ఆదేశించారు. స్వచ్ఛ ఆటోలను డీఆర్ సీసీలకు వెల్లేలా చర్యలు తీస్కోవాని జీపిఎస్ ట్రాకింగ్ రీడీంగ్ రిపోర్టును ప్రతి రోజు అందించాలని అన్నారు. స్వచ్ఛ ఆటోల జీపిఎస్ ట్రాకింగ్ ను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంటోల్‌కు లింక్ చేయాలని అన్నారు. డీఆర్ఎఫ్ సీసీ, డంపుయార్డులు, గార్బేజ్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో త్వరగా సీసీ కెమెరాలు బిగించాలని కోరారు. డంపు యార్డుకు వెల్లే చెత్త వాహనాలను ఎవరు అడ్డుకున్న చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమీషనర్ తెలిపారు. నగరంలో నూతనంగా నిర్మాణం చేసిన పద్మానగర్ సమీకృత మార్కెట్ కు విద్యుత్ కనెక్షన్ పనులను త్వరగా పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీస్కోవాలని, అంభేడ్కర్ స్టేడియంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ షెటర్లను అద్దెకు ఇచ్చేందుకు ఆక్షన్ ప్లాన్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమీషనర్లు వేణు మాధవ్, ఖాధర్ మోహియుద్దీన్, సానిటేషన్ ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ల అంశం వివాదాస్పదం కావద్దు

- ఆధార బాధరగ ఎన్నికలు జరపకండి
- కోర్టు గడువు తీసుకొని, శాస్త్రీయంగా ఎన్నికలు నిర్వహించండి
- బీసీ సాధికారత సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్ల అంశం వివాదాస్పదం కావద్దని, రాష్ట్ర ప్రభుత్వం ఆధార బాధరగ ఎన్నికలు జరపకుండ, కోర్టు గడువు తీసుకొని, శాస్త్రీయంగా ఎన్నికలు నిర్వహించాలని, ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారత సంఘం అధ్యక్షుడు పొలాస నరేందర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల అమలుకు ఆటంకాలు వద్దని, బీసీలు వారి హక్కులను పోరాడి సాధించుకుంటారన్నారు. రానున్న రోజుల్లో బీసీలు రాజ్యాధికారం చేపట్టడం తత్యమన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్షాన్ని డిల్లీకి తీసుకెళ్ళి బిల్లుల ఆమోధంకై,కేంద్రంపై ప్రభుత్వం ఒత్తిడి ఎందుకు చేయలేదని ఆయన ప్రశ్నించారు.ముస్లిమ్స్ పేరుతో బీసీలకు అన్యాయం చేసి దూరం కావద్దని, రిజర్వేషన్ల అంశాన్ని చిక్కుల్లో పడేయొవద్దన్నారు.

శుక్రవారంతో కోర్టు గడువు పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైనప్పటికీ రాష్ట్రంలోని బీసీ రిజర్వేషన్ల బిల్లుల ప్రస్తావన లేదన్నారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో,విద్య,ఉపాధి, ఉద్యోగాల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ల అమలుకు బిల్ – 3, బిల్ – 4 లను రూపొందించి 2025 మార్చ్ 17 న ఉభయ సభల్లో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపి కేంద్ర ప్రభుత్వం ఆమోదంకై పంపిన బిల్లులు ఆమోదం పొందకపోవడం బాధాకరమన్నారు.ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరుపుటకు పంచాయతీ రాజ్ చట్టం – 2018 నీ సవరించి ఆర్డినెన్స్ చేసి గవర్నర్ ఆమోధంకై పంపిన అర్డినెన్స్ ఆమోదం గురించి గవర్నర్ న్యాయ సలహా కొరకు కేంద్ర హెూం శాఖకు పంపించడం జరిగిందన్నారు. హైకోర్టు నెల రోజుల్లో రిజర్వేషన్లను ఖరారు చేయాలని విధించిన గడువు శుక్రవారంతో ముగిసిందన్నారు. శుక్రవారం జరగాల్సిన కేబినెట్ సమావేశం వాయిదా పడిందన్నారు.కేంద్ర ప్రభుత్వం కు చెందిన పలువురు బీజేపీ నేతలు బీసీ రిజర్వేషన్ల అమలు అసాధ్యమని రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్చడం సాధ్యం కాదని ఆనడం వంటి అంశాలతో బీసీ వర్గాలు నిరాశ,నిస్పృహలకు లోనవుతున్నారన్నారు.

## రజని ఫెర్టిలిటీ సెంటర్‌లో ఘనంగా

# ప్రపంచ ఐవిఎఫ్, ఎంబ్రియోలజీ వేడుకలు

- "ఎంబ్రియోలజీ క్రాష్ కోర్సులు ప్రవేశపెట్టిన రజని ఎడ్యుకేషనల్ సొసైటీ"
- రెనే వైద్య సంస్థల మేనేజింగ్ డైరెక్టర్, ఫర్టిలిటీ
- ఎక్స్ పార్ట్ , రజని ఫెర్టిలిటీ సెంటర్ అధినేత్రి డాక్టర్ బంగారి రజని ప్రియదర్శిని.




**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 25 (జనంసాక్షి) :** ప్రపంచ ఐవిఎఫ్, ఎంబ్రియోలజీ డే వేడుకలు కరీంనగర్ ఇందిరా నగర్ లోని రెనే హాస్పిటల్ ఆడిటోరియంలో రెనే వైద్య సంస్థల మేనేజింగ్ డైరెక్టర్, ఫర్టిలిటీ ఎక్స్పర్ట్, రజని ఫెర్టిలిటీ సెంటర్ అధినేత్రి డాక్టర్ బంగారి రజని ప్రియదర్శిని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ యూ ఉమేష్ కుమార్ పాల్గొనగా, గౌరవ అతిథిగా డాక్టర్ ఎం. సరసిజా, డైరెక్టర్ అకాడమిక్ ఆడిట్ సెల్ శాతవాహన యూనివర్సిటీ పాల్గొన్నారు.

ప్రపంచ ఐవిఎఫ్, ఎంబ్రియోలజీ డే సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ రెనే వైద్య సంస్థల డైరెక్టర్ , ఫర్టిలిటీ ఎక్స్పర్ట్ , డాక్టర్ బంగారి రజిని ప్రియదర్శిని ఈ సందర్భంగా మాట్లాడుతూ... అసిస్టెంట్ రిప్రొడక్టివ్ ట్రీట్మెంట్ లోని (ఐవి) ఐవిఎఫ్ విధానం ద్వారా ప్రపంచంలో మొట్టమొదటి సారి 1978 జూలై 25 లో ఇంగ్లాండ్లో లూయిస్ జాయ్ బ్రౌనీ అనే అమ్మాయి జన్మించడం జరిగిందని, ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం జూలై 25 రోజున వరల్డ్ ఐవిఎఫ్ , ఎంబ్రియోలజీ డేను జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. అసిస్టెంట్ రిప్రొడక్టివ్ ట్రీట్మెంట్ లోని వివిధ రకాల అత్యాధునిక వైద్య విధానాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది పిల్లలు లేని దంపతులకు పిల్లలు పుట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా తాను తెలిపారు. వరల్డ్ ఐవిఎఫ్ , ఎంబ్రియాలజీ డే పురస్కరించుకొని రజిని ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా నూతనంగా రెండు ఎంబ్రియాలజీ క్రష్ కోర్సులు ఎంబ్రియాలజీ విభాగంలో ప్రవేశపెడుతున్నట్లు ఈ సందర్భంగా తెలియజేస్తూ.. వివిధ రకాల జీవశాస్త్రంలో పట్టాభద్రులైన యువత ఇట్టి సదవకాశాన్ని ఉపయోగించుకొని (ఐవిఎఫ్) ఐవిఎఫ్ వైద్యరంగంలో వాళ్ళ ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలని తెలిపారు. ఇదే కాకుండా ఐవిఎఫ్ వైద్య విభాగంలో ఎంబ్రియాలజిస్ట పాత్ర ఎంతో గొప్పదని తాను కొనియాడినారు. ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కరీంనగర్ లోని శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ యు ఉమేష్ కుమార్ మాట్లాడుతూ, ఐవిఎఫ్ వైద్యరంగంలో డాక్టర్ బంగారి రజిని ప్రియదర్శిని అందిస్తున్న వైద్య సేవలను కొనియాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఏ రంగంలో కృత్రిమ మేధా ద్వారా ఎంత ఆధునికత సంతరించుకున్న ప్రత్యక్ష గురువుకు మించిన, గురువు లేరని, ప్రతి దానికి గూగుల్ సర్చ్ పరిష్కారం కాదని మరీ ముఖ్యంగా వైద్యరంగంలో ఇలాంటి గూగుల్ సెర్చ్ సొంత వైద్య విధానం ద్వారా ఎన్నో దుష్పరిణామాలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాతవాహన లైన్స్ క్లబ్ నుండి అధ్యక్షులు తిరుపతి రెడ్డి, సెక్రెటరీ చంద్రశేఖర్ గౌడ్, ట్రెజరర్ సురేందర్, సభ్యులు మహేందర్, కార్డియోతోరాసిక్ సర్జన్ డాక్టర్ రవికుమార్, కార్డియాలజిస్ట్ దినకర్, రజని ఫెర్టిలిటీ సెంటర్ చీఫ్ ఎంబ్రాలజిస్ట్ డా.రాజేందర్ యాదవ్, జనరల్ మేనేజర్ బంగారు పవన్ ప్రసాద్, నాన్ క్లినికల్ డైరెక్టర్ మేకల అరవింద్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

**నిజామాబాద్ కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి**



**బోధన్, జూలై 25 (జనంసాక్షి) :** మండలాల వారీగా రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోందని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన సాలూర, బోధన్ పట్టణాల్లో రేషన్ కార్డులో పంపిణీలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 11,852 కొత్త రేషన్ కార్డులతో పాటు 84,232 మంది కొత్త సభ్యుల పేర్లను రేషన్ జాబితాలో చేర్చడం జరిగిందన్నారు. రేషన్ కార్డులు కలిగి ఉన్న వారందరికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు. దీంతో రేషన్ కార్డులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడిందని తెలిపారు. ఫలితంగా కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల పేర్ల నమోదు కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని అన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని వెల్లడించిన కలెక్టర్, అర్హులైన వారు ఇంకనూ మిగిలి ఉంటే ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని, అదే సమయంలో అనర్హులకు కార్డులు రాకుండా పకడ్బందీగా వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసుకోవాలని హితవు పలికారు. ఆయా దశలను అనుసరిస్తూ వెంటదివెంట బిల్లులను వారి ఖాతాలలో జమ చేస్తున్నామని, ఉచిత ఇసుక అందుబాటులో ఉండేలా, లక్ష రూపాయల రుణ సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. లీకేజీలు, ఫ్లోరింగ్ వంటి వాటికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
26 జూలై 2025

# బీసీలను మోసగిస్తే ఊరుకోబోం

- బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్, బీజేపీలది ద్వంద్వ నీతి
- ఢిల్లీ తెలంగాణ భవన్‌లో మీడియాతో మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం, బీజేపీ మోసం చేస్తే తాము ఊరుకునేది లేదని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఒక బీసీ మంత్రిగా... బీసీ బిడ్డగా... ఈ విషయంలో కపట వైఖరిని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అవలంభిస్తే... తాము ప్రజల్లో ఎండగడతామని మంత్రి సురేఖ హెచ్చరించారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఆది శ్రీనివాస్‌లతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. బీసీ బిల్లును తాము అసెంబ్లీలో ప్రవేశపెట్టి... కేంద్రానికి పంపిస్తే... బీజేపీ దాన్ని ఆపిందని... ఇది సహేతుకం కాదన్నారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి దగ్గర ఉందని చెప్పారు. అయితే, దాన్ని ఒప్పుకుంటారా? లేదో రాష్ట్ర ప్రజలకు బీజేపీ, కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని సురేఖ డిమాండ్ చేశారు. బీసీలను మోసం చేసే కార్యక్రమాలు చేయొద్దని బీజేపీని ఆమె హెచ్చరించారు. కాగా, తమ సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతవర్గానికి చెందిన నాయకుడైనా... ఆయా వర్గాలను ఒప్పించి బీసీ హక్కులను కాపాడేందుకు చర్యలు తీసుకున్నట్టు వివరించారు. ఈ దేశంలో దళితులు, గిరిజనులకు రిజర్వేషన్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలోని కూడా తాము ముస్లింలకు రిజర్వేషన్ ఇచ్చామని గుర్తు చేశారు. ఇప్పుడు బీసీలకు రిజర్వేషన్లు ఇస్తున్నది కూడా మేమే అని మంత్రి సురేఖ వివరించారు. సమాజంలో వెనకబడిన వర్గాలు, నిమ్నవర్గాలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ముందు ఉంటుందని చెప్పారు. నిన్న(గురువారం) దేశ రాజధాని ఢిల్లీకి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు, బీసీ మంత్రులతో పాటు నిపుణుల కమిటీ... ఖర్గే ,రాహుల్ గాంధీలతో భేటీ జరిగిందని గుర్తు చేశారు. ఈ భేటీలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణనపై కాంగ్రెస్ అగ్రనాయకత్వం పూర్తి సంతృప్తిని వ్యక్తం చేసినట్టు వివరించారు. ఇక, బీఆర్ఎస్ బీసీ కులగణనలో అసలే పాల్గొనలేదని... వారికి బీసీలపై ప్రేమ ఉండే అవకాశం లేదని మంత్రి విమర్శించారు. ఇప్పటికైనా బీసీలపై బీజేపీ, బీఆర్ఎస్ ద్వంద వైఖరి వీడాలని... సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని ఆ రెండు పార్టీల నేతలకు సూచించారు.

### మామునూరు ఎయిర్ పోర్టుకు నిధులిచ్చినందుకు

# సీఎం రేవంతన్నకు థ్యాంక్స్

హైదరాబాద్ (జనంసాక్షి) : వరంగల్ ప్రాంత దిశదశను మార్చేసే మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులకి అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయగా... అందుకు కృషి చేసిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకి... రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ ధన్యవాదాలు తెలిపారు. రూ.205 కోట్ల నిధులు విడుదల చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. మామునూరు విమానాశ్రయం నిర్మాణానికి భూములిస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.కోటి 20 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించినట్టు వివరించారు. అలాగే ప్లాట్లకు, ఇళ్లకు సైతం న్యాయమైన పరిహారం చెల్లించేందుకు ప్రతిపాదించారు. గత నెల రోజులుగా భూ సేకరణ ప్రక్రియను వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో తాము జిల్లా ఇంఛార్జీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జిల్లాకి చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కృషి చేస్తున్నట్టు వివరించారు. కేరళలోని కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం మాదిరిగా మామునూరు ఉండాలని ప్రణాళికలు రచిస్తున్నట్టు వివరించారు. సుమారు 1,000 ఎకరాల్లో నిర్మించనున్నట్టు చెప్పారు. ఎయిర్ పోర్టు పూర్తయితే, మామునూరు విమానాశ్రయం ప్రారంభమైతే చుట్టుపక్కల ప్రాంతాలే కాకుండా సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి అక్కడికి వెళ్లే రహదారుల వెంట అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనేక పరిశ్రమలు వస్తాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి సురేఖ ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలో కూడా పర్యాటకం అభివృద్ధి చెందుతుందన్నారు.

# సోనియా లేఖ ఆస్కార్‌లాంటిదని అనడం దారుణం

- తెలంగాణ ఆత్మగౌరవం రేవంత్ తాకట్టు
- మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద



హైదరాబాద్, జూలై25 (జనంసాక్షి) : బీసీ రిజర్వేషన్ల అంశం, సోనియా లేఖపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే పట్నం వివేకానంద, బీఆర్ఎస్ నేత క్యామ్ మల్లేశ్ బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్ వ్యాఖ్యలను ఘాటుగా తప్పుబట్టారు. ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సోనియా గాంధీ రాసిన లేఖను తనకు ఆస్కార్ లాంటిదని రేవంత్ ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారన్నారు. అందులో ఆమె కేవలం పవర్ పాయింట్ సమావేశానికి తాను హాజరు కాలేనన్న అంశాన్ని మాత్రమే ప్రస్తావించిందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ గాంధీ కుటుంబానికి చిరునవ్వులు పండించే ప్రయత్నంలో ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కొత్త డ్రామాకు తెరలేపారని విమర్శించారు. సీఎం రేవంత్ అసత్యాలతో బీసీలకు 42 రిజర్వేషన్లు సాధ్యం కాదని తెలిసి కూడా ప్రజలను మభ్యపెడుతున్నారు. ఆయన నటనకు ఆస్కార్ అవార్డు ఇవ్వాల్సిందే, లేకపోతే భాస్కర్ అవార్డు అయినా ఇవ్వొచ్చు అన్నారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌ను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ఆయన అన్నారు. సీఎం రేవంత్ లాగా బ్యాగులు మోసి రాజకీయాల్లో పైకి రాలేదని, ప్రజాసేవతోనే మేము రాజకీయాల్లోకి వచ్చాం అని అన్నారు. ఇక బీఆర్ఎస్ నేత క్యామ్ మల్లేశ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి అబద్ధాల ద్వారా అధికారంలోకి వచ్చారు. అటువంటి వారికి ఆస్కార్ అవార్డు ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్ వ్యాఖ్యలు బీసీలను, సామాజిక గౌరవాన్ని అవమానించ డమేనని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి, చేపలు పట్టేవారిని మంత్రి చేశాను, బట్టలు ఉతికేవారిని ఎమ్మెల్యే చేశానన్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కేటీ-ఆర్ వ్యక్తిత్వంపై కాంగ్రెస్ నాయకులు దూషణలు చేస్తున్నారని మల్లేశ్ మండిపడ్డారు. కేటీ-ఆర్ హీరోయిన్లకు ఫోన్ చేస్తుంటే, మీరు డోర్ దగ్గర కావలిచేస్తున్నారా..? అంటూ కౌంటర్ వేశారు. అలాగే పార్టీ మారిన నేతలపై కూడా మల్లేశ్ తీవ్రంగా స్పందిస్తూ.. అలాంటి పిచ్చికుక్కలను తొండలెక్కించి కొట్టాలి.. రేవంత్ కూడా భవిష్యత్తులో వారిపై వాత పెడతాడన్నారు.

# చిత్తశుద్ధి ఉంటే బీసీ బిల్లు ఆమోదింపజేయండి

- బిజెపి నేతలకు విప్ ఆది శ్రీనివాస్ సవాల్



హైదరాబాద్, జూలై25 (జనంసాక్షి) : భాజపా అగ్రకుల పార్టీ అని, బీసీ బిల్లుకు ఆమోదం తెలపకుండా ఆ పార్టీ నేతలు అనవసరమైన మాటలు మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆక్షేపించారు. బిసిలపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే బిల్లును ఆమోదించేలా ఒత్తిడి తేవాలన్నారు. బిల్లును ఆమోదించాలని కేంద్రం, భాజపా అధిష్ఠానాన్ని ఎంపీ రఘునందన్‌రావు ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కావొద్దని ఆయన కోరుకుంటున్నారని మండిపడ్డారు. మా పీసీసీ అధ్యక్షుడు బీసీ బిడ్డ. మరి మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎవరు? బీసీలకు పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వాలని మీ అధిష్ఠానాన్ని ఎందుకు డిమాండ్ చేయట్లేదు? మేం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం. భవిష్యత్తులో అన్ని అవకాశాలు కల్పించి తీరుతాం. బీసీ బిడ్డ కాకపోయినా మా సీఎం రేవంత్‌రెడ్డి బీసీ బిల్లు తీసుకొచ్చారు. కాంగ్రెస్‌కు రఘునందన్‌రావు పాఠాలు అవసరం లేదు. సామాజిక న్యాయం అంటేనే కాంగ్రెస్. మీ వల్ల కాకపోతే రాహుల్ గాంధీ ప్రధాని అయ్యాక బిల్లును ఆమోదించుకుంటాం అని ఆది శ్రీనివాస్ అన్నారు.

# జగదీప్ ధన్‌ఖడ్‌కు టైప్ 8 బంగళా

### మాజీలకు ఇక్కడే వసతి



న్యూఢిల్లీ, జూలై25 (జనంసాక్షి) : ఉపరాష్ట్రపతి పదవి నుంచి తప్పుకున్న జగదీప్ ధన్‌ఖడ్‌కు కేంద్ర ప్రభుత్వం టైప్ 8 ప్రభుత్వ నివాస బంగళాను కేటాయించింది. ల్యూటియన్స్ ఢిల్లీ ప్రాంతంలో ఉండే -టైప్-8 భవనాలు మాజీ ప్రధాని, మాజీ రాష్ట్రపతుల కోసం ఉద్దేశించినవి. ఇప్పుడు ధన్‌ఖడ్‌కు కూడా ఇక్కడే కేటాయించారు. అత్యున్నత స్థాయి ప్రభుత్వ నివాస బంగళాలను -టైప్ 8గా వర్గీకరించారు. హోం మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఈ కేటగిరీ భవనాలనే కేటాయించారు. మాజీ రాష్ట్రపతి, మాజీ ప్రధానులకు కూడా ఇవే భవనాలను ఇస్తారు. మాజీ రాష్ట్రపతులు ఈ భవనాల్లో తాము జీవించినంతకాలం ఉండేందుకు అనుమతి ఉంది. ఈ మేరకు ప్రెసిడెంట్ (ఫెసిలిటీ-స్) రూల్స్-1962లో ప్రత్యేక నిబంధనలను చేర్చారు. పదవి నుంచి దిగిపోయిన వెంటనే మాజీ రాష్ట్రపతికి ఈ భవనాన్ని కేటాయిస్తారు. రాష్ట్రపతి పదవికి ఉన్న ప్రాముఖ్యత, హోదా, భద్రతావసరాల రీత్యా మాజీ రాష్ట్రపతులకు ఈ బంగళాల్లో జీవితకాలం పాటు- ఉండేందుకు అనుమతినిచ్చారు. ఇక ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థకు అధినేత అయిన ప్రధానికి కూడా రిటైర్మెంట్ తరువాత -టైప్ 8 భవనాన్ని కేటాయిస్తారు. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ కమాండోలతో జెడ్ ప్లస్ సెక్యూరిటీ కల్పిస్తారు. మాజీ ప్రధానికి కూడా తన జీవితకాలమంతా -టైప్ 8 భవనంలో నివసించేందుకు అనుమతి ఉంది. అయితే, మాజీ ఉపరాష్ట్రపతులకు శాశ్వత ప్రాతిపదికన ప్రభుత్వ నివాస భవనాలు కేటాయించే నిబంధనలు ఏవీ ప్రస్తుతం లేవు. కానీ, జెడ్ ప్లస్ సెక్యూరిటీ కల్పించినప్పుడు, కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక అనుమతి ఇచ్చినప్పుడు మాజీ ఉపరాష్ట్రపతులకు టైప్-8 భవనం కేటాయించే అవకాశం ఉంది. ఈ భవనాన్ని ప్రభుత్వ సూచనల మేరకు ఖాళీ చేయకపోతే మార్కెట్ రేటు ప్రకారం అద్దె చెల్లించాల్సి ఉంటుంది.

### బొమ్మారెడ్డిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల

# వార్డెన్ సస్పెన్షన్

సంగారెడ్డి, జులై 25( జనం సాక్షి) : సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలంలోని బొమ్మ రెడ్డి గూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల వార్డెన్ శోభ ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సంక్షేమ అధికారి అఖిలేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ,బియ్యం శుభ్రం చేయకుండా , వంటలు చేసి వడ్డించడం తో విద్యార్థులు తినే అన్నంలో పురుగులు వస్తున్నట్లు విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేయడంతో, విచారణ జరపాలని కలెక్టర్ ఆదేశించడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరిపి నివేదిక సమర్పించినట్లు తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వార్డెన్ శోభ వ్యవహరిస్తున్నట్లు తేలడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు వార్డెన్ ను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లుజిల్లా గిరిజన సంక్షేమ అధికారి సంక్షేమ అధికారి అఖిలేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# సరిహద్దులో పేలిన ల్యాండ్ మైన్

- పేలుడు ధాటికి జవాన్ మృతి

శ్రీనగర్, జూలై25 (జనంసాక్షి) : జమ్మూ కాశ్మీర్‌లో తీవ్ర విషాద ఘటన చోటు చేసుకుంది. పూంచ్ జిల్లాలోని నియంత్రణ రేఖ వెంబడి ల్యాండ్‌మైన్ పేలింది. మందు పాతర పేలుడు ధాటికి ఒక భారత జవాన్ మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అధికారుల వివరాల ప్రకారం.. పూంచ్ జిల్లాలోని కృష్ణ ఘాటి ప్రాంతంలో శుక్రవారం (జూలై 24) రోజు మాదిరిగానే సైనికులు కుంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలోనే ఎప్పుడో అమర్చిన ల్యాండ్ మైన్ బ్లాస్ట్ అయ్యింది. పేలుడి తీవ్రతకు రెజిమెంట్‌కు చెందిన అగ్నివీర్ జవాన్ లలిత్ కుమార్ ప్రాణాలు కోల్పోగా జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ తో సహా మరో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించామని, చికిత్స కొనసాగుతోందని తెలిపారు. ప్రస్తుతం వారి హెల్త్ కండిషన్ నిలకడగానే ఉందని వెల్లడించారు. కాగా, జమ్మూ కాశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి ల్యాండ్‌మైన్ పేలుళ్లు కొత్తేమీ కాదు. 2025, మే నెలలో కూడా ఇలాంటి సంఘటనే ఒకటి చోటు- చేసుకుంది. పూంచ్ జిల్లాలోని ఎల్‌ఓసీ వెంబడి ల్యాండ్ మైన్ పేలి ఓ జవాన్ తీవ్రంగా గాయపడ్డాడు. దిగ్వార్ సెక్టార్‌లోని ఫార్వర్డ్ ప్రాంతంలో సైనికులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.

# నిర్మల్ లోనే ఆయిల్ ఫామ్ పరిశ్రమ నిర్మిస్తాం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన డీసీసీ అధ్యక్షులు..



నిర్మల్ బ్యూరో, జులై 25,(జనంసాక్షి) : నిర్మల్ జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులు ఎలాంటి అధైర్యం పడవద్దని జిల్లాలోనే పరిశ్రమ నిర్మాణం చేపడతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు ఆయనను హైదరాబాద్ లోని సచివాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. నిర్మల్ జిల్లాలో ఆయిల్ ఫామ్ పంటను రైతులు అధిక మొత్తంలో సాగు చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సోన్ మండలం పాక్ పట్ల గ్రామ సమీపంలో పరిశ్రమ నిర్మాణానికి 40 ఎకరాల భూ సేకరణ జరిగిందని, పరిశ్రమను ఇతర జిల్లాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా నిర్మల్ జిల్లాలోనే పరిశ్రమ ఏర్పాటు అయ్యేలా చూడాలని విన్నవించారు. అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి నిర్మల్ లోనే పరిశ్రమ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, నాయకులు రాజేశ్వర్, నరేష్ రెడ్డి తదితరులున్నారు.

# కులగణన హామీని నిలబెట్టుకున్నాం

- బీసీ రిజర్వేషన్లను నీరుగార్చే కుట్రలో బిజెపి
- కాంగ్రెస్ ఢిల్లీ సమావేశాల్లో అన్ని అంశాలు చర్చించాం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



న్యూఢిల్లీ, జూలై25 (జనంసాక్షి) : ఢిల్లీలో అఖిల భారత నాయకత్వంతో కీలక సమావేశాలు జరిగాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిన్న ఖర్గే నివాసంలో తెలంగాణలో కులగణన, బీసీ రిజర్వేషన్లపై చర్చ జరిగింది.. భారత్ జోడో యాత్రలో అసమానతలు గమనించి కులగణన చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.. కేంద్రంలో అధికారంలోకి రాకపోయినా.. తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు- చేసిన కాంగ్రెస్ కుల గణన చేసింది అన్నారు. 56 ప్రశ్నలతో.. 150 ఇండ్లను ఒక బ్లాక్ గా చేసి, శాస్త్రీయ బద్దంగా కులగణన చేశాం.. సర్వేలో మూడున్నర కోట్ల ప్రజలు స్వచ్ఛందంగా తమ సమాచారం ఇచ్చారు.. బీసీ రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును గవర్నర్ కు పంపించాం.. రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉంది.. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కాంగ్రెస్ ఆలోచిస్తుంది.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో పాటు- కాంగ్రెస్ పార్టీ ఎంపీలకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చాం.. తెలంగాణ భవిష్యత్ నిర్మాణానికి అద్భుతమైన సర్వేను సిద్ధం చేశారనీ అగ్రనాయకులు చెప్పారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

ఇక, బీజేపీ అభ్యంతరాలు చెప్పాలనుకుంటే అసెంబ్లీలోనే లేవనెత్తాల్సింది.. ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుంటే బీజేపీ నేతలు భయపడుతున్నారని మంత్రి పొన్నం ఎద్దేవా చేశారు. కిషన్ రెడ్డి జాగ్రత్త.. ప్రతిపక్ష నాయకుడిగా బీజేపీ బీసీకి అవకాశం ఇవ్వలేదు.. బండి సంజయ్ ను తొలగించి.. కిషన్ రెడ్డి ప్రెసిడెంట్ అయ్యారు.. తెలంగాణలో కమలం పార్టీ గెలిచే అవకాశం లేదు.. బీఆర్ఎస్ తో కుమ్మక్కై

రాష్ట్రంలో ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.. ముస్లీంల రిజర్వేషన్లు గురించి బీజేపీ మాట్లాడుతుంది.. ముందు మీరు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోముస్లీం రిజర్వేషన్లు తొలగించండి అని సవాల్ విసిరారు. బీజేపీ బీసీ రిజర్వేషన్లను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రారంభమయ్యే రిజర్వేషన్లు.. చట్ట సభల వరకు పోతాయన్నారు. బీజేపీ బీసీలకు వ్యతిరేకం.. వారిపై తిరుగుబాటు- తప్పదు.. తెలంగాణలో బీజేపీ బ్రతకడానికి ఎంఐఎం జపం చేస్తుంది.. ఎంఐఎం, బీజేపీ జపం చేస్తుందని పొన్న ప్రభాకర్ విమర్శించారు.

# యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటాం

### జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రు నాయక్



బెల్లంపల్లి, జులై 25, (జనంసాక్షి) : యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రు నాయక్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన బెల్లంపల్లి పట్టణంలోని ఎరువుల దుకాణాలను, గోదాములను తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, అమ్మకం వివరాలు పరిశీలించారు. ప్రతి దుకాణం ముందు ఎరువుల నిల్వ వివరాలు, ధరల వివరాల పట్టిక ఉండాలని ఆదేశించారు. డీలర్లు ఎవరైనా యూరియా కృత్రిమ కొరత సృష్టించినా, ఎంఆర్పి కంటే అధిక ధరలకు అమ్మినా లైసెన్స్ రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యూరియాను జిల్లా దాటిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. జిల్లాకు సరిపడ యూరియా అందుబాటులో ఉందని అన్నారు. రైతులు పుకార్లు నమ్మి ముందుగానే యూరియా అధికంగా కొని పెట్టుకోవద్దని అన్నారు. యూరియా విడతల వారీగా మండలాలకు వస్తుందని, రైతులు కూడా విడతల వారీగా కొనుగోలు చేసుకొని, విడతల వారీగా వినియోగించు కోవాలన్నారు. యూరియా కొరత లేదని, రైతులు సంయమనం పాటించాలన్నారు. ఆయన వెంట ఏడిఏ రాజ నరేందర్, మండల వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

# పూర్తిస్థాయి నీటిమట్టానికి హుస్సేన్ సాగర్



హైదరాబాద్, జూలై25 (జనంసాక్షి) : ఎగువ ప్రాంతాలనుంచి వస్తున్న వరద ప్రవాహంతో హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. బంజారా, కూకట్ పల్లి, బుల్కాపూర్ నాలాలనుంచి హుస్సేన్ సాగర్ కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో హుస్సేన్ సాగర్ నీటి మట్టం ఫుల్ ట్యాంక్ లెవెల్‌కు చేరింది. హుస్సేన్ సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 513.41 మీటర్లు కాగా.. ప్రస్తుతం నీటిమట్టం 513.19 మీటర్లకు చేరింది. పరిధి దాటకుండా వాటర లెవెల్ ను మెయింటెన్ చేస్తున్నారు అధికారులు. తూముల ద్వారా మిగతా నీటిని మూసిలోకి విడుదల చేస్తున్నారు. హుస్సేన్ సాగర్ కు ఎగువనుంచి 400 క్యూసెక్కుల ఇన్ ఫ్లోలో వస్తుండగా..776 క్యూసెక్కుల నీటి ని ఔట్ ఫ్లోలో ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ వరదనీరు అశోక్ నగర్, దోమలగూడ, అంబర్ పేట్ గోల్నాక ద్వారా వెళ్లి మూసీ లో వరద నీరు కలుస్తోంది.

# రాజ్యసభ సభ్యుడిగా కమల్ ప్రమాణం



న్యూఢిల్లీ, జూలై25 (జనంసాక్షి) : నటుడు కమల్ హాసన్ సహా తమిళనాడు నుంచి కొత్తగా ఎన్నికైన నలుగురు రాజ్యసభ సభ్యులు శుక్రవారం రాజ్యసభ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం చేసిన ఇతర ముగ్గురు ఎంపీలు రాజాతి, ఎస్ఆర్. శివలింగం, పి.విల్సన్. కమల్ హాసన్ ఎంఎన్ఎం పార్టీకి చెందినవారు కాగా, మిగిలిన ముగ్గురు డిఎంకెకి చెందినవారు. నలుగురు సభ్యులు తమిళంలో ప్రమాణస్వీకారం చేశారు. తమిళనాడుకు చెందిన ఆరుగురు సభ్యులు గురువారం తమ పదవీకాలం పూర్తయిన తర్వాత పదవీ విరమణ చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370